




ESTD: 1999
www.voodayam.com

# వుదయం

వరంగల్ | 21-03-2026శనివారం | సంపుటి : 11 | సంచిక : 273 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur
Follow us on







# సంక్షేమమే ధ్యేయం

## అభివృద్ధి పరమాశయం.. అనితర ఆదర్శ పాలన అందిస్తున్నాం



**బడ్జెట్ పెట్టుబడి రూ.3,24,234 కోట్లు** | **రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు** | **మూలధన వ్యయం రూ.47,267 కోట్లు** (గతేడాది కంటే రూ.20 వేల కోట్లు అధికం)

**శాఖల వారి కేటాయింపులు (కోట్లలో)**

- విద్యాశాఖ –26,674
- వైద్యారోగ్య శాఖ- 13,679
- హోం శాఖ -11,907 కోట్లు
- వ్యవసాయ శాఖ -23,179
- విద్యుత్ శాఖ - 21,285
- పౌరసరఫరాల శాఖ- 7,366
- స్త్రీ, శిశు సంక్షేమం -3,143
- మున్సిపల్ శాఖ -17,907
- రైతు భరోసా రూ.18 వేల కోట్లు
- వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 12,511 కోట్లు
- పంచాయతీ రాజ్ -33,688
- ఆర్ అండ్ బీ -12,789
- ఆరు గ్యారంటీలకు రూ.50,713
- గృహజ్యోతి - రూ.2,080

**హైదరాబాద్, మార్చి 20 (వుదయం ప్రతినిధి) :** 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 2025–26 పద్దు రూ.3.04 లక్షల కోట్లు కాగా.. ఈ ఏడాది రూ.3.24 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. రంగాల వారీగా కేటాయింపు వివరాలను భట్టి విక్రమార్క సభా వేదికగా వెల్లడించారు. ఈ బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు రూ.50,713 కోట్లు, ఆర్థికశాఖకు రూ.60,438 కోట్లు కేటాయించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖలకు భారీగా నిధులు కేటాయించారు.హోంశాఖతో పాటు విద్య, పట్టాభివృద్ధి రంగాలకు పెద్దపీట వేశారు. అంత్యంత ప్రాధాన్యతమైన ఆర్థిక శాఖలకు రూ.60438 కోట్లు కేటాయించగా సాధారణ పరిపాలనశాఖకు రూ.1190 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్య కు రూ.5443 కోట్లు, రాష్ట్రంలో శాంతి భద్రత పర్యవేక్షించే హోంశాఖకు రూ.11907 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్యం రూ.3,747 కోట్లు, పట్టణాభివృద్ధి శాఖ రూ.17,907 కోట్లు, ప్రణాళికశాఖ రూ.7971 కోట్లు, రెవెన్యూ శాఖకు రూ.4020 కోట్లు, మాధ్యమిక విద్య రూ.21,231 కోట్లు, రవాణాశాఖ రూ.4,491 కోట్లు కేటాయించారు. రైతు భరోసా పథకానికి రూ.18 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. చేయూత పథకానికి రూ.14,861 కోట్లు.. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూ.5,500 కోట్లు.. మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు.. రైతులు పండించిన సన్న వడ్ల బోనస్‌కు రూ.3,500 కోట్లు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే గృహ జ్యోతి పథకానికి రూ.2,080 కోట్లను కేటాయించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకానికి రూ.1,143 కోట్లు.. మహాలక్ష్మి పథకం కింద ఎల్పీజీ సబ్సిడీకి రూ.723 కోట్లు.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి రూ. 600 కోట్లు.. పవర్ సబ్సిడీకి రూ.14 వేల కోట్లు.. బియ్యం సబ్సిడీకి రూ.3 వేల కోట్లు.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ స్కీంకు రూ.3,683.. విద్యార్థుల డైట్ ఛార్జీల కోసం రూ.2,170 కోట్లు.. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు రూ.4,343 కోట్లు.. ఆఫీస్ ఖర్చులకు రూ.2,323 కోట్లు కేటాయించారు.ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే లక్ష్యంగా బడ్జెట్ ను రూపొందించినట్లు చెప్పారు. అంబేడ్కర్ అడుగుజాడల్లోనే పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో తలసరి ఆదాయం 10.2 శాతం పెరిగి రూ.4,18,931 లక్షలకు చేరిందని ప్రకటించారు. 2024–25తో పోలిస్తే 2025–26లో తెలంగాణ రాష్ట్ర జీడీపీ 10.6 శాతం మేర పెరిగిందన్నారు. జాతీయ సగటు వృద్ధి రేటు కంటే తెలంగాణ జీఎస్‌డీపీ 2.7 శాతం ఎక్కువగా ఉందన్నారు.



**బీఆర్ఎస్ వాకౌట్**

అంతకుముందు ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలులో కేబినెట్ సమావేశం నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదించారు. ప్రజా భవన్ నల్ల పోచమ్మ ఆలయం వద్ద బడ్జెట్ ప్రతులకు భట్టి పూజలు నిర్వహించారు.

**బీఆర్ఎస్ వాకౌట్..** ఓ వైపు బడ్జెట్ పై భట్టి విక్రమార్క ప్రసంగిస్తుండగానే బీఆర్ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. బడ్జెట్ రాష్ట్ర ప్రజల అవసరాలు తీర్చేలా లేదని విమర్శిస్తూ.. చెవుల్లో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం తెలంగాణ అసెంబ్లీ, మండలి సోమవారానికి వాయిదా పడ్డాయి.

**ఆరు గ్యారంటీలకు రూ. 50వేల కోట్లు**

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు పెద్దపీట వేసింది. ఈ పథకాల అమలు కోసం రూ.50 వేల కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పేదలు, వృద్ధులు, ఆసరా అవసరమైన వారికి భట్టి భారీ ఊరటనిచ్చారు. కొత్తగా మరో 2 లక్షల మందికి 'చేయూత' పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు.

మిగతా 2లో



## రూ. 2 పెరిగిన ప్రీమియం పెట్రోల్ ధర

**న్యూఢిల్లీ, మార్చి 20 (వుదయం) :** పశ్చిమాసియా యుద్ధ సెగలు నెమ్మదిగా భారతీయులను చేరుకుంటున్నాయి. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) శుక్రవారం నాడు ప్రీమియం పెట్రోల్ ధరలను లీటరుపై రూ. 2 నుంచి రూ.2.30కు పెంచింది. ఈ పెంచిన ధరలు శుక్రవారం నుంచే అమలులోకి వస్తున్నాయి. అయితే, హెచ్‌పిసిఎల్ సాధారణ పెట్రోల్ ధరలలో ఎటువంటి మార్పు లేదు. ఈ ధరల పెంపుకు నిర్దిష్ట కారణాన్ని ప్రభుత్వ రంగ పెట్రోలియం కంపెనీ ఇవ్వనప్పటికీ, ఇజ్రాయెల్– యుఎస్, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం, ప్రపంచ ముడి చమురు ధరలలో ఏర్పడిన హెచ్చుతగ్గులు, లాజిస్టిక్స్ ధరలు ఈ నిర్ణయానికి కారణమై ఉంటాయి. ప్రీమియం పెట్రోల్‌ను ప్రధానంగా లగ్జరీ, స్పోర్ట్స్, అత్యాధునిక కార్లలో ఉపయోగిస్తారు కాబట్టి, ఈ ధరల పెంపు ప్రభావం బాగా డబ్బున్న కొనుగోలుదారులపై పడుతుందని అంచనా. హై-ఆక్టేన్ ఫ్యూయల్ లేదా పవర్ పెట్రోల్ అని కూడా పిలిచే ప్రీమియం పెట్రోల్‌ను మెరుగైన ఇంజిన్ పనితీరు, మైలేజ్ కోసం ఉపయోగిస్తారు. అంతకుముందు, హెచ్‌పిసిఎల్ ఎక్స్‌పై చేసిన పోస్టులో, ముడి చమురు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదు. అదనపు కార్గోలు ఇప్పటికే మార్గంలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో భారతదేశ సరఫరా స్థితిని మరింత బలోపేతం చేస్తాయి అని పేర్కొంది. అలాగే, వదంతులను నమ్మవద్దని, అధికారిక అప్‌డేట్‌లను విశ్వసించాలని, ప్రజలను కోరింది. ఇరాన్ పలు గల్ఫ్ దేశాల్లోని ఇంధన మౌలిక సదుపాయాలపై దాడి చేసిన తర్వాత చమురు ధరలు చుక్కలనంటాయి. అంతకుముందు రోజు, కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా నౌకలకు సురక్షిత మార్గాన్ని కల్పించే ప్రయత్నాలలో చేరడానికి ఐరోపా దేశాలు, జపాన్ ముందుకు రావడంతో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. అమెరికా కూడా చమురు సరఫరాను పెంచుతామని హామీ ఇచ్చింది.

ఉన్నతాధికారుల బదిలీకి వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించిన టిఎంసి 3

# ఆరు గ్యారంటీలకు గోరీ

- హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేరుతో ఉన్న పథకాలకూ నిధుల్లేవు
- రాష్ట్ర బడ్జెట్ పై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపణ

**హైదరాబాద్, మార్చి 20 (ఎఎంఎస్) :** ప్రభుత్వం తాను ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో ఆరు గ్యారంటీలకు గోరి కట్టిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పై ఆయన బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేరుతో పథకాలు ఉన్నా నిధులు మాత్రం కేటాయింపు లేదని ఎద్దేవా చేశారు. బడ్జెట్ ను చూస్తుంటే భట్టి బడ్జెట్ బోగస్ బడ్జెట్ అని అర్థమవుతోందన్నారు. గతంలో నిధులు ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించారని మీ ప్రభుత్వంలో స్కాములు తప్ప స్కీములు ఉన్నాయా అని ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండు సున్నా మాత్రమే అన్నారు. ఈ ప్రభుత్వం మూడేళ్లు కూడా నిండకముందే రూ. 3 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో తలసరి ఆదాయ వృద్ధి 12.1శాతం తలసరి ఉంటే మీ పాలనలో అది 10.2 శాతం ఉందని ఇది కాంగ్రెస్ పరిపాలన వైఫల్యానికి నిదర్శనం అన్నారు. వెనుక ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చొబెట్టుకుని భట్టి రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనతో రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ పేరుతో, హైదారాబాద్ ను మూడు ముక్కలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందని ఆరోపించారు. ఇది క్యూర్ మోడల్ కాదు చోరీ మోడల్ అని ఎద్దేవా చేశారు. కూల్చడం మీద ఉన్న ప్రేమ నిర్మాణాలపై లేదన్నారు.



# రాష్ట్రంలో విపత్తుల శిక్షణా కేంద్రం

## అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు • డిజాస్టర్ మేనేజిమెంట్‌పై సమీక్షలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మార్చి 20 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన, పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందన్నారు. విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్★ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.



ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమీషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ పాల్గొన్నారు.

# కువైట్ రిఫైనరీపై దాడి

## రోజు రోజుకి మరింతగా రాజుకుంటున్న పశ్చిమాసియా యుద్ధం

**వుదయం డెస్క్, మార్చి 20 :** కువైట్‌కు వ్యూహాత్మకంగా కీలకమైన మినా అల్–అహ్మది రిఫైనరీపై శుక్రవారం తెల్లవారుజామున పలు డ్రోన్లు దాడి చేశాయి. కువైట్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడి జరిగిందని ఆ ప్రభుత్వ చమురు సంస్థ పేర్కొంది. తెల్లవారుజామున ఈ రిఫైనరీని లక్ష్యం గా చేసుకున్నారని, దీని ఫలితంగా దానిలోని కొన్ని ఆపరేషనల్ యూనిట్లలో అగ్నిప్రమాదం జరిగిందని కువైట్ పెట్రో లియం కార్పొరేషన్ (కెపిసి) ధృవీకరించింది. ప్రాణనష్టం జరిగినట్లు తక్షణ నివేదికలు ఏవీ లేవని అధికారులు తెలిపారు.



**ఎలాంటి ప్రాణనష్టం లేదు; కొనసాగుతున్న నష్ట అంచనా ప్రక్రియ**

ఈ దాడి అనంతరం ఎటువంటి గాయాలు లేదా మరణాలు సంభవించలేదని ప్రాథ మిక నివేదికలు ధృవీకరించాయి. అయితే, నిర్మాణాత్మక, నిర్వహణాపరమైన నష్టంపై సమగ్ర అంచనా ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. కాగా, రిఫైనరీ ఉత్పత్తికి కలిగిన అంతరాయం తీవ్రతకు సంబంధించిన మరిన్ని వివరాలు మాత్రం ఇంకా అస్పష్టంగానే ఉన్నాయని కెపిసి అధికారులను ఉటంకిస్తూ, ఆ ప్రభుత్వ వార్తా సంస్థ ఈ ఘటన గురించి నివేదించింది.

**కువైట్ చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి**

కువైట్‌లో ఉన్న ఈ చమురు శుద్ధి కర్మా గారం, ఈ ప్రాంతంలోనే అత్యంత పెద్ద, కీలకమైన చమురు శుద్ధి కేంద్రాలలో ఒకటి. ఈ దాడుల అనంతరం, మంటలను అదుపులోకి తీసుకురావడానికి, జరిగిన నష్టం తీవ్రతను అంచనా వేయడానికి అత్యవసర సహాయక బృందాలను సంఘటనా స్థలానికి పంపారు. ఈ అగ్నిప్రమాదం శుద్ధి కర్మాగారంలోని కొన్ని విభాగాలపై ప్రభావం చూపినప్పటికీ, భద్రతా నియమావళిని తక్షణమే అమలులోకి తీసుకురావడం ద్వారా పరిస్థితిని అదుపులోకి తెస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# అమెరికా దాడిలో ఇరాన్ అధికారి మృతి

## ఇజ్రాయెల్‌కు సరికొత్త క్షిపణి రానున్నదని హెచ్చరించిన వెంటనే జరిగిన పరిణామం

**వుదయం డెస్క్, మార్చి 20 :** గల్ఫ్‌లో అమెరికా నావికాదళం ఉందని చేస్తున్న వాదనలను ధిక్కరిస్తూ, రాబోయే ఆకస్మిక దాడి గురించి శత్రువునుహెచ్చరించిన కొన్ని గంటలలోనే ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)కు చెందిన ఒక సీనియర్ అధికారి అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హతమయ్యారు. తమ ప్రతినిధి అలీ మహమ్మద్ నైని తెల్లవారుజామున అమెరికన్–జియోనిస్ట్ పక్షం జరిపిన నేరపూరిత, పిరికిపంద ఉగ్రవాద దాడిలో అమరులయ్యారు అని ఐఆర్‌జిసి పేర్కొంది. ఆయన పరివర్తనాత్మక ఆలోచనలు, సమర్థవంతమైన నమూనాలు అహంకార శక్తులకు వ్యతిరేకంగా తమకు మార్గ నిర్దేశం చేస్తూనే ఉంటాయి, అని ఐఆర్‌జిసి పేర్కొంది. యుఎస్– ఇజ్రాయెల్‌కు అలీ మహమ్మద్ నైనీ ఆఖరి హెచ్చరిక మరణానికి ముందు తన చివరి ప్రకటనలో, ఇరాన్ ఇకపై యురేనియంను శుద్ధి చేయలేదని

మిగతా 2లో

# సంక్షేమమే ధ్యేయం

మొదటి పేజీ తరువాయి

**అసెంబ్లీలో నాలుగోసారి బడ్జెట్**

**ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క**

**శాసన మండలిలో బడ్జెట్**

**ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**అసెంబ్లీలో భట్టి ప్రసంగం**

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాం**

**రెండేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం**

**దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నాం**

**రాష్ట్రాభివృద్ధి కోసం**

**శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం**

**దేశంలోనే తెలంగాణను నంబర్‌వన్‌గా నిలుపుతాం**

**బడ్జెట్‌లో రైతు సంక్షేమం, మహిళా సాధికారిత, యువతకు ఉపాధి వంటి వాటికి ప్రాధాన్యం ఇచ్చాం**

**తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట**

**ప్రతి పౌరుడికి సామాజిక,**

**ఆర్థిక న్యాయం అందించడమే మా లక్ష్యం**

**అసెంబ్లీకి ముందు కేబినెట్ భేటీ..**

**బడ్జెట్ ప్రతిపాదనలపై ఆమోదం**

**భట్టి ప్రసంగంపై బీఆర్ఎస్ అభ్యంతరం**

**బడ్జెట్ రాష్ట్ర ప్రజల అవసరాలు**

**తీర్చేలా లేదని విమర్శ**

**సభ నుంచి వాకౌట్**

విద్యాశాఖ –26,674
వైద్యారోగ్య శాఖ– 13,679
హోం శాఖ –11,907 కోట్లు
వ్యవసాయ శాఖ –23,179
విద్యుత్ శాఖ – 21,285
పౌరసరఫరాల శాఖ– 7,366
స్త్రీ, శిశు సంక్షేమం –3,143
ఎస్సీ అభివృద్ధి– 11,784
ఎస్టీ అభివృద్ధి– 7,937
మైనారిటీ సంక్షేమం–3769
వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 12,511 కోట్లు
ఇరిగేషన్ – 22, 615
మున్సిపల్ శాఖ –17,907
పశుసంవర్ధక శాఖ –1,529
రాజీవ్ యువ వికాసం –6,000
గృహ నిర్మాణం –7,430
ఐటీ శాఖ –875
చేనేత, జౌళి శాఖ –258
పరిశ్రమల శాఖ –3,490
పంచాయతీ రాజ్ –33,688
ఆర్ అండ్ బీ –12,789
న్యాయ శాఖ– 2,367
టూరిజం– 1,224
గోదావరి పుష్కరాలకు రూ. 500 కోట్లు కేటాయింపు
ఆరు గ్యారంటీలకు రూ.50,713 కోట్లు
గృహజ్యోతి – రూ.2,080 కోట్లు
రాజీవ్ ఆరోగ్యశ్రీ ట రూ.1,143 కోట్లు
మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ – రూ.723 కోట్లు
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా – రూ.600 కోట్లు
రైతు భరోసా – రూ.18 వేల కోట్లు
చేయూత – రూ.14,861 కోట్లు
ఇందిరమ్మ ఇళ్లు – రూ.5,500 కోట్లు
మహాలక్ష్మి పథకం – రూ.4,305 కోట్లు
వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ – రూ.3,500 కోట్లు
విద్యుత్ రాయితీ – రూ.14 వేల కోట్లు
కళ్యాణలక్ష్మి పథకం – రూ.3,683 కోట్లు
ఉపకారవేతనాలు – రూ.4,343 కోట్లు

**బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..**

**1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు**

**జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు**

**ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటన**

**ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం**

**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం.**

**ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు**



కాగా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలుకు చర్యలు చేపట్టింది. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్... ఇప్పటికే ఈ గ్యారెంటీల్లో కొన్నింటిని అమలు చేస్తోంది. మరికొన్ని హామీలు మాత్రం మిగిలిపోయాయి. దీనిపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల అమలుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించింది. 6 గ్యారెంటీలకు భారీగా నిధులను కేటాయించింది. ఈ పథకాల అమలు కోసం ఏకంగా రూ.50,713 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది.

### మూసీ పునరుజ్జీవానికి రూ. 1500 కోట్లు

మూసీ నది ప్రాజెక్టు కోసం రూ.1500 కోట్లు కేటాయిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం రూ.5 వేల కోట్లు.. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం కోసం రూ.1,056 కోట్లు.. ఉస్మానియా యూనివర్సిటీకి రూ. వెయ్యి కోట్ల కేటాయింపులు చేసినట్లు భట్టి వివరించారు.

### ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డిజిటల్ కార్డులు

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను ప్రారంభిస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు 421 ఎంప్యానెల్ ప్రయివేట్ ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చికిత్స పొందవచ్చని తెలియజేసారు. ఇందులో భాగంగా ప్రతి ఉద్యోగికి డిజిటల్ కార్డు అందిస్తామని వెల్లడించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 3 టిమ్స్ ఆస్పత్రులను ఈ ఏడాది చివరికి ప్రారంభిస్తామన్నారు. నిమ్స్ ఆస్పత్రి విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తో సహా మొత్తం 6,582 టెర్షియరీ కేర్ బెడ్లు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.

**ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం..** ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. 2026–27 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు నూతనంగా బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. మూడు రోజులు అల్పహారంతోపాటు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందిస్తామని భట్టి ప్రకటించారు. తెలంగాణలోని ఏ విద్యార్థి కూడా ఆకలితో అలమటించొద్దనే ఉద్దేశంతో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి రూపకల్పన చేశామని మంత్రి తెలిపారు. ఐటీఐలు, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ బడ్జెట్లో విద్యా రంగానికి రూ.26,674 కోట్లు కేటాయించారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమాలకు గుండె కాయ ఉస్మానియా యూనివర్సిటీకి రాష్ట్ర బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. వర్సిటీ అభివృద్ధికి రూ. 1000 కోట్లు కేటాయించారు. ఈ నిధులు మౌలిక సదుపాయాల కల్పన, పాత భవనాల పునరుద్ధరణ, నూతన హాస్టల్ భవనాల నిర్మాణానికి వినియోగించనున్నారు. ఈ కేటాయింపులతో యూనివర్సిటీలో అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. ఇక విద్యార్థులకు అవసరమైన క్రీడా ప్రాంగణాలు, క్యాంపస్ సుందరీకరణ పనులకు కూడా ఈ నిధులు వెచ్చించనున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### మెట్రో రెండో దశకు రూ. 600 కోట్లు

హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 విస్తరణకు ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించింది. మెట్రో నిర్వహణను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటుందని, పాతబస్తీ, ఎయిర్‌పోర్ట్ కారిడార్లకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. నగర మౌలిక వసతుల కోసం హెచ్–సీఐటీటీ కింద రూ.2,654 కోట్లు, తాగునీటి ప్రాజెక్టుల కోసం భారీ నిధులను బడ్జెట్‌లో కేటాయించినట్లు చెప్పారు. హైదరాబాద్ మహానగరానికి జీవనాడిగా ఉన్న మెట్రో రైల్ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలనే నిర్ణయం రాష్ట్ర రవాణా చరిత్రలో ఒక సాహసోపేతమైన, ప్రజానుకూలమైన నిర్ణయమన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రస్తుతం రోజుకు సుమారు 5 లక్షల ప్రయాణికులకు సేవలందిస్తోందన్నారు. ఈ సౌకర్యాన్ని పాతబస్తీకి విస్తరించడంతో పాటు మెట్రో ఫేజ్–11 కింద కొత్త కారిడార్లు నిర్మించి నెట్వర్‌ను విస్తరించే ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందన్నారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో పాతబస్తీ, శంషాబాద్ విమానాశ్రయం, హైటెక్ సిటీ దాటి ఇతర ప్రాంతాలకు మెట్రో విస్తరణ అత్యవసరంగా మారిందన్నారు. ఇక దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఇప్పటికే ఖ్యాతి గడించిందన్నారు. అంతర్జాతీయ నగరాలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందన్నారు. ప్రజలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత భాగస్వాములు తదితరుల సహకారంతో అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో ముందుందన్నారు. అయినా, ప్రభుత్వం అక్కడితోనే ఆగకుండా తెలంగాణలోని ప్రతి పట్టణం, ప్రతి నగరం హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో పట్టణీకరణ శాతాన్ని పెంచగలిగామన్నారు. ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పడానికి ఇది ఒక నిదర్శనమన్నారు. నగర నీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి తాగునీటి ప్రాజెక్ట్, కొత్త రిజర్వాయర్లు, 39 మురుగునీటి శుద్ధి కేంద్రాలను మంజూరు చేశామన్నారు. వాటి నిర్మాణం వివిధ దశలలో కొనసాగుతోందని చెప్పారు. పాత జీహెచ్ఎంసీ సంస్థకి ఉన్న అధిక వడ్డీ అప్పుల గురించి సంబంధిత బ్యాంకులతో చర్చించి వడ్డీ రేటును 9.15 శాతం నుండి 7.95 శాతానికి తగ్గించామన్నారు. హైదరాబాద్ నగర మౌలిక వసతుల అభివృద్ధి కోసం హెచ్–సిఐటిఐ పథకం కింద 2 వేల 654 కోట్ల రూపాయలు కేటాయించామని భట్టి విక్రమార్క వెల్లడించారు.

### జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్పారు. ఈ ఏడాది జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అసెంబ్లీలో ప్రకటించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పేద, ధనిక అనే తేడాలు లేకుండా రాష్ట్ర ప్రజలందరికీ ఈ బీమాను వర్తింపజేస్తామని తెలిపారు. ఏపీ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి, అసంఘటిత రంగంలోకి కార్మికులకు బీమా రక్షణ కల్పిస్తోంది. ఈ పథకం కింద ప్రభుత్వమే బీమా ప్రీమియాన్ని చెల్లిస్తోంది. అయితే తెలంగాణ ప్రభుత్వం కుటుంబ ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించడం గమనార్హం. ఈ పథకం అమల్లోకి వస్తే.. చాలా వరకు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. ఎస్టీల సంక్షేమానికి రూ.12,600 కోట్లు కేటాయించారు. ఈ నిధులను 'ఇందర సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా ఖర్చు చేయనున్నారు. 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపు సెట్లను అందించి, ఆరు లక్షల ఎకరాల పోడు భూముల్లో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన తోటల పెంపకాన్ని ప్రోత్సహించి 2.10 లక్షల గిరిజన రైతులకు లబ్ధిచేకూర్చనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ పథకాన్ని ఇప్పటికే అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రాంరంభించామని, దీని విధివిధానాలు అధ్యయనం చేసి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని భట్టి తెలిపారు.

**ఐటీకి రూ.875 కోట్లు..** బడ్జెట్‌లో ప్రభుత్వం ఐటీ శాఖకు భారీగా నిధులు కేటాయించింది. గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందించాలన్న లక్ష్యంతో రూ.875 కోట్లను కేటాయించింది. ఇప్పటికే టీ–ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని 424 మండలాల్లోని 8888 గ్రామపంచాయతీలకు, 4800 ప్రభుత్వ సంస్థలకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అనుసంధానం చేసింది. ఈ ఆర్థిక సంవత్సంలో మరో 50 వేల ప్రభుత్వ సంస్థలకు కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ సంస్థల ఇంటర్నెట్‌ను సేవలను తగ్గించడంతోపాటు ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వం టీ–ఫైబర్ ద్వారా సురక్షితమైన హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

### ఐటీలో 9.39 లక్షల మందికి ఉద్యోగాలు

ఐటీ రంగంలో తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధి దేశానికే తలమానిరంగా మారిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో 1500 కంటే ఎక్కువ ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు ఉన్నాయన్నారు. తెలంగాణలో ఐటీ రంగంలో వృద్ధి పెంచడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉపాధి కల్పన కోసం 1వ, 2, ఐసీటీ విధానాలను ప్రభుత్వం ప్రారంభించిందని భట్టి వెల్లడించారు. వీటితోపాటు ఎలక్ట్రానిక్స్ పాలసీ, ఇమేజ్ పాలసీలను ప్రభుత్వం తీసుకొస్తున్న చెప్పారు. తెలంగాణ నుంచి ఐటీ ఎగుమతులు 3.13 లక్షల కోట్లకు 9.39 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశీలు కల్పిస్తున్నాయని భట్టి వివరించారు. హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కొత్తగా డా.బి.ఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను నిర్మించబోతున్నట్లు భట్టి ప్రకటించారు. రూ.368.27 కోట్ల అంచనా వ్యయంతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవనాలు, విగ్రహాలు మంజూరు చేశామని తెలిపారు. హైదరాబాద్ లోని నింబోలి అడ్డ కాచిగూడలో బాబూ జగ్జీవన్ రామ్ పేరుతో నూతన వసతి గృహాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. అంతరాలు లేని సమాజం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సామాజిక న్యాయం చేయాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. వసతి పాఠశాలలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

**ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపై..**
ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని భట్టి అన్నారు. తాము అధికారంలోకి వచ్చే సమయంలో 2023–24 ఆర్థిక సంవత్సరం నాటికి సబ్ ప్లాన్ చట్ట ప్రకారం ఖర్చు చేయాల్సిన నిధులలో ఎస్సీలకు చెందిన రూ.13 ,617 కోట్లు, ఎస్టీలకు చెందిన 1,317 కోట్లు కలిసి మొత్తం 14,934 కోట్లు ఖర్చు కాకుండా ఉందన్నారు. తమ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో చేసిన కేటాయింపులతో పాటు ఈ బకాయిలను కూడా అదనంగా కేటాయించామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఈ క్యారీ ఫార్వర్డ్ చేయవలసిన నిధులు, ఎస్సీలకు రూ7,757 కోట్లు, ఎస్టీలకు రూ.1,754 కోట్లు ఖర్చు చేయవలసి ఉంది. వాటిని మేము 2026–27 ఆర్థిక సంవత్సరంలో కేటాయించాల్సిన మొత్తానికి అదనంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెందిన బకాయిలను కూడా కేటాయిస్తున్నామన్నారు.



## పీపుల్స్ సెంట్రిక్ బడ్జెట్

**ప్రజలే కేంద్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టాం**

**వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ బీమా**

**ఉద్యోగులకు రూ. కోటి బీమా**

**ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చాం**

**మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి చిట్ చాట్**

**హైదరాబాద్, మార్చి 20 (వుదయం ప్రతినిధి) :** మాది పీపుల్స్ సెంట్రిక్ బడ్జెట్ అని ప్రజలే కేంద్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం మీడియాతో ఆయన చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఎలాంటి వివక్ష లేకుండా బీమా సౌకర్యం కల్పించామని చెప్పారు. ఉద్యోగులు అందరికీ రూ. కోటి బీమా కల్పించామని చెప్పారు. వాస్తవిక బడ్జెట్ కాబట్టే ఇక్కడితో ఆగామని బీఆర్ఎస్ మాదిరిగా చేసి ఉంటే బడ్జెట్ మూడు లక్షల 30 వేల కోట్ల వరకు వెళ్లేదని సెటైర్ వేశారు. అలా కాకుంటా వాస్తవ అంచనాలతో రూ.3,24,234 కోట్లతో బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలో తాము ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చామని వెల్లడించారు. తద్వారా అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు. తాము ప్రవేశ పెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షల ప్రతిరూపం అని పీడిత, తాడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇస్తున్న భరోసా అన్నారు. ఒక వైపు ఆర్థిక పరమైన ఒడిదుడుకులు ఎన్ని ఎదురైనా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఏమాత్రం నిధుల కొరత రాకుండా ఈ బడ్జెట్ ను సమతుల్యంగా రూపొందించామని చెప్పారు. పన్నుల భారంతో సామాన్యుడి పైన భారం మోపకుండా ఉన్న వనరులను సద్వినియోగం చేస్తూ కొత్త సంపద సృష్టించి దానిని ప్రజలకు పంచడమే మా ప్రజా ప్రభుత్వ ఆర్థిక విధానం అని చెప్పారు.

## చెవిలో పువ్వు పెట్టుకుని బీఆర్ఎస్ నిరసన



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ప్రారంభించగానే, బీఆర్ఎస్ సభ్యులు వినూత్న నిరసనకు దిగారు. ప్రభుత్వం ప్రజలను 'చెవిలో పూలు' పెట్టి మోసం చేస్తోందని అర్థం వచ్చేలా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా తమ చెవులలో పూలు పెట్టుకుని సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకు ముందు బడ్జెట్ ప్రసంగం ప్రారంభం కాగానే, ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని ఆరో పిస్తూ నినాదాలు చేశారు. ముఖ్యంగా 'ఆరు గ్యారంటీల' అమలు తీరుపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వాకౌట్ చేసిన అనంతరం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎంట్రీ వద్దకు చేరుకుని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'తులం బంగారం మోసం మోసం' అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వం పేద మహిళలను వంచించిందని ఆరోపించారు. 'రెండు లక్షల ఉద్యోగాలు మోసం మోసం' అంటూ యువతకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు. ఇక 'బడ్జెట్ మోసం మోసం' అంటూ, ఈ బడ్జెట్‌లో పేదలకు, రైతులకు, మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదని బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు.


---

మావోయిజం నిర్మూలనకు

## తెలంగాణ ఆదర్శం

- **అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **ఫ్యూడలిస్టిక్ సామాజిక, ఆర్థిక,**

**అసమానతులను రూపుమాపితేనే ఉద్యమం అంతం**



**హైదరాబాద్, మార్చి 20 (వుదయం ప్రతినిధి) :** నక్సలిజం పుట్టుకకు కారణమైన ఫ్యూడలిస్టిక్ సామాజిక, ఆర్థిక అసమానతులను రూపుమాపడం ద్వారానే నక్సలిజం ఉద్యమం అంతం అవుతుందని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క్ అభిప్రాయపడ్డారు. సమగ్ర సంక్షేమం, ఉపాధి ద్వారానే నిజమైన మార్పు సాధ్యమని తెలంగాణ నిరూపించిందని వెల్లడించారు. ఈ విధానంలో మనం దేశానికే మార్గదర్శకంగా మారామని చెప్పారు. నక్సలిజం అంతం, లొంగుబాట్లపై అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. ఈ బడ్జెట్‌లో హోంశాఖకు రూ.11,907 కోట్ల కేటాయించినట్టు తెలిపిన భట్టి.. మావోయిస్టుల లొంగుబాట్లపై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 347 మంది మావోయిస్టులు లొంగిపోతే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబర్ 7 నుంచి 2026 మార్చి 8 వరకు 732 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. సరెండర్ అయిన వారికి పునరావాసం కల్పిస్తున్నట్లు తెలిపారు. గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్సలిజాన్ని శాంతి–భద్రతల సమస్యగానే చూశాయని చెప్పారు. ఈ క్రమంలో నక్సలిజాన్ని అణిచివేడానికి పోలీస్, సైనిక బలగాలను ఉపయోగించాయన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమస్య మూలాలను విశ్లేషించి చర్యలు తీసుకుందన్నారు. యువతకు సరైన జీవనోపాధి, సామాజిక గౌరవం, ఆర్థిక భరోసా అడవుల్లోకి వెళ్లిన వాళ్లు సైతం ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలుస్తారనే సామాజిక ఆర్థిక వాస్తవాన్ని తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ విధానంలోనే ప్రజా ప్రభుత్వం అనుసరించిన దార్శనిక విధానం దేశానికి ఆదర్శ నమూనాగా నిలిచిందని భట్టి పేర్కొన్నారు.

## అమెరికా దాడిలో ఇరాన్ అధికారి మృతి

మొదటి పేజీ తరువాయి

లేదా బాలిస్టిక్ క్షిపణులను తయారు చేయలేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు చేసిన వాదనను ఆ బ్రిగేడియర్ జనరల్ బహిరంగంగా ఎగతాళి చేశారు. ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్‌తో యుద్ధం చేస్తూనే టెహ్రాన్ క్షిపణి పరిశ్రమ అత్యున్నత స్థాయికి చేరుకుందని ఆయన అన్నారు. యుద్ధ సమయంలో కూడా ఇరాన్ క్షిపణుల ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోందని, ఎటువంటి ఆందోళనకు లోను కావల్సిన అవసరం లేకుండా తగినన్ని యుద్ధ సామాగ్రి ఉందని అన్నారని ఫార్స్ వార్తా సంస్థ ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తూ పేర్కొంది. శత్రువుకు అనేక ఆశ్చర్యాలు ఎదురుకానున్నాయని; యుద్ధం ముందుకు సాగుతున్న కొద్దీ, అవి మరింత సంక్లిష్టంగానూ, తీవ్రంగానూ మారతాయని నైని పేర్కొన్నారు.

ఇరాన్ నౌకాదళం ధ్వంసమైందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదనలను ఆ సీనియర్ సైనిక అధికారి తోసిపుచ్చారు. పర్షియన్ గల్ఫ్‌లోకి నౌకలను పంపాలని వాషింగ్టన్‌కు ఆయన సవాలు విసిరారు. ఇరాన్ నౌకాదళం నాశనమైందని ట్రంప్ అన్నారు కదా? ఆయనకు దమ్ముంటే తన నౌకలను పర్షియన్ గల్ఫ్‌లోకి పంపమనండి, అని ఆయన అన్నట్లు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది. అయితే, ఆ సంస్థ అతని సందేశాన్ని ప్రసారం చేసిన కొద్దిసేపటికే, అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో అతను మరణించాడని రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది.

### ఇజ్రాయెల్ వాదన

మధ్యప్రాచ్యంలో యుద్ధం మూడవ వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో, టెహ్రాన్ ఇకపై యురేనియంను శుద్ధి చేయడం గానీ, బాలిస్టిక్ క్షిపణులను తయారు చేయడం గానీ చేయలేదని నెతన్యాహు పేర్కొన్నారు.
20 రోజుల తర్వాత నేను మీకు చెప్పగలను–– ఈ రోజు ఇరాన్‌కు యురేనియంను శుద్ధి చేసే సామర్థ్యం లేదు, బాలిస్టిక్ క్షిపణులను ఉత్పత్తి చేసే సామర్థ్యం కూడా లేదు," అని ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దండయాత్ర ప్రారంభమైన తర్వాత తన మొదటి ప్రత్యక్ష విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు.
మేం ఈ సామర్థ్యాలను అణచివేయడాన్ని కొనసాగిస్తున్నాం. మేం వాటిని ధూళిగా, బూడిదగా మారుస్తాం, అని ద్విభాషా విలేకరుల సమావేశాన్ని ప్రారంభిస్తూ హీబ్రూలో ఒక ప్రకటనలో ఆయన అన్నారు. ఇరాన్ ఎప్పటికన్నా బలహీనంగా ఉందని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఒక ప్రాంతీయ శక్తి అయినప్పటికీ, కొందరు దానిని ప్రపంచ శక్తి అని కూడా అంటున్నారని అని ఇజ్రాయెల్ ప్రధాని అభిప్రాయపడ్డారు.

## ఆరు గ్యారంటీలను అటకెక్కించిన కాంగ్రెస్

**మాజీ మంత్రి: జగదీశ్ రెడ్డి**



**హైదరాబాద్, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ముప్పేట దాడికి దిగింది. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈ బడ్జెట్ ప్రజలందరినీ వంచించేలా ఉందని, అందరి చెవిలో పూలు పెట్టే ప్రయత్నాన్ని రేవంత్ సర్కార్ చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2,500 ఇస్తామని రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారని... ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. ఇది ఆడబిడ్డలను నట్టేట ముంచడం కాదా? అని ప్రశ్నించారు. రైతు భరోసాపై నమ్మక ద్రోహం చేశారని ఆయన మండిపడ్డారు. ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. కనీసం పాత పద్ధతిలో ఇవ్వాల్సిన రూ. 12 వేలు అయినా ఎప్పుడు ఇస్తారో కూడా బడ్జెట్‌లో స్పష్టత లేదని ధ్వజమెత్తారు. రైతులకు ఇచ్చిన ప్రతి మాట ఉత్తమాటగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగుల ఆశలపై కూడా ప్రభుత్వం నీళ్లు చల్లిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. "వృద్ధులకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మౌనంగా ఉండటం దారుణం. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ బడ్జెట్‌లో చిన్న కేటాయింపు కూడా లేదు" అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్ ప్రజల అభివృద్ధి కోసం కాదని, కేవలం కాంగ్రెస్ నేతలు కుంభకోణాలు చేసుకోవడానికే పనికొస్తుందని జగదీశ్ రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పక్కదారి పట్టించేందుకే అంకెల గారడీ చేస్తున్నారని విమర్శించారు.

## బీసీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది

**మాజీ మంత్రి గంగుల కమలాకర్**



**హైదరాబాద్, మార్చి 19 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఏమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. గతంలో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఈ బడ్జెట్‌లో వారిని మోసం చేసిందని ఆరోపించారు. బీసీలకు కేటాయించాల్సిన రూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది? అని గంగుల ప్రశ్నించారు. కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించి బీసీల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన బీసీ ఆత్మ గౌరవ భవనాల భూములను ప్రస్తుత ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా అబద్ధాలు చెబుతోందని గంగుల కమలాకర్ విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని ఇంతకు ముందు ఒక మంత్రి చెప్పారని, ఇప్పుడు మాత్రం కేసీఆర్ హయాంలో కార్డులు ఇవ్వలేదని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేశారని... ఇది ప్రజల చెవిలో పువ్వు పెట్టడమే అని విమర్శించారు.

# జాతీయం-అంతర్జాతీయం

## వాణిజ్య నౌకలపై
# దాడులు ఆమోదయోగ్యం కాదు



**వుదయం డెస్క్, మార్చి 20:**
ఇరాన్ అమెరికా యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా పెరుగుతున్న ఇంధన సంక్షోభం నడుమ అంతర్జాతీయ జలాల్లో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం పట్ల భారత్ తీవ్రంగా స్పందించింది. ఐఎంఒ మండలి 36వ ప్రత్యేక సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, చర్చలు, దౌత్యం ద్వారా ఉద్రిక్తతలను తగ్గించాలని భారతదేశం నిరంతరం పిలుపునిస్తోందని యుకెలోని భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి పేర్కొన్నారు.పరిణామం చెందుతున్న పరిస్థితిపై భారతదేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. అత్యంత సంయమనం పాటిస్తూ, పౌరుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, చర్చలు, దౌత్యం ద్వారా ఉద్రిక్తతలను తగ్గించాలని పిలుపునిస్తూనే ఉంది, అని దొరైస్వామి అన్నారు.
అంతేకాకుండా, వాణిజ్య నౌకలు, పౌర సముద్ర మౌలిక సదుపాయాలపై ఇటీవల జరిగిన దాడుల నేపథ్యంలో, ముగ్గురు భారతీయ నావికులతో సహా అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం తెలుపుతూ, చర్చలు దౌత్యం ద్వారా మాత్రమే ఉద్రిక్తతలను తగ్గుతాయని దొరైస్వామి నొక్కి చెప్పారు.
బాధిత నావికుల కోసం భారతదేశం ఏర్పాటు చేసిన 24గంటల హెల్ప్‌లైన్‌ను, అలాగే 2018లో స్థాపించిన, భారత నావికాదళం ఆధ్వర్యంలో నడుస్తున్న ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ - ఇండియన్ ఓషన్ రీజియన్స్ (ఐఎఫ్‌సిఐఓఆర్) సమాచార మార్పిడిలోనూ, సహాయక చర్యల సమన్వయంలోనూ పోషిస్తున్న కీలక పాత్రను ఆయన ప్రస్తావించారు.వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, పౌర సముద్ర మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదు. నావికులతో సహా ఇటువంటి దాడుల వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోవడం, గాయపడటంతో పాటు, అందరికీ ప్రమాదాలు పెరిగాయి. ప్రపంచ నావికా కార్మిక శక్తిలో సుమారు 13 శాతం వాటాతో, నావికులను సరఫరా చేసే మొదటి మూడు దేశాలలో భారతదేశం ఒకటి. నావికులందరి భద్రత, సంక్షేమం పట్ల తాము తీవ్ర ఆందోళనతో ఉన్నామని దొరైస్వామి అన్నారు.
వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, పౌర సిబ్బందిని ప్రమాదంలో పడవేయడం, హోర్ముజ్ జలసంధితో సహా అంతర్జాతీయ జలమార్గాల ద్వారా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన నౌకాయానానికి ఆటంకం కలిగించడం ఆమోదయోగ్యం కాదని మేము పునరుద్ఘాటిస్తున్నాం. అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా వాణిజ్య, వ్యాపార నౌకలు తమ నౌకాయాన హక్కులను, స్వేచ్ఛను వినియోగించుకోవడాన్ని గౌరవించాలి, అని ఆయన అన్నారు.

**వాణిజ్య నౌకలపై దాడులను\ ఖండించిన ఐఎంఒ**

అంతర్జాతీయ సముద్ర సంస్థ మండలి, వాణిజ్య నౌకలపై ఇరాన్ చేస్తున్న బెదిరింపులను, దాడులను ఖండించింది. గల్ఫ్ ప్రాంతంలో పౌర నౌకాయానాన్ని పరిరక్షించడానికి అంతర్జాతీయ సమన్వయం అవసరమని కోరింది. గురువారం లండన్‌లో జరిగిన మండలి 36వ అసాధారణ సమావేశంలో, అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాల నుండి వాణిజ్య నౌకలను స్వచ్ఛంద ప్రాతిపదికన సురక్షితంగా తరలించడానికి వీలుగా, సముద్ర భద్రతా కారిడార్ వంటి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రోత్సహించాలని ఒక నిర్ణయాన్ని ఆమోదించారు.

## పార్టీ అధ్యక్షుడిగా
# నితీష్ ఏకగ్రీవ ఎన్నిక?



**పాట్నా, మార్చి 20 (వుదయం ):**
జనతాదళ్ (యునైటెడ్) అధ్యక్ష పదవికి గురువారం నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన నితీష్ కుమార్, ఆ పదవిని నిలుపుకోనున్నారు.
పార్టీ అగ్ర పదవికి నామినేషన్ దాఖలు చేసిన ఏకైక వ్యక్తి ఆయనే కావడంతో ఉపసంహరణల గడువు అనంతరం ఆయనను ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటిస్తారని భావిస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు మార్చి 22 కాగా, అధికారిక ప్రకటన మార్చి 24న వెలువడనుంది. పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికను మార్చి 16వ తేదీన, నితీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నికైనట్టు ప్రకటించిన తర్వాత ప్రకటించారు. డిసెంబర్ 2023లో నితీష్ కుమార్ ఆ పదవిని చేపట్టక ముందు, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) పార్టీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించారు.కాగా, నితీష్ కుమార్ తరపున, జెడి(యు) కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా, బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రవణ్ కుమార్, పార్టీ ఎమ్మెల్సీ సంజయ్ గాంధీ సహా ఇతర నాయకులు — న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో, పార్టీ రిటర్నింగ్ అధికారి, మాజీ ఎంపీ అయిన అనిల్ ప్రసాద్ హెగ్డేకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. సీనియర్ నాయకుడు శరద్ యాదవ్ స్థానంలో, నితీష్ కుమార్ ఏప్రిల్ 2016లో తొలిసారి జెడి(యు) జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2019లో తిరిగి ఎన్నికయ్యారు, కానీ 2020లో పదవి నుండి వైదొలిగి, ఆర్‌సిపి సింగ్‌కు మార్గం సుగమం చేశారు.
నితీష్ కుమార్ మరోసారి బాధ్యతలు స్వీకరించాలని పార్టీ సభ్యులు కోరుతున్నారని ఝా పేర్కొన్నారు. అంతేకాక, ఆయన ఢిల్లీలోని పార్టీ కార్యాలయాన్ని ఇకపై తరచుగా సందర్శిస్తారని కూడా తెలిపారు.
ఝా రాజ్యసభ ఉపసభాపతిగా పదోన్నతి పొందే అవకాశం ఉన్నందున, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి కూడా ఖాళీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత బాధ్యతల్లో ఉన్న హరివంశ్ నారాయణ్ సింగ్ పదవీకాలం ఏప్రిల్ 9న ముగుస్తుంది, పైగా ఆయన ఎగువ సభకు తిరిగి నామినేట్ కాలేదు.

## బదిలీలకి వ్యతిరేకంగా
# కోర్టును ఆశ్రయించిన టిఎంసి

**కోల్‌కత, మార్చి 20 (వుదయం):**
రాష్ట్రంలో పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను భారత ఎన్నికల కమిషన్ బదిలీ చేయడాన్ని పశ్చిమ బెంగాల్ అధికార తృణమూల్ కాంగ్రెస్ కలకత్తా హైకోర్టులో సవాలు చేసింది.
ఆదివారం నాడు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ బెంగాల్ ఎన్నికల తేదీలను ప్రకటించిన అనంతరం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హోం కార్యదర్శి, అలాగే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి), కోల్‌కతా పోలీస్ కమిషనర్ వంటి ఇతర ఐపిఎస్ అధికారులతో సహా పలువురు ఉన్నతాధికారుల బదిలీకి సంబంధించి జారీ చేసిన ఆదేశాలపై సందేహాలను లేవనెత్తుతూ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది కళ్యాణ్ బెనర్జీ హైకోర్టులో ఒక పిటిషన్‌ను దాఖలు చేశారు.
ఈ వ్యవహారంలో పిటిషనర్, సిఇసిని ప్రతివాదిగా చేర్చారు.ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ముందు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, పిటిషన్‌పై త్వరగా విచారణ జరపాలని న్యాయవాది కోరారు.నిర్ణయాలు తీసుకునే ముందు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా చేపట్టిన బదిలీలను ప్రశ్నిస్తున్న ఈ పిటిషన్‌పై, వచ్చే వారం ప్రారంభంలో విచారణ జరిగే అవకాశం ఉందని ఈ విషయంతో పరిచయం ఉన్న ఒక న్యాయవాది తెలిపారు. 294 మంది సభ్యులు కలిగిన పశ్చిమ బెంగాల్ శాసనసభకు ఎన్నికలు ఏప్రిల్ 23 29




తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగనుంది.గురువారం మధ్యాహ్నం ఎక్స్ పై ఈసీఐపై విమర్శలు గుప్పించిన కొన్ని గంటల తర్వాత, అదే రోజు సాయంత్రం గ్యానేష్ కుమార్‌కు రాసిన ఒక అధికారిక లేఖలో మమతా, బెంగాల్‌కు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను యధేచ్ఛగా బదిలీ చేయడం ద్వారా ఆయన మర్యాద, రాజ్యాంగబద్ధత హద్దులన్నింటినీ దాటారని ఆరోపించారు. రాష్ట్రాన్ని పరిపాలనా అస్థిరత, అస్తవ్యస్తతలోకి నెట్టడానికి ఇది ఒక ఉద్దేశపూర్వక ప్రయత్నమని ఆమె సూచించారు.ఈ పరిస్థితి ఎమర్జెన్సీని లేదా పరోక్ష కేంద్ర పాలనను తలపించింది. ఎన్నికల సంఘం చర్యలు స్పష్టమైన పక్షపాతాన్ని, రాజకీయ ప్రయోజనాలకు ఇబ్బందికరమైన లొంగుబాటును ప్రదర్శించాయి అని సీఈసీకి రాసిన ఆమె తాజా లేఖలో పేర్కొన్నారు.
ప్రధాన కార్యదర్శి, హోం కార్యదర్శి, పోలీసు ఉన్నతాధికారులతో పాటు జిల్లా మేజిస్ట్రేట్‌లతో సహా పోలీసు, పౌర పరిపాలన విభాగాల్లోని డజన్ల కొద్దీ ఇతర అధికారులను ఏకపక్షంగా మార్చడం రాష్ట్ర వ్యవహారాల్లో ప్రత్యక్ష జోక్యానికి పాల్పడటమేనని ఆమె అన్నారు.
అంతకుముందు, ఉన్నతాధికారులు, పోలీసు అధికారులను రాత్రికి రాత్రే బదిలీ చేసినందుకు ఆమె ఈసీఐపై విమర్శలు గుప్పించారు.కమిషన్‌పై తన విమర్శల తీవ్రతను పెంచుతూ, ముఖ్యమంత్రి ఎక్స్ పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు, ఎన్నికల కమిషన్ బెంగాల్‌ను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.
ఎన్నికల అధికారిక ప్రకటన వెలువడక ముందే, చీఫ్ సెక్రటరీ, హోం సెక్రటరీ, డీజీపీ, ఏడీజీలు, ఐజీలు, డీఐజీలు, జిల్లా మేజిస్ట్రేట్లు, పోలీసు సూపరింటెండెంట్లతో సహా 50 మందికి పైగా సీనియర్ అధికారులను ఏకపక్షంగా, అకస్మాత్తుగా తొలగించారు. ఇది పరిపాలనా చర్య కాదు; ఇది అత్యున్నత స్థాయి రాజకీయ జోక్యం, అని ఆమె పేర్కొన్నారు.

# గల్ఫ్ లో 6 భారతీయుల మృతి,1గల్లంతు




**న్యూఢిల్లీ, మార్చి 20 (వుదయం):**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో గల్ఫ్ ప్రాంత వ్యాప్తంగా జరిగిన వేర్వేరు సంఘటనలలో ఆరుగురు భారతీయులు మరణించగా, ఒకరు కనిపించకుండా పోయినట్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. సహాయం, స్వదేశానికి తరలించడం కోసం భారతీయ మిషన్లు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్టు మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు.
సౌదీ అరేబియాలోని రియాద్‌లో మార్చి 18న ఒక భారత జాతీయుడు మరణించాడు. దీనితో గల్ఫ్ ప్రాంతంలో మరణించిన భారతీయుల సంఖ్య ఆరుకు చేరింది. మరణానికి దారితీసిన పరిస్థితులు ఇంకా అస్పష్టంగానే ఉన్నాయి. ఇటీవలి సంఘటనల కారణంగా మార్చి 18న రియాద్‌లో ఒక భారత జాతీయుడు విషాదకరంగా మరణించినందుకు మా ప్రగాఢ సంతాపం అని పేర్కొంది. మృతుని కుటుంబం, స్థానిక అధికారులతో తాము సంప్రదింపులు జరుపుతున్నామని కూడా పేర్కొంది. ఈ విషయంలో అన్ని రకాల సహాయాన్ని సాధ్యమైనంతవరకు అందించడానికి మేము కట్టుబడి ఉన్నామని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో జోడించింది. గల్లంతైన వ్యక్తిని గుర్తించి, మృతుల మృతదేహాలను భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి పలు దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు అధికారులతో కలిసి పనిచేస్తున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖలోని గల్ఫ్ అదనపు కార్యదర్శి అసీమ్ ఆర్. మహాజన్ తెలిపారు. సౌదీ అరేబియా, ఒమన్, ఇరాక్, యూఏఇల లోని తమ రాయబార కార్యాలయాలు గల్లంతైన భారత పౌరుల గురించి, అలాగే మరణించిన భారత పౌరుల పార్థివ దేహాలను త్వరగా భారతదేశానికి రప్పించడం కోసం సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి, అని అంతర్ మంత్రిత్వ శాఖల సమావేశంలో మాట్లాడుతూ మహాజన్ అన్నారు.గల్ఫ్ ప్రాంతం నుండి ప్రయాణ పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని, ఇప్పటికే గణనీయ సంఖ్యలో ప్రయాణికులు భారతదేశానికి తిరిగి వచ్చారని ఆయన తెలిపారు. ఆ ప్రాంతం నుండి అదనపు విమానాలు నడుస్తుండటంతో పరిస్థితి మరింత మెరుగుపడుతోంది. ఫిబ్రవరి 28 నుండి, ఆ ప్రాంతం నుండి సుమారు 3 లక్షల మంది ప్రయాణికులు భారతదేశానికి తిరిగి వచ్చారు, అని ఆ అధికారి పేర్కొన్నారు.
మహాజన్ ప్రకారం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విమానయాన సంస్థలు కార్యాచరణ, భద్రతను బట్టి పరిమిత సంఖ్యలో షెడ్యూల్ చేయని విమానాలను నడపడం కొనసాగిస్తున్నాయి. నేడు కూడా, యూఏఇలోని వివిధ విమానాశ్రయాల నుండి భారతదేశానికి సుమారు 90 విమానాలు నడుస్తాయని అంచనా వేస్తున్నాం," అని ఆయన తెలిపారు. ఒమన్, సౌదీ అరేబియా నుంచి కూడా విమానాలు నడుస్తున్నాయని, ఖతార్‌లో గగనతలాన్ని పాక్షికంగా తెరవడం వల్ల కొద్ది వాణిజ్య కదలిక సాధ్యమైందని అన్నారు.అయితే, కువైట్ బహ్రెయిన్‌లలో గగనతలం ఇంకా మూసివేసే ఉంది. చిక్కుకుపోయిన ప్రయాణికులకు సహాయం చేయడానికి, కువైట్ ఎయిర్‌వేస్ సౌదీ అరేబియాలోని అల్ ఖైసుమా అంతర్జాతీయ విమానాశ్రయం నుండి భారతదేశానికి ప్రత్యేక నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య విమానాలను ప్రారంభించనుంది. మొదటి విమానం శుక్రవారం కొచ్చికి బయలుదేరనుంది. ఇది కువైట్ నుండి భారతదేశానికి భారత పౌరుల ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది, అని మహాజన్ అన్నారు. అదేవిధంగా, కొనసాగుతున్న గగనతల ఆంక్షల మధ్య, బహ్రెయిన్‌కు చెందిన గల్ఫ్ ఎయిర్, సౌదీ అరేబియాలోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి భారతదేశానికి ప్రత్యేక నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య విమానాలను నడపడం కొనసాగిస్తోంది.

## ఇజ్రాయెల్‌కు ఆశ్చర్య క్షిపణి..
# ప్రకటించిన వెంటనే మరణించిన అలీ

**వుదయం డెస్క్, మార్చి 20:**
గల్ఫ్‌లో అమెరికా నావికాదళం ఉందని చేస్తున్న వాదనలను ధిక్కరిస్తూ, రాబోయే ఆకస్మిక దాడి గురించి శత్రువును హెచ్చరించిన కొన్ని గంటలలోనే ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)కు చెందిన ఒక సీనియర్ అధికారి అమెరికాఇజ్రాయెల్ వైమానిక దాడిలో హతమయ్యారు. తమ ప్రతినిధి అలీ మహమ్మద్ నైని తెల్లవారుజామున అమెరికన్‌జియోనిస్ట్ పక్షం జరిపిన నేరపూరిత, పిరికిపంద ఉగ్రవాద దాడిలో అమరులయ్యారు అని ఐఆర్‌జిసి పేర్కొంది. ఆయన పరివర్తనాత్మక ఆలోచనలు, సమర్థవంతమైన నమూనాలు అహంకార శక్తులకు వ్యతిరేకంగా తమకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయి, అని ఐఆర్‌జిసి పేర్కొంది.

**యుఎస్- ఇజ్రాయెల్‌కు అలీ మహమ్మద్ నైనీ ఆఖరి హెచ్చరిక**

మరణానికి ముందు తన చివరి ప్రకటనలో, ఇరాన్ ఇకపై యురేనియంను శుద్ధి చేయలేదని లేదా బాలిస్టిక్ క్షిపణులను తయారు చేయలేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు చేసిన వాదనను ఆ బ్రిగేడియర్ జనరల్ బహిరంగంగా ఎగతాళి చేశారు. ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్‌తో యుద్ధం చేస్తూనే తెహ్రాన్ క్షిపణి పరిశ్రమ అత్యున్నత స్థాయికి చేరుకుందని ఆయన అన్నారు.
యుద్ధ సమయంలో కూడా ఇరాన్ క్షిపణుల ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోందని, ఎటువంటి ఆందోళనకు లోను కావల్సిన అవసరం లేకుండా తగినన్ని యుద్ధ సామాగ్రి ఉందని అన్నారని ఫార్స్ వార్తా సంస్థ ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తూ పేర్కొంది.



శత్రువుకు అనేక ఆశ్చర్యాలు ఎదురుకానున్నాయని; యుద్ధం ముందుకు సాగుతున్న కొద్దీ, అవి మరింత సంక్లిష్టంగానూ, తీవ్రంగానూ మారతాయని నైని పేర్కొన్నారు.ఇరాన్ నౌకాదళం ధ్వంసమైందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదనలను ఆ సీనియర్ సైనిక అధికారి తోసిపుచ్చారు. పర్షియన్ గల్ఫ్‌లోకి నౌకలను పంపాలని వాషింగ్టన్‌కు ఆయన సవాలు విసిరారు. ఇరాన్ నౌకాదళం నాశనమైందని ట్రంప్ అన్నారు కదా? ఆయనకు దమ్ముంటే తన నౌకలను పర్షియన్ గల్ఫ్‌లోకి పంపమనండి, అని ఆయన అన్నట్లు తస్నీమ్ వార్తా సంస్థ పేర్కొంది.
అయితే, ఆ సంస్థ అతని సందేశాన్ని ప్రసారం చేసిన కొద్దిసేపటికే, అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో అతను మరణించాడని రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది.

**ఇజ్రాయెల్ వాదన**

మధ్యప్రాచ్యంలో యుద్ధం మూడవ వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో, తెహ్రాన్ ఇకపై యురేనియంను శుద్ధి చేయడం గానీ,
బాలిస్టిక్ క్షిపణులను తయారు చేయడం గానీ చేయలేదని నెతన్యాహు పేర్కొన్నారు.
20 రోజుల తర్వాత నేను మీకు చెప్పగలను ఈ రోజు ఇరాన్‌కు యురేనియంను శుద్ధి చేసే సామర్థ్యం లేదు, బాలిస్టిక్ క్షిపణులను ఉత్పత్తి చేసే సామర్థ్యం కూడా లేదు," అని ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దండయాత్ర ప్రారంభమైన తర్వాత తన మొదటి ప్రత్యక్ష విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు.
మేం ఈ సామర్థ్యాలను అణచివేయడాన్ని కొనసాగిస్తున్నాం. మేం వాటిని ధూళిగా, బూడిదగా మారుస్తాం, అని ద్విభాషా విలేకరుల సమావేశాన్ని ప్రారంభిస్తూ హీబ్రూలో ఒక ప్రకటనలో ఆయన అన్నారు. ఇరాన్ ఎప్పటికన్నా బలహీనంగా ఉందని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఒక ప్రాంతీయ శక్తి అయినప్పటికీ, కొందరు దానిని ప్రపంచ శక్తి అని కూడా అంటున్నారని అని ఇజ్రాయెల్ ప్రధాని అభిప్రాయపడ్డారు.



# భార్యా భర్తలిద్దరూ సమానమే

**ఇంటి పనుల్లో భార్యా,భర్తలిద్దరూ పాలు పంచుకోవలసిందే - సుప్రీం**

**న్యూఢిల్లీ, మార్చి 20 (వుదయం) :**
ఆధునిక యువకులు ఇంటి పనులు కేవలం మహిళల బాధ్యత అనే సంప్రదాయ భావజాలకాలాన్ని మార్చుకోవాలని, కాలానికి అనుగుణంగా తమ ఆలోచనా శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యా భర్తలు ఇద్దరూ సమానమేనని, వారి సంబంధాల్లో అది ప్రతిఫలించాలని జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. భార్యను ఒక పని మనిషిలా చూడకూడదని, ఇంటి పని బాధ్యతను భార్య, భర్తలు ఇద్దరూ పంచుకోవాలని హితవులు పలికింది. వైవాహిక వివాదానికి సంబంధించిన ఒక విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.పెళ్లి అనేది సేవలు చేయించుకోవడానికి కాదని, జీవిత భాగస్వామి కోసమని కోర్టు పేర్కొంది. వంట, శుభ్రపరిచే పనులు వంటి గృహ కార్యకలాపాల్లో భర్తలు కూడా సమానంగా చేయాల్సిందేనని పేర్కొంది. ఇంటి పనుల్లో సమాన భాగస్వామ్యం ఉన్నప్పుడే భార్యాభర్తల మధ్య బంధం బలపడుతుందని కోర్టు అభిప్రాయపడింది.

## మా గడ్డపై జరిగేదానితో
# భారతకి సంబంధం లేదు



**వుదయం డెస్క్, మార్చి 20:**
కెనడా గడ్డపై జరుగుతున్న నేర కార్యకలాపాలు లేదా బెదిరింపులతో భారత ప్రభుత్వానికి సంబంధం ఉందని చెప్పడానికి తమ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని కెనడా ఉన్నత పోలీస్ అధికారి ఒకరు ప్రకటించారు. ఈ ప్రకటన గతంలో ఉన్న వాదనకు పూర్తి విరుద్ధంగా ఉండటం విశేషం. కెనడా, భారత్ మధ్య నెలల తరబడి కొనసాగుతున్న దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.
మాజీ ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో హయాంలో కెనడా — ఖలిస్తాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ 2023 హత్యలో భారతీయ ఏజెంట్ల ప్రమేయం ఉందన్న ఆరోపలు చేసిన విషయం తెలిసిందే. అందుకు విరుద్ధంగా వెలువడ్డ ఈ ఈ వ్యాఖ్యలు ఒక భారీ వైఖరి మార్పును లేదా యూటర్న్‌ను సూచిస్తున్నాయి. కొనసాగుతున్న దర్యాప్తులో ఇటీవలి సంఘటనలకు, భారతదేశంతో సహా విదేశీ సంస్థలకు మధ్య ఎటువంటి సంబంధం రుజువు కాలేదని అన్నారు. నేర సమాచారం ఆధారంగా ప్రస్తుతానికి ఏ విదేశీ సంస్థతో సంబంధం ఉన్నట్టు మాకు కనిపించడం లేదని ఒక టీవీ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ (ఆర్‌సిఎంపి) కమిషనర్ మైక్ డుహెమ్ మాట్లాడుతూ అన్నారు.
వేధింపులు, బెదిరింపులకు సంబంధించిన కేసులు ఉన్నాయని పేర్కొంటూనే, వివిధ అంశాల మధ్య సంబంధం ఎప్పుడూ ఏదో ఒక విదేశీ ప్రభుత్వానికి ముడిపడి ఉండదని ఆయన నొక్కి చెప్పారు.విదేశీ జోక్యం లేదా సరిహద్దులు దాటి జరిగే అణచివేతకు సంబంధించి మా వద్ద ఉన్న మొత్తం పత్రాలను, ఫైళ్లను పరిశీలించి నేను ఈ మాట చెబుతున్నాను. మా రికార్డుల ప్రకారం, ఇతరులను బెదిరించే, వేధించే వ్యక్తులు ఉన్నారని మాకు తెలుసు; కానీ ఆయా అంశాలను ఏదైనా ఒక విదేశీ సంస్థతో——అది ఏ దేశానికి చెందినదైనా సరే——నేరుగా ముడిపెట్టడానికి తగిన ఆధారాలు మాత్రం మా వద్ద లేవు, అని ఆయన వివరించారు.గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో లిబరల్ పార్టీ నాయకుడు మార్క్ కార్నీ విజయం సాధించిన తర్వాత, భారతదేశం, కెనడా తమ మధ్య ఏర్పడిన దౌత్యపరమైన ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాయి.

## ఎఫ్-35 లాండింగ్‌కు మా క్షిపణులే కారణం

**వుదయం డెస్క్, మార్చి 20:**
ఇరాన్‌తో యుద్ధం అమెరికాకు తలనొప్పిగా మారింది. అత్యాధునికమని చెప్పుకునే అనేక ఆయుధాలను, యుద్ధ విమానాలను కూడా అమెరికా కోల్పోతోంది. తాజాగా, అమెరికా ఘనంగా చెప్పుకునే ఎఫ్35 యుద్ధవిమానాన్ని ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి.
ఆ వ్యవస్థలు దానిని కొద్దిపాటి నష్టాన్ని కలిగించడంతో అది పశ్చిమాసియాలోని అమెరికా స్థావరంలో అత్యవసరంగా దిగాల్సి వచ్చింది.
ఈ అంశంపై ఇరాన్ ఒక ప్రకటనను విడుదల చేసింది. తమ గగన తల రక్షణ వ్యవస్థ యుఎస్ సైన్యానికి చెందిన ఎఫ్35 యుద్ధ విమానాన్ని దెబ్బతీసిందని, అది ఏ స్థాయిలో దెబ్బ తిన్నదనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని పేర్కొంది. అది పూర్తిగా ధ్వంసం కావడానికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఐఆర్‌జిసి వెల్లడించింది. తాము చెప్తున్నది నిజమని రుజువు చేసుకోవడానికి ఆధారంగా, గాలిలో విమానాన్ని ఒక క్షిపణి ఢీకొడుతున్న ఒక వీడియోను విడుదల చేసింది.
మరోవైపు ఇదే ఘటనపై యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ స్పందించారు. ఇరాన్ యుద్ధంలో భాగమైన ఫైటర్ జెట్ ఒకటి అత్యవసరంగా ల్యాండ్ అయిందని చెప్పారు. అది సురక్షితంగా దిగిందని, ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు.

# యుద్ధ పరిణామాలు

**వుదయం డెస్క్, మార్చి 20:**
సైనిక, దౌత్య కార్యాలయాలు, ఇంధన ఉత్పత్తి కేంద్రాలపై యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్, ఇరాన్ దాడి ప్రతిదాడులతో పశ్చిమాసియాలో సంఘర్షణ మూడవ వారంలోకి ప్రవేశించింది.ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ దాడులతో ప్రారంభమైన ఘర్షణ, ఈ ప్రాంతమంతటా వ్యాపించింది. తెహ్రాన్ హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించడంతో ఇంధన మార్కెట్లు అస్థిరంగా మారాయి, చమురు ధరలు పెరిగాయి. మరోవైపు, ఇజ్రాయెల్ హిజ్బుల్లాను లక్ష్యంగా చేసుకుని భూతల దండయాత్రతో లెబనాన్‌పై దాడులను తీవ్రతరం చేసింది.

**ముఖ్య పరిణామాలు**

శత్రువుల భద్రతను హరించాలి: దేశ శత్రువుల భద్రతను హరించాలని ఇరాన్ నూతన సుప్రీం నాయకుడు అయతొల్లా మొజ్తాబా ఖమేనీ, ప్రజలకు ఇచ్చిన తన తాజా సందేశంలో పిలుపునిచ్చారు.ఇరాన్ గ్యాస్ క్షేత్రంపై దాడిలో ఒంటరిగా వ్యవహరించాం: ఇరాన్‌లోని భారీ సౌత్ పార్స్ గ్యాస క్షేత్రంపై ఇజ్రాయెల్ ఏకపక్షంగా దాడి చేసిందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు గురువారం అన్నారు. ఇరాన్‌తో యుద్ధంలోకి ఇజ్రాయెల్ అమెరికాను లాగిందనే నకిలీ వార్తలను కూడా ఆయన ఖండించారు. ఇరాన్ గ్యాస్ క్షేత్రంపై దాడి చేయవద్దని ఇజ్రాయెల్‌కు సూచన: చేసి ప్రతీకారం తీర్చుకున్న ఇరాన్‌లోని గ్యాస్ క్షేత్రాలపై ఇకపై ఎలాంటి దాడులు చేయవద్దని తన మిత్రదేశమైన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు చెప్పినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు.






“ పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీని మీరు ఓడించడం కలలోమాట. ఆమెపై గెలుపు సాధించడం కేవలం కష్టమే కాదు, అత్యంత అసాధ్యం కూడా. ఈ విషయం కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు, ప్రధాని నరేంద్ర మోడీకి, మొత్తం భారతీయ జనతా పార్టీ శ్రేణులకు బాగా తెలుసు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కి కూడా ఈ విషయం బాగా ఎరుక. అందుకే, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంపై వారు పూర్తి నియంత్రణను కోరుకుంటున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, కమిషనర్ల బదిలీలు వారికి ఏం సాధించి పెడతాయి? అటువంటి బదిలీలు మహారాష్ట్రలోనో లేక అస్సాంలోనో ఎందుకు జరుగవు? భారతదేశ ప్రజలు దీదీ(మమతా బెనర్జీ)తో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ లో ఆమె విజయం సాధిస్తారు. ”

– సంజయ్ రౌత్, శివసేన (యుబిటి ఎంపి)

## వేమనపద్యం



పుట్టిన జనులెల్ల భూమిలో నుండిన
బట్టునా జగంబు పట్టదెపుడు
యముని లెక్క రీతి నరుగుచు నుందురు
విశ్వదాభిరామ! వినురవేమ

## సంపాదకీయం

# ఐక్య రాజ్య సమితి ఎక్కడ?

ఇరాన్ యుద్ధం సృష్టిస్తున్న సంక్షోభం ఇంతా అంతా కాదు.ఆయిల్ ఇంధనం మీద ఆధారపడి బతుకుతున్న ప్రపంచం ఊపిరిని క్రమక్రమంగా తీసేస్తూ ట్రంప్ నెతన్యాహులు ఆడుతున్న మృత్యు క్రీడ పరమ జుగుప్సాకరమైన స్థాయి కి చేరుకున్నది. ఒక వైపు శాంతి పన్నాలు చెబుతూ మరోవైపు ఇరాన్‌పై మీదికి ఏకపక్షంగా యుద్ధానికి వెళ్లిన వారు పరిస్థితి విషమించి విశ్వానికే విపత్తు ముంచుకొస్తున్నదని స్పష్టపడుతున్న దశలో తమంత తాముగా ఉపసంహరించుకుని బుద్ధిగా క్షమాపణ చెప్పడం న్యాయమనిపించుకుంటుంది. ఆయుధ బలం తలకెక్కి అనితరమైన పొగరుతో కొట్టుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుల నుంచి అటువంటి మానవీయ సంస్కారాన్ని ఆశించలేము. ఈ రెండు దేశాలు ఇరాన్ మీద దాడులను పెంచుతూ ఉంటే అది అమెరికా సైనిక స్థావరాలున్న పొరుగు దేశాలలోని చమురు కేంద్రాలపై క్షిపణులను, డ్రోన్ లను ప్రయోగించి అమెరికా కూడా ఎన్నడూ ఊహించని బీభత్సాన్ని సృష్టిస్తున్నది. దీనితో యుద్ధం నుంచి తప్పుకోడానికి అమెరికా ఇజ్రాయెల్ లకు బొత్తిగా ముఖం చెల్లడం లేదు.తాజాగా అమెరికన్ యాంటీ టెర్రరిజం సెంటర్ (ఎన్ సి టి సి )డైరెక్టర్ జోకెంట్ ట్రంప్ యుద్ధ వైఖరికి నిరసనగా రాజీనామా చేశాడు. ఇజ్రాయెల్ చెప్పుడు మాట విని ఇరాన్ పై దాడికి ట్రంప్ తొందరపడ్డాడని వ్యాఖ్యానించాడు. సద్దాం హుస్సేన్ నాటి ఇరాక్ మీదికి బూటకపు ఆరోపణలతో యుద్ధానికి వెళ్ళినప్పుడు అమెరికాను అనాలోచితంగా అనుసరించిన యూరపు దేశాలు ఈ సారి హోర్ముజ్ జలసంధి వద్దకు దానికి అండగా నౌకా దళాలను పంపడానికి నిరాకరించాయి."మీరు మాతో సంప్రతించి ఈ యుద్ధంలో దిగలేదు. ఇందులో మీ ప్రయోజనాలమిటో మాకు తెలియదు .ఇది మా యుద్ధం కాదు""" అని ట్రంప్ ముఖం మీద కుండ బద్దలుకొట్టినట్టు చెప్పేశాయి. ఇక స్వదేశంలో ట్రంప్ సీనియర్ అనుయాయులు మరి కొందరు కూడా రాజీనామాలు చేయవచ్చు. అప్పుడు ఇంతవరకు నిష్క్రమణ దారి తెలియక దిక్కు తోచని స్థితిలో చిక్కుకున్న ట్రంప్ కి ఆ మార్గం ఏర్పడవచ్చు. అంతవరకూ ఇరాన్ డ్రోన్ దాడులను కాచుకోలేక ట్రంప్ నానా యాతన పడడం ఖాయం. ఖోర్ముజ్ జలసంధి మూసివేత, ఆయిల్ ధనిక గల్ఫ్ దేశాల చమురు కేంద్రాలపై దాడుల మూలంగా ఇరాన్ వ్యూహాత్మాకంగా బలమైన స్థానంలో ఉంది. దీనివల్ల ప్రపంచ దేశాల్లో నిల్వలు అడగంటిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్ లో క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్ 114 డాలర్లకు పెరిగిపోయింది.ఈ యుద్ధం మొదలుకాక ముందు ఈ ధర 71 – 73 డాలర్లే అంటే చమురు సంక్షోభం ఎంత గాఢమైందో ఊహించవచ్చు. అమెరికా, ఇజ్రాయెల్ వంటి పొగరెక్కిన దేశాలు నీతి నియమం వీడినప్పుడు అంతర్జాతీయ శక్తులన్నిటినీ ఏకం చేసి పరిస్థితిని అదుపు చేయగల సంస్థ లోపం కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# సాగు సారథులు మహిళలే



ప్రపంచం యుద్ధాల మబ్బులో మునిగిపోయిన ఈ కాలంలో, ఒక నిశ్శబ్దమైన కానీ అత్యంత కీలకమైన పిలుపు వినిపిస్తోంది. 2026ను అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరంగా జరుపుకోవాలని United Nations Food and Agriculture Organization ప్రపంచ దేశాలకు ఇచ్చిన పిలుపు, అసలు సమస్యను మన ముందుంచుతోంది——ఆహార భద్రతకు వెన్నెముకగా ఉన్న మహిళా రైతుల స్థితి. అయితే, ఈ పిలుపు ప్రపంచ రాజకీయ శబ్దాల్లో నశించినా, భారతదేశం వంటి వ్యవసాయ ఆధారిత దేశంలో ఇది ఒక కీలక ఆత్మపరిశీలనకు దారి తీస్తోంది. స్వామినాథన్ దృష్టి: మహిళల లేకుండా వ్యవసాయం అసంపూర్ణం భారతదేశంలో గ్రీన్ రివల్యూషన్‌కు పునాది వేసిన M. S. Swaminathan ఎంతో ముందుగానే ఒక సత్యాన్ని స్పష్టం చేశారు: “మహిళా రైతుల భాగస్వామ్యం లేకుండా వ్యవసాయం, ఆహార ఉత్పత్తి స్థిరంగా ఉండదు.” ఈ ఆలోచనను ఆయన కుటుంబం——ప్రత్యేకంగా Soumya Swaminathan, Madhura Swaminathan——ఇప్పటికీ ముందుకు తీసుకెళ్తున్నారు.

**సౌమ్య స్వామినాథన్ ప్రస్తావించిన ముఖ్య అంశం ఏమిటంటే**

భారతదేశంలో లక్షలాది మహిళలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నా, వారికి భద్రత, హక్కులు, గుర్తింపు లేవు. ఆమె స్పష్టం చేసిన విషయం: మహిళా రైతుల హక్కులు బలపడితేనే పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం, పోషకాహార భద్రత——all interconnected——సాధ్యమవుతాయి.

**పంటల నుంచి పౌష్టికాహారం దాకా: మారాల్సిన దిశ**

మన దేశంలో ఆహార పంపిణీ ఇప్పటికీ ప్రధానంగా పిండి పదార్థాలపై ఆధారపడి ఉంది. కానీ భవిష్యత్తు అవసరం ఏమిటి? పోషకాహారం (మిల్లెట్లు, పప్పులు, గుడ్లు, చేపలు), సమగ్ర వ్యవసాయ విధానాలు, వనరుల సంరక్షణ, ఈ మార్పులో మహిళా రైతుల పాత్ర కీలకం. ఎందుకంటే వారు కేవలం పంటలు మాత్రమే కాదు——పశుపోషణ, తేనె, సిల్క్, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలను కూడా నడిపిస్తున్నారు.

**గణాంకాల వెనుక ఉన్న వాస్తవం: కనిపించని కృషి**



Madhura Swaminathan సూచించిన అధ్యయనాలు ఒక కఠిన వాస్తవాన్ని బయటపెడుతున్నాయి: వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యం సుమారు 46.5%, గత 10 ఏళ్లలో 9–10% పెరుగుదల, స్వయం ఉపాధి రైతులుగా సుమారు 12 కోట్లు, వ్యవసాయ కూలీలుగా 12.5 కోట్లు, అయినా.. కేవలం 10% మహిళలకే భూమి లేదా వనరులపై హక్కులు, రోజువారీ కూలి: రూ.300 (కొన్ని రాష్ట్రాల్లో), వార్షిక ఆదాయం: రూ.16,000–24,000 మధ్య ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతుంది: దేశానికి అన్నం పండించే చేతులు ఎందుకు ఇంకా పేదరికంలోనే ఉన్నాయి?

**లింగ అసమానత: వ్యవసాయ సంక్షోభానికి మూల కారణం**

వ్యవసాయ సంక్షోభం గురించి మనం ఎక్కువగా వాతావరణ మార్పులు, మార్కెట్ సమస్యలు, నీటి కొరత గురించి మాట్లాడుతాం. కానీ ఒక మౌనమైన సంక్షోభం ఉంది——లింగ అసమానత. మహిళలకు భూమి హక్కులు లేవు. ప్రభుత్వ పథకాలలో వారికి ప్రత్యక్ష గుర్తింపు లేదు. టెక్నాలజీ, శిక్షణలో వెనుకబాటు కూలి వ్యవస్థలో దోపిడి ఈ పరిస్థితుల్లో “సుస్థిర వ్యవసాయం” అనే మాట కేవలం నినాదంగా మిగిలిపోతుంది.

**మహిళా రైతు శక్తి: పరిష్కారాల కేంద్రం**

వాస్తవానికి మహిళా రైతులు కేవలం బాధితులు కాదు——పరిష్కారాల కేంద్రమే. వారు: విత్తనం నుంచి నిల్వ దాకా అన్ని దశల్లో కీలకం జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రధాన శక్తి కుటుంబ పోషణలో నిర్ణయాత్మక పాత్ర అంటే, మహిళా రైతుల శక్తిని పెంచితే: పర్యావరణం రక్షితమవుతుంది, పోషకాహారం మెరుగవుతుంది, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. నిర్మాణాత్మక సూచనలు: నినాదాల నుంచి చర్యల దిశగా

*మహిళల లేకుండా వ్యవసాయం అసంపూర్ణం భారత దేశంలో గ్రీన్ రివల్యూషన్‌కు పునాది వేసిన M. S. Swaminathan ఎంతో ముందుగానే ఒక సత్యాన్ని స్పష్టం చేశారు: “మహిళా రైతుల భాగస్వామ్యం లేకుండా వ్యవసాయం, ఆహార ఉత్పత్తి స్థిరంగా ఉండదు.” ఈ ఆలోచనను ఆయన కుటుంబం——ప్రత్యేకంగా Soumya Swaminathan, Madhura Swaminathan——ఇప్పటికీ ముందుకు తీసుకెళ్తున్నారు.*

ఈ నేపథ్యంలో 2026 మహిళా రైతుల సంవత్సరం నిజంగా మార్పు తీసుకురావాలంటే, ప్రభుత్వాలు, సమాజం తీసుకోవాల్సిన చర్యలు స్పష్టంగా ఉన్నాయి:

1. భూమి హక్కులు – ప్రాథమిక హక్కు : మహిళల పేరపై భూమి నమోదు తప్పనిసరి చేయాలి. సంయుక్త పట్టు (joint titles) విధానాన్ని అమలు చేయాలి. 2. మహిళలకు ప్రత్యేక వ్యవసాయ గుర్తింపు. “Farmer”గా అధికారిక గుర్తింపు. రైతు కార్డులు, పథకాల్లో ప్రత్యక్ష అర్హత. 3. ఆదాయం పెంచే విధానాలు. మహిళా రైతులకు కనీస మద్దతు ధర (MSP) ప్రయోజనాలు. మహిళల ఆధ్వర్యంలోని Farmer Producer Organizations (FPOs) ప్రోత్సాహం, 4. టెక్నాలజీ & శిక్షణ గొడ్డు చాకిరి తగ్గించే యంత్రాలు. మహిళలకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు. 5. పౌష్టిక వ్యవసాయం ప్రోత్సాహం మిల్లెట్లు, పప్పులు, పశుపోషణకు మద్దతు. ICDS, మిడ్‌డే మీల్‌తో అనుసంధానం. 6. సమాన కూలి & సామాజిక భద్రత. లింగ సమాన కూలి అమలు. ఆరోగ్య బీమా, పెన్షన్ పథకాలు. 7. డేటా ఆధారిత విధానాలు. మహిళా రైతులపై ప్రత్యేక గణాంక సేకరణ. పాలసీ నిర్ణయాల్లో డేటా వినియోగం. 2026ను మహిళా రైతుల సంవత్సరంగా ప్రకటించడం ఒక ఆహ్వానం మాత్రమే కాదు——ఒక హెచ్చరిక కూడా. మహిళా రైతుల సమస్యలను పరిష్కరించకుండా, భారతదేశం ఆహార భద్రత, పర్యావరణ సమతుల్యత, గ్రామీణ అభివృద్ధి లక్ష్యాలను సాధించలేను. ఇది ఒక ఎంపిక కాదు.. అత్యవసరం.



శ్యాంమోహన్
9440595858

## కొత్త ఉదయం

రమజాన్ నెల పొడవునా
ఆకలి, దాహం మధ్య
మనసు దీపంలా వెలిగింది.
రమజాన్ రాత్రుల్లో
ఆకాశం తెరిచిన గ్రంథంలా
నిలిచింది.
నక్షత్రాల మధ్య
ప్రార్థనలు మౌన దీపాల్లా వెలిగాయి.
రొట్టెలు విరిచిన చేతులు
కేవలం తినడానికే కాదు,
అరచేతిలో ఆకలి నింపుకున్నవారిని
ఆదుకునేందుకు ఎదురు చూశాయి.
ఉపవాసంశరీరానికి కష్టమే కావచ్చు,
కానీ ఆత్మకు ఒక
నదిలా స్వచ్ఛతను ఇచ్చింది.
ఈరోజు ఈద్ ఉదయం –
మసీదుల మీనారులపై
సూర్యుడు కొత్త ఆశలా ఉదయించాడు.
ఆలింగనం చేసుకున్నప్పుడు
మన మధ్య ఉన్న అడ్డుగోడలు
కూలిపోతున్న శబ్దం వినిపించింది.
ద్వేషం చీకటి నింపిన చోట
ప్రేమ ఒక దీపస్తంభంలా
ప్రకాశించింది.
ఈద్ అంటే
కొత్త బట్టల పండుగ కాదు –
మనసు నిర్మలంగా వికసించే
ఒక కొత్త ఉదయం.



యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

## భవ్య క'వనం'




అక్షర క'వన' పూతోటలో..
గుబాళించు భావ సుగంధాలు
కవితాక్షరం ఓ తీరని దాహం
కవిత్వం ఓ భాషా సృజన
కవిత ఓ మెదడుకు మేత
కవనం ఓ అద్భుత ఆవిష్కరణ
కవనం ఓ అక్షర ఔషధం
కవనం ఓ భావాక్షర క్షీరసాగరం
కవిత్వం ఓ కలుపు తీసే యంత్రం!

కవి ఓ పౌర సమాజ వైద్యుడు
కవి ఓ అక్షర శ్రామికుడు
కవిత్వ అక్షర ఆయుధాలతో..
దురాగతాల్ని పాతరేయడం
దురాచారాల్ని దులిపేయడం
అక్రమార్కుల భరతం పట్టడం
అవలక్షణాల్ని అడ్డుకోవడం!

దుర్మార్గాల్ని దూగడ పట్టడం
వాస్తవాల్ని కళ్ల ముందుంచడం
అబద్దాలపై కొరడా జులపయడం
అజ్ఞాన చీకట్లను తరిమేయడం
అవినీతికి తలకొరివి పెట్టడం

చీడపురుగుల్ని ఉతికి ఆరేయడం
చెడును చెండాడి బొంద పెట్టడం
అసుర కీచకుల తోలు తీయడం
మృగాళ్ల అంగం నరికేయడం!

విజ్ఞాన విందులు వడ్డించడం
ప్రకృతి అందాల్ని ఆరబోయడం
మంచికి పట్టాభి షేకం చేయడం
మానవీయతకు ప్రాణం పోయడం
ఐక్యత వృక్షానికి నీరు పోయడం
శాంతికి కవన గొడుగు పట్టడం..
అనాదిగా అవిశ్రాంతంగా జరిగింది
నేడు నిక్కచ్చిగా జరుగుతోంది
రేపు వడివడిగా జరుగనుంది!

మధుపాళీ
9949700037

# భారత్-అమెరికా బంధం : సరికొత్త శక్తి కేంద్రం

ఇరవై ఒకటవ శతాబ్దపు అంతర్జాతీయ రాజకీయ యవనికపై ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమవుతోంది. అది మరేదో కాదు.ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం మరియు అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశమైన అమెరికా మధ్య చిగురించిన అపూర్వ స్నేహం. ఒకప్పుడు అంటీ ముట్టనట్టు ఉన్న ఈ రెండు దేశాలు, నేడు విడదీయలేని భాగస్వాములు గా మారడం వెనుక ఒక పెద్ద చరిత్రే ఉంది. గత రెండు దశాబ్దాలలో ఈ సంబంధాలు పెరిగిన తీరు చూస్తుంటే, ఇది కేవలం రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు, రాబోయే వంద ఏళ్ల ప్రపంచ గమనాన్ని శాసించే ఒక వ్యూహాత్మక కలయిక అని స్పష్టమవుతోంది.భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 నాటి పరిస్థితులు నేటితో పోలిస్తే అస్సలు పొంతన లేనివి. ఆ కాలంలో ప్రపంచం రెండు ధృవాలుగా విడిపోయి ఉంది. ఒకవైపు అమెరికా నేతృత్వంలోని పెట్టుబడిదారీ వ్యవస్థ, మరోవైపు సోవియట్ యూనియన్ నేతృత్వంలోని సామ్యవాద వ్యవస్థ. నెహ్రూ హయాంలో భారత్ అలీన విధానాన్ని ఎంచుకోవడం అమెరికాకు నచ్చలేదు. దానికి తోడు, పాకిస్తాన్‌తో అమెరికా పెంచుకున్న స్నేహం, శీతల యుద్ధ కాలంలో భారత్ అమెరికా మధ్య ఒక గీతను గీసింది.అయితే, 1991లో పి.వి. నరసింహారావు ప్రభుత్వం తెచ్చిన ఆర్థిక సంస్కరణలు మంచును కరిగించడం ప్రారంభించాయి. ఆ మంచు పూర్తిగా విడిపోయింది మాత్రం 1998 పోఖ్రాన్ అణు పరీక్షల తర్వాతే. ఆశ్చర్యకరంగా, అణు పరీక్షల వల్ల తొలుత ఆంక్షలు విధించిన అమెరికా, ఆ తర్వాత భారత్ ప్రాముఖ్యతను గుర్తించింది. 2000 సంవత్సరంలో బిల్ క్లింటన్ భారత పర్యటన ఒక చారిత్రక మలుపు. ఆ తర్వాత 2005లో కుదిరిన సివిల్ న్యూక్లియర్ డీల్ (భారత-అమెరికా పౌర అణు ఒప్పందం) రెండు దేశాల మధ్య ఉన్న అపనమ్మకపు గోడలను కూల్చేసింది. అప్పటి నుండి వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు.నేడు భారత్ అమెరికా సంబంధాలకు బలమైన పునాది ఆర్థిక వ్యవస్థ . గణాంకాల ప్రకారం, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 190 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది కేవలం నంబర్ మాత్రమే కాదు, లక్షలాది మందికి ఉపాధినిచ్చే మహా వృక్షం. అమెరికా ఇప్పుడు మన దేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. మనం ఎగుమతి చేసే ఐటీ సేవలు, ఔషధాలు, వజ్రాలు అమెరికా మార్కెట్‌లో హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.మరో వైపు, భారత్ అనే భారీ మార్కెట్ అమెరికా కంపెనీలకు ఒక బంగారు గనిలా కనిపిస్తోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వాల్‌మార్ట్ వంటి దిగ్గజాలు మన దేశంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతున్నాయి. దీనికి ప్రతిగా టాటా, ఇన్ఫోసిస్, విప్రో వంటి భారతీయ కంపెనీలు అమెరికా గడ్డపై జెండా ఎగురవేస్తూ, అక్కడ వేల మందికి ఉద్యోగాలిస్తున్నాయి. ఈ పరస్పర ఆర్థిక బంధం ఎంత బలపడిందంటే, ఇప్పుడు ఒక దేశంలో ఆర్థిక తుమ్ములు వస్తే మరో దేశానికి జలుబు చేసేంతగా ఇవి పెనవేసుకుపోయాయి.ఒకప్పుడు రష్యా ఆయుధాలపై ఎక్కువగా ఆధారపడిన భారత్, ఇప్పుడు తన రక్షణ అవసరాల కోసం అమెరికా వైపు చూస్తోంది. ఇది వ్యూహాత్మక మార్పు మాత్రమే కాదు, నమ్మకానికి నిదర్శనం. అమెరికా




నుండి మనం కొనుగోలు చేసిన C-17 గ్లోబ్‌మాస్టర్ విమానాలు, అపాచీ హెలికాప్టర్లు, చినూక్ హెవీ లిఫ్ట్ హెలికాప్టర్లు మన సైనిక శక్తిని రెట్టింపు చేశాయి. 2016లో అమెరికా భారత్‌కు మేజర్ డిఫెన్స్ పార్ట్నర్ హోదా ఇచ్చింది. ఇది సాధారణంగా తన సన్నిహిత మిత్ర దేశాలకే ఇచ్చే గౌరవం. LEMOA, COMCASA, BECA వంటి సంక్లిష్టమైన రక్షణ ఒప్పందాలు రెండు దేశాల సైన్యాల మధ్య సమన్వయాన్ని పెంచాయి. సముద్రంలో మలబార్ విన్యాసాలు, గగనతలంలో కోప్ ఇండియా , భూమిపై యుద్ధ అభ్యాస్ పేరుతో రెండు దేశాల సైనికులు కలిసి శిక్షణ పొందుతున్నారు. ఈ విన్యాసాలు కేవలం ప్రదర్శన కోసం కాదు, హిందూ మహాసముద్రంలో శాంతిని కాపాడటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పే ఒక హెచ్చరిక.భారత్ అమెరికా బంధంలో అత్యంత మెరిసే విభాగం సాంకేతికత . అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి వెళ్తే ప్రతి నలుగురు ఇంజనీర్లలో ఒకరు భారతీయుడు కనిపిస్తాడు. గూగుల్ అధిపతి సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల, అడోబ్ సీఈఓ శాంతను నారాయణన్. వీరంతా భారతీయ మూలాలున్న మేధావులే. వీరు అమెరికా టెక్నాలజీని శాసిస్తూనే, భారత్‌తో ఆ బంధాన్ని కొనసాగిస్తున్నారు.ఇక భవిష్యత్తు సాంకేతికతలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్ల తయారీలో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. అంతరిక్ష రంగంలో నాసా (NASA) మరియు ఇస్రో (ISRO) సంయుక్తంగా నిర్మిస్తున్న నిసార్ (NISAR) ఉపగ్రహం ఒక సంచలనం. భూమిపై వచ్చే మార్పులను అత్యంత ఖచ్చితత్వంతో గమనించే ఈ ఉపగ్రహం, శాస్త్ర సాంకేతిక రంగంలో మన స్నేహానికి మకుటాయమానం.ఏ దేశాల మధ్యనైనా సంబంధాలు బలంగా ఉండాలంటే ప్రభుత్వాల మధ్య ఒప్పందాలు సరిపోవు, ప్రజల మధ్య అనుబంధం ఉండాలి. ఈ విషయంలో భారత్ అమెరికా సంబంధాలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. అమెరికాలో స్థిరపడిన సుమారు 45 లక్షల మంది భారతీయ సంతతి ప్రజలు (డయాస్పోరా) అక్కడ అత్యంత గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నారు. వారు అమెరికా రాజకీయాలను కూడా ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారు. ప్రతి సంవత్సరం సుమారు 2 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్తున్నారు. వీరు అక్కడ విద్య నేర్చుకోవడమే కాకుండా, అమెరికా ఆర్థిక వ్యవస్థకు బిలియన్ల డాలర్ల ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. ఈ విద్యార్థులు, వృత్తి నిపుణులు రెండు దేశాల మధ్య ఒక సజీవ వంతెనలా పనిచేస్తున్నారు.వర్తమాన రాజకీయాల్లో ఇండో-పసిఫిక్ ప్రాంతం అత్యంత కీలకంగా మారింది. ఈ ప్రాంతంలో చైనా ప్రాబల్యాన్ని నియంత్రించి, స్వేచ్ఛాయుతమైన వాణిజ్య మార్గాలను కాపాడటం భారత్ అమెరికా ఉమ్మడి లక్ష్యం. దీని కోసమే ఆస్ట్రేలియా, జపాన్‌లతో కలిసి క్వాడ్ (QUAD) కూటమిని బలోపేతం చేశాయి. ఇది ఒక సైనిక కూటమి కాకపోయినప్పటికీ, అంతర్జాతీయ నియమ నిబంధనలను గౌరవించే దేశాల కలయికగా గుర్తింపు పొందింది. ఆసియాలో స్థిరత్వం ఉండాలంటే భారత్ అమెరికా భాగస్వామ్యం వెన్నెముక వంటిది.ఏ స్నేహంలోనైనా చిన్న చిన్న గొడవలు, భిన్నాభిప్రాయాలు సహజం. భారత్ అమెరికా మధ్య కూడా కొన్ని చిక్కుముడులు ఉన్నాయి. H-1B వీసా నిబంధనలు మన ఐటీ నిపుణులను ఇబ్బంది పెడుతుంటాయి. వాణిజ్య సుంకాలపై తరచూ చర్చలు జరుగుతుంటాయి. అలాగే రష్యా ఉక్రెయిన్ యుద్ధం వంటి అంతర్జాతీయ సంక్షోభాల సమయంలో భారత్ తన సొంత ప్రయోజనాల కోసం తీసుకునే నిర్ణయాలు అమెరికాకు అప్పుడప్పుడు మింగుడు పడవు. మానవ హక్కుల విషయంలో కూడా అమెరికా అప్పుడప్పుడు చేసే వ్యాఖ్యలు భారత్‌కు అసంతృప్తి కలిగిస్తాయి.అయితే, ఈ సమస్యలేవీ స్నేహాన్ని విచ్ఛిన్నం చేసేంత పెద్దవి కావు. రెండు దేశాలు పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలు కాబట్టి, చర్చల ద్వారా ఈ సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నాయి.భారతదేశం తన శతాబ్ది స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2047 నాటికి వికసిత భారత్ గా (అభివృద్ధి చెందిన దేశంగా) ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రయాణంలో అమెరికా సహకారం అనివార్యం. క్లీన్ ఎనర్జీ, వాతావరణ మార్పుల నియంత్రణ, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో అమెరికా టెక్నాలజీ మనకు ఎంతో అవసరం. అదే సమయంలో, ప్రపంచ సరఫరా గొలుసు (Supply Chain) చైనా నుండి వేరుపడాలన్నా, ప్రజాస్వామ్య విలువలు రక్షించబడాలన్నా అమెరికాకు భారత్ వంటి బలమైన భాగస్వామి తోడుండాలి.చివరగా చెప్పాలంటే, భారత్ అమెరికా సంబంధాలు కేవలం అవసరాల మీద ఆధారపడినవి కావు, అవి ఆశయాల మీద ఆధారపడినవి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టబద్ధమైన పాలన అనే మూడు సూత్రాలు ఈ బంధాన్ని నడిపిస్తున్నాయి. 21వ శతాబ్దం ఆసియా శతాబ్దంగా మారుతున్న వేళ, ఈ రెండు దిగ్గజ దేశాల కలయిక ప్రపంచ శాంతికి ఒక భరోసా.రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత లోతుగా, మరింత విస్తృతంగా మారుతుందని ఆశించవచ్చు. ఇది కేవలం రెండు దేశాల ప్రజల బాగు కోసం మాత్రమే కాదు, మొత్తం మానవాళి శ్రేయస్సు కోసం ఏర్పడిన ఒక మహత్తర భాగస్వామ్యం.



డా.సూర్యదేవర రామకృష్ణ
9490754169



# గ్రేటర్ హైదరాబాద్



## బడ్జెట్‌లో జర్నలిస్టులకు మొండి చెయ్యి

సంక్షేమ నిధి ఊసే లేదు | ఇళ్ల స్థలాల ప్రస్తావనే లేదు | హెల్త్ స్కీమ్ ముచ్చట అసలే లేదు | టీయూడబ్ల్యూజే





**హైదరాబాద్, మార్చి 20 (ఉదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టులకు మొండి చెయ్యి చూపించారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వంలో కంటే తాము అధికంగా సంక్షేమం కోసం నిధులు కేటాస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించారని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన 2026-27 బడ్జెట్‌లో జర్నలిస్టుల ఊసే లేదు అని,గత ఎన్నికల మ్యానిఫెస్టోలో అదనంగా 100 కోట్లు సంక్షేమ నిధిని కేటాయిస్తామని చెప్పి ప్రస్తుత బడ్జెట్‌లో కూడా చిల్లిగవ్వ కేటాయించకపోవడం అన్యాయం అన్నారు. ఇళ్ల స్థలాల ప్రస్తావన చేయకపోవడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పలుమార్లు కోరినా హెల్త్ కార్డు సంబంధించిన అంశమే బడ్జెట్ ప్రసంగంలో లేక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిని బట్టి చూస్తే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రతను అందించే జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను ఈ ప్రభుత్వం శాశ్వతంగా రద్దు చేసిందా అనే అనుమానం కలుగుతుందన్నారు. ఇది తెలంగాణ జర్నలిస్టులకు పూర్తిగా అన్యాయం చేసిన బడ్జెట్ గా తాము భావిస్తున్నట్లు ప్రకటించారు. ఈ బడ్జెట్‌పై తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్,టి యు డబ్ల్యు జె కోశాధికారి యోగానంద్ లు సైతం పెదవి విరిచారు.

## త్యాగం, మానవత్వాల సమ్మేళనం రంజాన్

ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే మాసం రంజాన్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం తొమ్మిదవ నెల అయిన ఈ మాసం కేవలం ఉపవాసాలకే పరిమితం కాదు. ఇది ఆత్మశుద్ధికి, క్రమశిక్షణకు, దైవచింతనకు అద్దం పట్టే కాలం. నెల రోజుల పాటు సాగే కఠిన దీక్షల అనంతరం జరుపుకునే 'ఈద్-ఉల్-ఫితర్' పండుగ సమాజంలో శాంతిని, సోదరభావాన్ని వెల్లివిరిస్తుంది.

రంజాన్ మాసంలో నిర్వహించే 'రోజా' (ఉపవాసం) కేవలం ఆహార పానీయాలను వదిలివేయడం మాత్రమే కాదు. ఇది మనిషి తన పంచేంద్రియాల మీద నియంత్రణ సాధించే ప్రక్రియ. సూర్యోదయానికి ముందే 'సహర్' ముగించి, సూర్యాస్తమయం వరకు నీటి చుక్క కూడా తీసుకోకుండా ఉండే ఈ దీక్ష మనిషిలో పట్టుదలను, ఓర్పును పెంచుతుంది. ఆకలి విలువ ఏమిటో స్వయంగా అనుభవించి తెలుసుకోవడం ద్వారా, సమాజంలోని పేదవారి పట్ల కరుణ కలిగేలా ఈ ఉపవాసాలు దోహదపడతాయి. కేవలం కడుపు మాడ్చుకోవడమే కాకుండా, చెడు వినకూడదని, చెడు చూడకూడదని, అబద్ధం పలకకూడదని ఈ దీక్షలు ప్రబోధిస్తాయి.

ఖురాన్ అవతరణ – ఆధ్యాత్మిక శిఖరం..

ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఈ మాసంలోనే దివి నుంచి భువికి అవతరించిందని నమ్మకం. అందుకే రంజాన్ నెలలో ప్రతిరోజూ మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు (తరావీహ్) నిర్వహిస్తారు. ఈ మాసంలోని చివరి పది రోజులు అత్యంత కీలకం. ముఖ్యంగా 'లైలతుల్ ఖదర్' (మహా రాత్రి) రోజున చేసే ప్రార్థనలు వేయి నెలల ప్రార్థనలతో సమానమని భక్తుల నమ్మకం. ఆధ్యాత్మిక చింతనతో భక్తి పారవశ్యంలో మునిగిపోవడం ద్వారా మనిషి మానసిక ప్రశాంతతను పొందుతాడు.



ఈ మాసంలో 'దానం' (చారిటీ)కు విశిష్ట స్థానం ఉంది. తమ సంపాదనలో 2.5 శాతాన్ని పేదలకు పంచడం (జకాత్) ప్రతి ముస్లిం విధి. దీనితో పాటు పండుగ రోజున 'ఫిత్రా' పేరుతో పేదలకు ధాన్యం లేదా నగదు రూపంలో సహాయం చేస్తారు. సమాజంలోని ఆర్థిక అసమానతలను తొలగించి, పండుగ సంతోషం అందరికీ చేరాలనేదే ఈ సంప్రదాయం వెనుక ఉన్న గొప్ప ఉద్దేశ్యం. ఆర్తుల ఆకలిని తీర్చడమే రంజాన్ అసలు సందేశం. సామాజిక సామరస్యానికి ప్రతీకగా కూడా చూడాలి. భారతదేశంలో రంజాన్ పండుగ కేవలం ఒక వర్గానికే పరిమితం కాదు. ఇది 'గంగా-జమునా తెహజీబ్' (మత సామరస్యం)కు గొప్ప నిదర్శనం. సాయంత్రం వేళల్లో నిర్వహించే 'ఇఫ్తార్' విందులలో అన్ని మతాల వారు పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడం మన దేశ సంస్కృతికి అద్దం పడుతుంది. ఈ విందులు వర్గ విభేదాలను చెరిపేసి, మానవతా సంబంధాలను బలపరుస్తాయి. రంజాన్ ఇచ్చే సందేశం ఒక్కటే – సత్యమార్గంలో నడవడం, తోటివారికి సహాయపడటం, మనసును నిర్మలంగా ఉంచుకోవడం. ఈ నెల రోజుల కఠిన దీక్షలు మనిషిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దుతాయి. ఈద్-ఉల్-ఫితర్ పండుగ తెచ్చే ఆనందం సమాజంలో శాంతిని, సుస్థిరతను నింపాలని ఆకాంక్షిద్దాం.



– అంతడుపుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ – వరంగల్,
సెల్ నెంబర్ : 7386814274

## పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

**కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, మార్చి 20 (ఉదయం ప్రతినిధి) :** 10వ తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి 10వ తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు జూమ్ మీటింగ్ ద్వారా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పరీక్షలు సజావుగా జరిగేలా, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షల్లో విధులు నిర్వహించే సిబ్బంది వద్ద పరీక్షలు నిర్వహించే ప్రాంగణంలో మొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి బయట వ్యక్తులను రాకుండా కట్టడి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించేముందు ఏఎన్ఎం, పోలీస్ బందోబస్తు, వాటర్ బాయ్ లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను జీరో మొబైల్ జోన్ గా ఉంచే బాధ్యత చీఫ్ సూపరిండెంట్లదేనని కలెక్టర్ తెలిపారు. రోజువారి డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నపత్రం పేపర్ సీరియల్ నెంబర్ రిజిస్టర్ లను తప్పని సరిగా నమోదు చేయాలని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్ర పరిసరాలు పరిశుభ్ర వాతావరణంలో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సీసీఏ రూల్స్ మేరకు చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి జూమ్ మీటింగ్ లో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఇఓ రేణుకా దేవి లు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక**

**పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శం**



**షాద్ నగర్, మార్చి 20 (ఉదయం) :** పవిత్ర రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరితో సంతోషంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక చింతన పెంచుకునే ఈ పండుగ..సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, లౌకికవాదానికి పెద్దపీట వేస్తామని ఆయన పేర్కొన్నారు. 'రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయి' అని శంకర్ చెప్పారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు.



## ఇఫ్తార్ విందులు ఐక్యతకు ప్రతీకలు

**ప్రజలందరికీ ఈద్ ముబారక్: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**వెలిమలలో ఘనంగా ఇఫ్తార్ విందు**



**రామచంద్రాపురం, మార్చి 20(ఉదయం) :** రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు సామాజిక ఐక్యతకు ప్రతీకలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెలిమల గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉపవాస దీక్షను విరమించారు. అనంతరం పేద ముస్లిం కుటుంబాలకు కానుకలు పంపిణీ చేశారు. ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే, అల్లా కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హనుమాన్ ఆలయానికి భూ విరాళం

సేవాభావంతో ముందుకొచ్చిన దాతలు

**చేవెళ్ల, మార్చి 20 (ఉదయం) :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని శుక్రవారం మల్కాపూర్ వార్డులో ఉన్న హనుమాన్ దేవాలయానికి భక్తి, సేవాభావంతో పలువురు దాతలు భూమిని విరాళంగా అందజేయడం విశేషంగా నిలిచింది. ఈ ఉదార చర్య దేవాలయ అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా గ్రామంలో భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. విరాళం అందజేసిన దాతలు బక్కారెడ్డి మాణిక్య రెడ్డి – 100 గజాలు, శేరిపాల నర్సింహారెడ్డి – 30 గజాలు, శేరి అడవి రెడ్డి నరసింహారెడ్డి – 30 గజాలు, శేరి ఎడ్డి సత్తి రెడ్డి – 30 గజాలు గ్రామస్థులు అభినందించారు. దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజల తరపున దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో భక్తి భావం, సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచి, ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తోంది తెలిపారు.

## మురుగు సమస్యలకు చెక్

**దర్గా రోడ్డులో భారీ స్థాయిలో అండర్ డ్రైనేజ్ శుభ్రత పనులు**

**కౌన్సిలర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు**

**దుర్వాసన, మురుగు నీటి సమస్యలకు చెక్**



**శంకర్‌పల్లి, మార్చి 20 (ఉదయం) :** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు దర్గా రోడ్డులో చాలా కాలంగా కొనసాగుతున్న మురుగు సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం భారీ స్థాయిలో అండర్ డ్రైనేజ్ శుభ్రత పనులు చేపట్టారు. డ్రైనేజీ లైన్లు మూసుకుపోవడంతో రోడ్లపైకి మురుగు నీరు పొంగిపొర్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని 7వ వార్డు కౌన్సిలర్ బండ్లగూడెం ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది యంత్రాల సహాయంతో డ్రైనేజీ లైన్లను పూర్తిగా శుభ్రపరిచి, పేరుకుపోయిన చెత్త, మురుగు నీటిని తొలగించారు. ప్రత్యేక జెట్ మెషీన్లు, ట్రాక్టర్లు ఉపయోగించి వేగవంతంగా పనులు పూర్తి చేయడంతో పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా మారాయి. డ్రైనేజీ శుభ్రపరిచే సమయంలో పెద్ద ఎత్తున మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త బయటకు తీసి తొలగించారు. దీంతో దర్గా రోడ్డులో నెలకొన్న దుర్వాసన సమస్య తగ్గడంతో పాటు, నీటి నిల్వలు తగ్గి ప్రజలకు ఊరట లభించింది. ముఖ్యంగా వర్షాకాలంలో తీవ్రంగా మారే సమస్యలను ముందుగానే నియంత్రించేందుకు ఈ చర్యలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రశాంత్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా శుభ్రత కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

స్థానిక ప్రజలు ఈ శుభ్రత కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తూ, చాలా రోజుల తర్వాత మురుగు సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని, డ్రైనేజీ లైన్లను నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. మున్సిపల్ అధికారులు కూడా పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సహకరిస్తేనే పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవచ్చని సూచించారు. ఇలాంటి చర్యలతో శంకర్‌పల్లి పట్టణంలో పరిశుభ్రతకు కొత్త దిశ ఏర్పడుతుందని, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ




**కుత్బుల్లాపూర్, మార్చి 20,(ఉదయం ప్రతినిధి ) :** నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ లో నిరు పేదలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1,20,000/- (ఒక లక్ష ఇరవై వేల రూపాయలు ) సీఎం అర్ ఎఫ్ చెక్కులను మంజూరు చేయించగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నామని మెరుగైన వైద్య సహాయం కోసం వచ్చిన ప్రతీ ఒక్కరిని ఆదుకునే నాయకులు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అని, అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్సకోసం ఎదురుచూస్తున్న ప్రతీ ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ బొబ్బ శ్రీనివాస్, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చేవెళ్లలో మేకల మార్కెట్ ప్రారంభం

**ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా ఘన ప్రారంభం**

**చేవెళ్ల, మార్చి 20 (ఉదయం) :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని శుక్రవారం మార్కెట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మేకల మండిని ఎమ్మెల్యే కాలె యాదయ్య ఘనంగా ప్రారంభించారు.ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ...చేవెళ్ల ప్రాంత ప్రజలు ఈ మేకల మార్కెట్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకుని, తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలి" అని సూచించారు.చేవెళ్లలో ప్రారంభమైన ఈ మేకల మార్కెట్ ద్వారా రైతులు, వ్యాపారులు మంచి అవకాశాలు పొందే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరి సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బ్యాగరి రాములు కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లొంక శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు, మాజీ సర్పంచులు, డైరెక్టర్లు ప్రజలు పాల్గొన్నారు.



## ప్రపంచ జల దినోత్సవ అవగాహనపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**శేరిలింగంపల్లి, మార్చి 20 (ఉదయం) :** ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం హాఫీజ్ పేటలో గల జల మండలి జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రపంచ జల దినోత్సవ అవగాహనపై ముద్రించిన వాల్ పోస్టర్‌ను హైదరాబాదు మహానగర జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, ఛీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, 15వ డివిజన్ జనరల్ మేనేజర్ రమావత్ కృష్ణ ఆవిష్కరించారు. తదనంతరం వారు మాట్లాడుతూ "ఐక్యరాజ్యసమితి వారు మార్చి 22వ తేదీని ప్రపంచ జల దినోత్సవముగా ప్రకటించి ప్రతి సంవత్సరం వివిధ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇది ఒక సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణతో పాటు యితర రసాయనిక పదార్థాలతో కలుషితం కాకుండా కాపాడుకోవడం వంటి చర్యలు చేపట్టాలి. ఇది ప్రభుత్వంతో పాటు పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు అందరు కలిసి ఆచరిస్తేనే పర్యావరణ రక్షణతో పాటు సకల జనులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు" అని తెలిపారు. ఈ సందర్భంగా అందరి చేతా నీటి సంరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో జల మండలి అధికారులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మారబోయిన సదానంద్ యాదవ్, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, జివి. రావు, శివరామ రెడ్డి, జనార్ధన్, ఉమా చంద్రశేఖర్, పాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ సామాజిక న్యాయానికి నిదర్శనం

**మాజీ జడ్పిటిసి విశాల శ్రవణ్‌రెడ్డి**



**షాద్ నగర్, మార్చి 20 (ఉదయం) :** రాష్ట్ర అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా సాగుతున్న ప్రజా ప్రభుత్వంలో 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం దిశగా వేసిన బలమైన ముందడుగు అని కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో బడ్జెట్‌ను రూపొందించిన కాంగ్రెస్ నాయకత్వానికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఆర్థిక మందగమనం ఉన్నప్పటికీ తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. దేశ జీడీపీ వృద్ధి రేటు 9.8 శాతం నుండి 8 శాతానికి పడిపోయినప్పటికీ, తెలంగాణ వృద్ధి రేటు 10.6 శాతం నుండి 10.7 శాతానికి పెరగడం ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర జీఎస్‌డీపీ 17,82,198 కోట్ల రూపాయలకు చేరిందని వెల్లడించారు. దేశ సగటు వృద్ధి రేటు కంటే తెలంగాణ 2.7 శాతం అధిక వృద్ధిని నమోదు చేస్తూ, దేశ జీడీపీలో 5 శాతం వాటాతో బలమైన 'గ్రోత్ ఇంజిన్'గా నిలిచిందని ఆమె వివరించారు. ప్రజలు చెల్లించే ప్రతి పైసాకు కాపలాదారులుగా ఉంటూ, వారి అభ్యున్నతి కోసమే ఈ బడ్జెట్‌ను రూపొందించారని తెలిపారు. రికార్డు స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తూ తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ప్రభుత్వ ఆర్థిక విధానాలు సరైన దిశలో సాగుతున్నాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## జిల్లాను 'క్షయ రహిత' జిల్లాగా మారుద్దాం



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- మార్చి 24న ప్రపంచ టీబీ దినోత్సవం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- 44 హై-రిస్క్ గ్రామాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపులు
- ప్రతి కేసును నిక్షయ్ (NIKSHAY) పోర్టల్‌లో నమోదు చేయాలి

**జనగాం, మార్చి 20(వుదయం ప్రతినిధి)**

జిల్లాలో క్షయవ్యాధి (TB) నిర్మూలనకు అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేసి, విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఈ నెల 24న నిర్వహించనున్న 'ప్రపంచ టీబీ దినోత్సవం' పురస్కరించుకుని చేపట్టాల్సిన కార్యక్రమాలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ముందస్తు గుర్తింపు తక్షణ చికిత్స ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. టీబీ నియంత్రణలో ముందస్తు గుర్తింపు (Early Detection) అత్యంత కీలకమన్నారు. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, లక్షణాలు ఉన్నవారిని వెంటనే గుర్తించి NAAT, మైక్రోస్కోపీ, ఎక్స్‌రే పరీక్షల ద్వారా నిర్ధారణ చేయాలని సూచించారు. ముఖ్యంగా:డయాబెటిస్ బాధితులు, వృద్ధులు, పోషకాహార లోపం ఉన్నవారికి ప్రాధాన్యత క్రమంలో స్క్రీనింగ్ చేయాలి. నమోదైన ప్రతి కేసును తప్పనిసరిగా నిక్షయ్ (NIKSHAY) పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.గుర్తించిన రోగులకు ఏమాత్రం ఆలస్యం లేకుండా తక్షణమే చికిత్స ప్రారంభించాలి.ప్రజల్లో అవగాహన పెంపొందించాలివ్యాధి లక్షణాలైన దీర్ఘకాలిక దగ్గు, జ్వరం , బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత మరియు BCG టీకా ప్రాధాన్యతను వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'టీబీ ముక్త భారత్ అభియాన్ 2.0' లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.44 గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ NTEP ప్రోగ్రాం అధికారి డాక్టర్ అశోక్ మాట్లాడుతూ.. జిల్లాలో టీబీ ముప్పు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన 44 గ్రామాల్లో సమగ్ర స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఎక్స్‌రే, స్పుటమ్ (కఫం) పరీక్షలతో పాటు హీమోగ్లోబిన్ పరీక్షలు కూడా చేస్తున్నట్లు వివరించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మల్లిఖార్జున రావు, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం, జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ నరేంద్ర శర్మ, వివిధ ప్రోగ్రాం అధికారులు, ఐఎంఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 2027 జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
**సూర్యాపేట మార్చి 20(వుదయం)**



2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు కీలకమని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.
జిల్లాలో జనాభా గణన2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి సెక్షన్ క్లార్క్‌లు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు మార్చి 20, 22, 23 తేదీలలో మూడు రోజుల పాటు ఇళ్ల జాబితా, గృహ గణన (HLO) శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనాభా గణన నిర్వహణకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశగా ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) మరియు గృహ గణన మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు, రెండో దశగా జనాభా గణన 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారు.జనాభా గణన ద్వారా లభించే గణాంకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈసారి జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్ లు , వెబ్ పోర్టల్ ద్వారా గణన చేపడతారని, ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహ గణన సందర్భంగా ఇంటి నిర్మాణం, పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీరు, మురుగు పారుదల, మరుగుదొడ్లు, వంటగది వంటి సౌకర్యాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నలపై ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తారు.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సీపీఓ కిషన్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. జనాభా గణాంక అధికారి రవీంద్ర నాయక్ మండలాల వారీగా గణన బ్లాకుల విభజన, గణన విధానం పై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి వి. రామారావు, ఉప గణాంక అధికారి ఎం. రాజేష్, బి. కోటేశ్వరరావు, పర్యవేక్షకులు దున్న శ్యామ్, మండల ప్రణాళికా గణాంక అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### బాలల సదనాల్లో సమగ్ర సంరక్షణ

# ఆరోగ్య సేవల నిర్వహణ



- బాలల సదనంలో సంరక్షణ, ఆరోగ్య సేవలు సమగ్రంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పిల్లలకు మౌళిక సదుపాయాలతో పాటు నాణ్యమైన పోషకాహారం అందించాలిస్థానిక బాల సదనంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, మార్చి 20 (వుదయం ప్రతినిధి) :**

ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం ప్రభుత్వ లక్ష్యమని, మంచి ఆరోగ్యం ఉన్నప్పుడే పిల్లలు చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఎన్.ఎస్.పి. రోడ్‌లోని బాలల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
పరిసరాలలో తిరుగుతూ పరిశుభ్రత, మౌళిక వసతులు, పడక గదులు, బాత్‌రూములు, త్రాగునీటి సదుపాయం, వంటగది నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. వంటగదిలో తయారవుతున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా చూసి, పిల్లలకు అందిస్తున్న అల్పాహారం, భోజనం కామన్ మెనూ ప్రకారం సరైన ప్రమాణాలతో అందుతున్నాయా అని తెలుసుకున్నారు. అన్నం, కూరలు, పప్పు, సాంబారు, గుడ్లు, చికెన్ వంటి పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.పిల్లలతో నేరుగా ముచ్చటించిన కలెక్టర్, భోజనం రుచిగా ఉందా, సమయానికి అందిస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల అభిప్రాయాలను వినడం ద్వారా సేవల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.శిశు సంరక్షణ కేంద్రంలో ఉన్న చంటి పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్, చంటి పిల్లలపై నిరంతర వైద్య పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి చిన్నారి ఆరోగ్యం, పోషణ, భద్రతపై సిబ్బంది పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. దత్తత ప్రక్రియలో పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారి వివరాలను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి, చట్ట పరమైన విధానాలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బాలల సదనాల్లో ఉన్న పిల్లలు మన కుటుంబ సభ్యుల్లాంటి వారని, వారికి అందించే ఆహారం పోషక విలువలతో కూడినదిగా, రుచికరంగా ఉండాలని అన్నారు. పరిశుభ్రత, ఆరోగ్య సేవలు, భద్రత అంశాల్లో ఎల్లప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాలల సదనాల్లో ఉన్న ప్రతి చిన్నారి భవిష్యత్తు అమూల్యమైన సంపద అని వారి ఆరోగ్యం, పోషణ, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం సిబ్బంది ముఖ్య బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. పిల్లలకు అందించే ఆహారం పోషక విలువలు సమృద్ధిగా ఉండేలా ప్రణాళికా బద్ధంగా ఉండాలని,
సమయానికి వైద్య పరీక్షలు అందేలాగా చర్యలు చేపట్టాలని అన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైన సేవలు తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు. దత్తత ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే చట్టపరమైన విధానాల ప్రకారం పిల్లలను దత్తత ఇవ్వాలని, ప్రతి దశలో బాలల హితం ప్రాధాన్యంగా ఉండే విధంగ బాలల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, జిల్లా శిశు సంరక్షణ అధికారిణి విష్ణు వందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా పనులల్లో వేగం పెంచాలి.

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు, మార్చి 20 (వుదయం ప్రతినిధి) :**



సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలనిజిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఏటూరు నాగారం లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సామాజిక ఆరోగ్య కేంద్రం లోని గదులను, వార్డులను, అటెండెన్స్ రిజిస్టర్ ను, లాబ్, మెడికల్ స్టొర్ గది, లేబర్ రూమ్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అదేవిధంగా వార్డులలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను, వారికి అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలు హెచ్పీవీ వ్యాక్సిన్ వేసుకోవాలని గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇది ఒక మంచి అవకాశం అని తెలిపారు. ఇప్పటి వరకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమందికి ఇవ్వడం జరిగిందని, వైద్యులు,సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని,నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని,వైద్యులు,సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని,నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని,సామాజిక ఆరోగ్య కేంద్రంలో రిపేర్లు గాని ఇతర పనులు ఏమైనా ఉన్నట్లయితే అంచనా వేసి ములుగు జిల్లా కార్యాలయానికి పంపించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ దశలలో నిర్మాణం లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లను పరిశీలించి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని లబ్ధిదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ జగదీశ్వర్, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ సురేష్, ఏటూరు నాగారం సర్పంచ్ శ్రీలత, ప్రజా ప్రతినిధులు, ఇతర ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చాహత్ బాజ్ పాయ్

### ఈద్గాల్లో ఏర్పాట్లను

## పరిశీలించిన కలెక్టర్

**వరంగల్ టౌన్, మార్చి 20 (వుదయం ప్రతినిధి) :**

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని నగర పరిధిలోని ఈద్గాల్లో జరుగుతున్న ఏర్పాట్లను హన్మకొండ జిల్లా కలెక్టర్/గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.నగరంలోని ఎల్‌బీ నగర్, మాట్వాడ, బొక్కలగడ్డ ప్రాంతాల్లో ఉన్న ఈద్గాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, అక్కడ కొనసాగుతున్న శానిటేషన్, తాగునీరు, లైటింగ్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమగ్రంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముస్లిం సోదరులు రంజాన్ సందర్భంగా ప్రార్థనలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈద్గాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, చెత్త తొలగింపు, శుభ్రపరిచే పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు.శానిటేషన్ మరియు ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పని చేసి, ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్థానిక మత పెద్దలతో మాట్లాడి వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, షామియానా, టెంట్లు, మంచినీటి, సౌండ్ సిస్టం తదితర అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సి.ఎం.హెచ్.ఓ డా.రాజారెడ్డి,ఈఈలు రవి కుమార్, సంతోష్ బాబు, డీఈలు, ఏఈలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


### ముస్లిం సోదర,సోదరీమణులకు

## రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు

## ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చ్ 20 (వుదయం ప్రతినిధి)**


ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ముస్లిం సోదరులు ఈ పవిత్ర పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు .రంజాన్ మాసంలో ముస్లీం సోదరులు చేసిన కఠిన ఉపవాస దీక్షలను ఈద్ ఉల్‌ఫితర్ పండుగతో ముగిస్తారని అన్నారు.ఈ రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలందరూ సోదర భావాన్ని కలిగియుండి సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని కోరారు.




శాంతి, సోదర భావంతో పండుగ జరుపుకోవాలని పిలుపు
కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షకఠిన ఉపవాస దీక్షల ముగింపుగా పవిత్ర రంజాన్ పండుగ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరిన ఎస్పీ

## జిల్లా ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
**జయశంకర్ భూపాలపల్లి మార్చి 20 (వుదయం జిల్లా ప్రతినిధి):**



జిల్లా ప్రజలకు రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దాన ధర్మాల ద్వారా ఈ పవిత్ర మాసం సహనాన్ని, సేవాభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ శాంతి, సౌహార్ద్రం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, సామరస్యంతో ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# ఎస్పీ ఆకస్మిక తనిఖీ




**మహబూబాబాద్,వుదయం ప్రతినిధి,మార్చి 20.**

-ప్రతి గ్రామం లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి -ప్రతి వ్యక్తి హెల్మెట్ ధరించాలి.

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ శుక్రవారం చిన్నగూడూరు పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, కార్యాలయం లోపలి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఎస్సై ప్రవీణ్ సిబ్బందికి విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం పై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా అక్రమ కార్యకలాపాలపై ఎలాంటి జోక్యం ఉండకూడదని, ఆదేశించారు. అలాగే స్థానిక సర్పంచ్ ల సహకారం తో గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కు సర్పంచ్‌లు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా హెల్మెట్ వాడకం పై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని,జిల్లాలో నేరాల నియంత్రణ, రోడ్డు భద్రత ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని ఎస్పీ తెలిపారు.

### మహిళా, శిశు సంక్షేమ పథకాలను

# పటిష్టంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజపాయి
- అంగన్‌వాడీ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- బాల్య వివాహాల నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టాలి
- సమీక్షా సమావేశంలో అధికారులకు కలెక్టర్ ఆదేశం

**హనుమకొండ, మార్చి 20 (వుదయం ప్రతినిధి):**



జిల్లాలో మహిళలు, శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి, వివిధ కార్యక్రమాల అమలు తీరుపై ఆమె సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ముఖ్యమైన ఆదేశాలు . ఈ నెల 26వ తేదీన పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించే సమావేశంలో బాలల పరిరక్షణ అధికారులు పాల్గొని వారికి పూర్తి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.బాలల రక్షణ కోసం ఉన్న చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 గురించి, అలాగే మహిళల రక్షణ కోసం ఉన్న సఖీ కేంద్రం సేవల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.'భేటీ బచావో.. భేటీ పడావో' కార్యక్రమానికి సంబంధించి పక్కా కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఇన్చార్జ్ జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, అక్షయ పాత్ర భోజనం, పోషణ్ అభియాన్, పౌష్టిక ఆహారం మరియు దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.ఈ సమీక్షలో సీడీపీవోలు స్వరూప, ఉమా, ఎక్స్టెన్షన్ ఆఫీసర్ సింధురాణి, ఇన్చార్జ్ డీసీపీవో ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్ వో రవికృష్ణ, సఖీ కేంద్రం అడ్మిన్ హైమావతి, శిశు గృహ మేనేజర్ మాధవి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ భాస్కర్, డీహెచ్ డబ్ల్యూ కోఆర్డినేటర్ కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు తీరని అన్యాయం

**నల్లగొండ , మార్చి 20 (వుదయం ప్రతినిధి) :**

బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా తెలంగాణ రాష్ట్ర బడ్జెట్.రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు 3.4 శాతం నిధులా ఇదెక్కడి న్యాయం..?అప్పులేమో బీసీలకు..! సంపదేమో అగ్ర వర్ణాలకా..? బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ యూత్ జేఏసీ చైర్మన్ కట్టెకోలు దీపెందర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ యూత్ జేఏసీ చైర్మన్ కట్టెకోలు దీపెందర్ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కట్టెకోలు దీపెందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొత్తం 3,24,234 లక్షల కోట్ల బడ్జెట్లో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 12,511 కోట్లు, 3.8 శాతం నిధులు కేటాయించి బీసీల గొంతుకోసి తీరని అన్యాయం చేశారన్నారు. గత సంవత్సరం రాష్ట్ర బడ్జెట్లో బీసీల లెక్కలు లేవనే సాకుతో కేవలం 11,000 కోట్లు కేటాయించిందని కానీ ప్రస్తుతం స్పష్టమైన లెక్క ప్రభుత్వం తేల్చిన తర్వాత కూడా కొత్త సీసాలో పాత చింతకాయ పచ్చడి అన్న చందంగా ప్రస్తుత బడ్జెట్ ఉందని ఎద్దేవాచేశారు.
ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు పెంచి బ్రతుకులు మారుస్తామని ప్రగల్భాలు పలికి రిజర్వేషన్లు పెంచకపోగా తగ్గించి స్థానిక ఎన్నికలు నిర్వహించి బీసీల గొంతుకోశారన్నారు. కనీసం బడ్జెట్లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం శూన్యంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్తో బీసీలకు ఒరిగిందేమీ లేదని 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 3.4 శాతం నిధులు బడ్జెట్లో కేటాయిస్తే ఏవిధంగా బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర సంపద సృష్టించేది, ఉత్పత్తి చేసేది బీసీలని, సగానికిపైగా పన్నులు కట్టేది బీసీలన్నారు. అప్పులేమో బీసీలకు సంపదేమో అగ్రవర్ణాలకా అని ప్రశ్నించారు. ఈ బడ్జెట్ నిధులు రెండున్నర కోట్ల బీసీ జనాభాకు పంచితే చాక్లెట్లు బిస్కెట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. ఇప్పటికే గ్లోబరైజేషన్ లిబరైజేషన్ మార్పుల తర్వాత పెద్ద ఎత్తున యాంత్రీకరణ జరగడంతో పెద్ద పరిశ్రమలు కంపెనీలు రావడంతో చేతివృత్తులు కులవృత్తులు దెబ్బతిన్న కారణంగా బీసీల బ్రతుకులు రోడ్ల పాలవుతున్నాయన్నారు.
ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని 40 వేల కోట్లు కేటాయించి బీసీలపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు . అంతేకాకుండా 30 వేల కోట్ల రూపాయలతో బీసీ సబ్ ప్లాన్ ప్రవేశపెట్టి అమలుచేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, బీసీ యువజన సంఘం నాయకులు శేరి రవీందర్, జక్కలి సాయి కంబాలపల్లి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో అద్భుత విజయమే లక్ష్యం

### విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**
**యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం జిల్లా ప్రతినిధి :**



విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలని, ఎప్పటికప్పుడు తాజాగా ఉన్న కూరగాయలు మాత్రమే వంటకు ఉపయోగించాలన్నారు. పాఠశాల వంటగదిని పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆర్.ఓ ప్లాంట్ లో మంచినీటి సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ నీ జీవిత లక్ష్యం ఏమిటి అని విద్యార్థినిని అడగగా విద్యార్థి పోలీస్ అవుతానని సమాధానం తెలిపారు. పదవ తరగతి పరీక్షలు ఎలా రాస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకొని కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని తెలిపారు. వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచనలు చేశారు. పరీక్షలు వ్రాసే సమయంలో భయాందోళనకు గురి కాకుండా మంచి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలన్నారు.10 వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం ద్వారా భవిష్యత్ లో ఉన్నత చదువులకు వెళ్ళవచ్చని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మంచి మార్కులతో పాస్ అవ్వాలని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్న చూపు

### బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు

**కరీంనగర్, వుదయం:**



బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల కేటాయింపు విషయంలో చిన్న చూపును చూసిందని, దీంతో అభివృద్ధి, సంక్షేమపథకాల అమలు విషయంలో పట్టణ ప్రజలలకు తీరని అన్యాయం జరగనుందని బిజెపి కరీం నగర్ పార్లమెంట్ కన్వీనర్ కరీంనగర్ కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు.నిండు అసెంబ్లీ సాక్షిగా అబద్దాల అంకెలతో కూడిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. కేటాయింపులు కు వాస్తవ పరిస్థితికి పొంతన లేకుండా అత్తెసరు నిధులను ఆయా శాఖలకు కేటాయించారనే బాధను వ్యక్తంచేశారు.గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదనేది ఈ కేటాయింపులతో తేటతెల్లమయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో మాటలకు చేతలకు పొంతన లేనివిధంగా నిధుల ప్రస్తావనను ఆర్థిక మంత్రి వినిపించారని ఆయన పేర్కొన్నారు.

## ఒలింపియాడ్ లో స్లేట్ విద్యార్థుల ప్రతిభ

**జన్నారం, వుదయం**

శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణితము మరియు విజ్ఞాన శాస్త్రం ఒలంపియాడ్ 2025-2026లో జన్నారం మండల కేంద్రంలోని స్లెట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.గణిత ఒలింపియాడ్ లో స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని లావుడ్య సహస్ర రాష్ట్ర స్థాయి 4 వ ర్యాంక్,2వ తరగతి విద్యార్థి ఇషాన్ రాష్ట్ర స్థాయి 2వ ర్యాంక్, సైన్స్ ఒలంపియాడ్ లో 8వ తరగతి చెందిన ఆదిత్య రాష్ట్ర స్థాయి 1 వ ర్యాంక్, అలాగే గణిత ఒలంపియాడ్ లో స్లేట్ హైస్కూల్ కు చెందిన ఆరవ తరగతి విద్యార్థి శ్రీలౌకిక్ రాష్ట్రస్థాయి 4వ ర్యాంక్,3వ తరగతి విద్యార్థి దీక్షాశ్రీ రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు, విజ్ఞాన శాస్త్ర ఒలంపియాడ్ లో హర్షిత్ మరియు షణ్ముఖ ప్రియా రాష్ట్ర స్థాయిలో నాలుగవ ర్యాంకులు అంతేకాకుండా జిల్లా స్థాయిలో ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంకులు మరియు కన్సోలేషన్ గ్రేడ్స్ సాధించినట్లు స్లేట్ గ్రూప్స్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు, రాష్ట్రస్థాయి మరియు జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

### డిప్యూటీ డీఎంహెచ్వో సుధాకర్ నాయక్



**జన్నారం, వుదయం**

వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని మంచిర్యాల జిల్లా డిప్యూటీ డిఎంహెచ్వో సుధాకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అయన సందర్శించారు. ఈ సందర్భంగా టిబి, ఎన్సిడి, లెప్రసీ, మలేరియా లాంటి వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ సరఫరా చేయాలని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది ఉన్నారు.

## జిల్లా ప్రజలకు ప్రముఖుల రంజాన్ శుభాకాంక్షలు

**వుదయం, నిజామాబాద్:**



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నియమ నిష్ఠలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు కొనసాగించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో కాలం వెళ్లదీయాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ముస్లిం సోదరులు, అదే స్ఫూర్తితో శనివారం నాటి ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ను కూడా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

## సంస్కృతి, సాంప్రదాయాలు, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రయాణం డాక్టర్ జి ఒక యుగ ద్రష్ట...



**కరీంనగర్, వుదయం;**

భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రయాణం కొనసాగిందని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు అన్నారు. ఆర్ఎస్ఎస్ కరీంనగర్ ఆధ్వర్యంలో పరమ పూజనీయ డాక్టర్ హెడ్గే వార్ జయంతి, ఉగాది ఉత్సవ వేడుకలు నగరంలోని రెవెన్యూ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ పరమ పూజనీయ డాక్టర్ జి ఒక గొప్ప దేశభక్తుడు, భావితరాలకు ఒక ఆదర్శ మూర్తిగా వెలుగొందిన నాయకుడు అని కొనియాడారు. కళ్ళకు కనిపించే దృశ్యంను చూడడాన్ని దృష్టి అంటారని, భవిష్యత్తులో జరగబోయే దాన్ని ఊహించి పని ప్రారంభించే వారిని ద్రష్ట అంటారని, అలా డాక్టర్ జి భవిష్యత్తులో జరగబోయే దానిని ఊహించిన గొప్ప వారని అందుకే డాక్టర్ జి ని యుగ ద్రష్ట అంటారని తెలిపారు. 1889లో జన్మించిన డాక్టర్ జి చిన్న వయసులోనే దేశం స్థితి, దేశ బానిసత్వం గురించి ఆలోచించేవారని, స్కూల్లో చదువుకునే వయసులోనే వందేమాతరం ఉద్యమాన్ని నిర్మాణం చేశారన్నారు. వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్ జి ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా తన జీవితాన్ని దేశం కోసం అంకితం చేయాలనే సంకల్పం తీసుకున్నారన్నారు. ఆ రోజుల్లో డాక్టర్ జి కాంగ్రెస్ లో ఒక ముఖ్య నాయకుడిగా పనిచేశారని, గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం చేసి తొమ్మిదినెలలు జైలు శిక్షణ అనుభవించారని తెలిపారు. డాక్టర్ జి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటూనే అసలు ఈ దేశం ఎందుకు పరాధీనమైంది ..? దేశ భవిష్యత్తు ఏంటి అనే ఆలోచన ఆయన మదిలో మొదలైందన్నారు.

## విద్యార్థులతో కలసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, వుదయం:**



జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం జుక్కల్ మండలంలో పర్యటించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం కింద జుక్కల్ మండలంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల పనుల పురోగతిని సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి పరిశీలించారు. నిర్మాణనాణ్యత, పనుల వేగం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తదనంతరం ఆక్సిజన్ పార్క్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్క్‌లో వృక్షాల సంరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. అపై కేజీబీవీ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. మధ్యాహ్నభోజన పథకం కింద విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. నేటి మెనూలో క్యారెట్ కర్రీ, సాంబారు, టమాట చారు, కోడి గుడ్డు, పెరుగు, నెయ్యి అందిస్తున్నట్లు గమనించారు. ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో ముచ్చటిస్తూ వారి విద్య, వసతి, ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట పీడీ హౌసింగ్విజయపాల్రెడ్డి, డీఈవో రాజు, డీపీవో మురళి, తహసిల్దార్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాలకు గ్యాస్ సరఫరా పకడ్బందీగా సాగాలి..జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, వుదయం**




జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు గ్యాస్సిలిండర్ల సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వసతి గృహాల్లో అందుబాటులో ఉన్న గ్యాస్ సిలిండర్ల స్టాక్ వివరాలను కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వసతి గృహంలో సరిపడ సిలిండర్ల నిల్వ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. గ్యాస్ ఏజెన్సీలు వసతి గృహాల అవసరాలకు అనుగుణంగా సమయానికి సరఫరా చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాల నిర్వాహకులు గ్యాస్ ఏజెన్సీలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సరఫరా లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా గ్యాస్ సరఫరాలో సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత తహసీల్దార్లకు సమాచారం అందించాలని ఆదేశించారు. తహసీల్దార్లు తరచూ వసతి గృహాలను తనిఖీ చేసి గ్యాస్ సిలిండర్ల నిల్వను పరిశీలించాల్సిందిగా పేర్కొన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, వసతి గృహాల అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలకు గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, డీఈఓ భోజన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల అధికారులు దయానంద్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి

### విద్యాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, వుదయం**



కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో కొనసాగుతున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాల అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటితో పాటు నాణ్యమైన విద్య బోధన అందించాలని,పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, మురుగు కాలువల వ్యవస్థ, పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. మండల కేంద్రంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్ లను సందర్శించి మొక్కలు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సకాలంలో నీటిని అందించి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, ఉపయోగకరమైన చెత్తను వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలని తెలిపారు. ఈ అంశాల సమర్థవంతమైన నిర్వహణపై నిర్వాహకులను అభినందించారు. మండలంలోని చిత్తాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందిస్తూ నాణ్యమైన విద్య బోధన చేయాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి, మధ్యాహ్న భోజనం నాణ్యత, సౌకర్యాల కల్పన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకాగ్రతతో చదివి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదిగే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీ తీరును పరిశీలించి సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మొహమ్మద్ అబ్దుల్ హై, మండల పంచాయతీ అధికారి, పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న రైతులను పరామర్శించిన మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి, వుదయం**



ఈరోజు కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి మరియు కూనారం గ్రామాల్లో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మొక్కజొన్న పంటలను మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి గారు సందర్శించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. సుమారు 500 నుండి 1000 ఎకరాల వరకు పంట నష్టపోయినట్లు అంచనా వేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా నష్టపోయిన రైతుల్లో ఎక్కువ మంది కౌలు రైతులే ఉండటం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని, సరైన పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతుల కష్టాలను అర్థం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మాజీ ఎంపీటీసీ దేవయ్య, మంథని రాజయ్య, రాజు, వివేక్ పటేల్, వెంకన్న, BRS నాయకులు ఉన్నారు.

## ఎకో టూరిజం ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, వుదయం:**



నిజాంసాగర్ వద్ద అభివృద్ధి చెందుతున్న ఎకో-టూరిజం ప్రాజెక్టు పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మాణంలో ఉన్న డీలక్స్ కాటేజీలు, సూట్ కాటేజీలు, స్పా & యోగా సెంటర్, మెయింటెనెన్స్ బ్లాక్ , రెస్టారెంట్ బ్లాక్ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అదనంగా ప్రాజెక్టుకు సంబంధించిన ఎంట్రీ ఆర్చ్ కోసం తగిన స్థలాన్ని త్వరితగతిన ఖరారు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఏఈఈ (టూరిజం), కాంట్రాక్టర్లు, తహసీల్దార్, ఎండీవో, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

**జన్నారం, వుదయం**



జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సీదార్ల రామ్మోహన్ తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సీదార్ల ఉదయ్ కుమార్ లు శుక్రవారం రోజున మండలంలోని కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేశారు.విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే డిక్షనరీలను పంపిణీ చేసిన వారిద్దరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్, శెట్టి రాజశేఖర్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, నాగలక్ష్మి , గీత, స్వరూప, వెన్నెల, అంగన్వాడి టీచర్లు స్వరూప, వనిత తదితరులు పాల్గొన్నారు.


## రంజాన్ తోఫా పంపిణీ

**జన్నారం, వుదయం**



పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు అందజేస్తున్న "రంజాన్ తోఫా" కిట్స్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశానుసారం జన్నారం మండలం లోని కవ్వాల్ గ్రామంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మి నారాయణ, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఎమ్మార్వో రామ్మోహన్ లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వారన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, నాయకులు, అధికారులు, ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## ప్రపంచ పిట్టల దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన



**నాగిరెడ్డిపేట్, వుదయం**

ప్రపంచ పిట్టల దినోత్సవం సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండల రేంజ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తరపున మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వాసుదేవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వాసుదేవ్ మాట్లాడుతూ...గ్రామాలలో పిట్టలను కాపాడుకోవడం గురించి వివరించడం జరిగిందన్నారు.గవర్నమెంట్ స్కూల్లో పిట్టల మీద డ్రాయింగ్ వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ ఎఫ్ఆర్వో రవికుమార్ మరియు సిబ్బంది ఉన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాలకు ఎవరికి మొబైల్ ఫోన్లు అనుమతి లేదు.. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, వుదయం:**



పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఇన్విజిలేటర్లు (డిఇలు)తో జూమ్ లింక్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూమ్ మీటింగ్ ద్వారా దిశా నిర్దేశం చేస్తూ పరీక్షా కేంద్రాలకు ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని, ఎవరికి అనుమతి లేదని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రాలకు తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా చూసుకోవాలని ఆయన ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని, ఎటువంటి అక్రమాలకు అవకాశం లేకుండా పర్యవేక్షణను బలోపేతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిఇలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా కార్యవర్గంలో మండల వాసులకు చోటు




**జన్నారం, వుదయం**

జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గంలో జన్నారం మండలానికి చెందిన ముగ్గురు సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చోటు కల్పించారు. మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ ఇసాక్, జిల్లా ఉపాధ్యక్షులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుర్రం మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ లను నియమించారు. తమపై నమ్మకంతో జిల్లాకార్యవర్గంలో స్థానం కల్పించిన ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కి ఋణపడి ఉంటామని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా వారిని పలువురు నాయకులు అభినందించారు.

## నల్లాపోచమ్మ జాతరలో బోనాల సందడి



**నాగిరెడ్డిపేట్, వుదయం**

మండలంలోని నల్లాపోచమ్మ జాతరలో భక్తి భావం వెల్లివిరిసింది. జాతర రెండవ రోజు బోనాల సందర్భంగా మండల బీజేపీ నాయకురాలు కొండ మీరా తాయి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె, సంవత్సరం పొడవునా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. అలాగే ఆడబిడ్డలు అమ్మవారి ఆశీస్సులతో ప్రతి రంగంలో రాణించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు.

## ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి.. కలెక్టర్ ఇలా త్రిపాఠి

**వుదయం, నిజామాబాద్:**

### జ్యోతిబాపూలే బాలికల గురుకులంలో వైద్యారోగ్య శిబిరం సందర్శన

ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు, క్రీడలు, ఇతర అంశాలపై చక్కగా దృష్టి సారించవచ్చని హితవు పలికారు. మాక్లూర్ మండలం దాస్ నగర్ వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను రోజువారీగా తరలించేందుకు వీలుగా స్వచ్ఛ ఆటో ను పాఠశాలకు పంపాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. గురుకులంలోని కిచెన్ ను, విద్యార్థినుల కోసం వండిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. నాణ్యమైన సరుకులు, తాజా కూరగాయలు వినియోగించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆరోగ్యశిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. వివిధ విభాగాల వారీ గా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, చక్కటి ఆరోగ్యం కోసం ఆకు కూరలు,




తాజా కూరగాయలు ఎక్కువ గా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా, వెంటనే నిర్వాహకుల దృష్టికి తీసుకురావాలని, అశ్రద్ధ చేయకూడదని అన్నారు. సరైన ఆహార నియమాలను పాటిస్తూ, తగినంత నిద్ర ఉండేలా చూసుకోవాలని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థినులకు మార్గనిర్దేశం చేశారు. ఎలాంటి ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా, వార్షిక పరీక్షలను ఆత్మవిశ్వాసంతో చక్కగా రాయాలని సూచించారు. బాలికల భద్రత, రక్షణ, ఆరోగ్యాల పరిరక్షణ విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని, బయటి వ్యక్తులు ఎవరూ పాఠశాల లోనికి రాకుండా గట్టి పర్యవేక్షణ చేయాలని పాఠశాల నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్వేత, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, వైద్యులు సందీప్, శశిధర్, అరవింద్ తదితరులు ఉన్నారు.

# లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలి

- ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలు, ప్రత్యేక బ్యాంకర్ల (డీసీసీ) సమావేశం
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ




వికారాబాద్, జిల్లా, వుదయం ప్రతినిధి: మార్చ్ 20 వికారాబాద్ కలెక్టరేట్ లో శుక్రవారం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 పై జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో, ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలుకై ,ప్రత్యేక బ్యాంకర్ల (డీసీసీ) సమావేశము నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 కు గానూ ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా యూనిట్ల స్థాపన చేపట్టుటకు కార్యాచరణను బ్యాంకర్ల సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. లక్ష రూపాయల విలువ గల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన యూనిట్లు 90 శాతం సబ్సిడీతో అందించబడుతాయన్నారు. ప్రస్తుతం గిగ్ వర్కర్లుగా ఆన్ లైన్ ప్లాట్ ఫార్మ్ అయినటువంటి జొమాటో, స్విగ్గి, ర్యాపిడో మొదలైన వాటిలో పనిచేస్తున్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 3 లక్షల రూపాయల విలువ గల గూడ్స్/ప్యాసింజర్ త్రీ వీలర్ యూనిట్లు 70 శాతం సబ్సిడీతో మంజూరు చేయబడతాయని ఈ వాహనాల ద్వారా వారు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా 3 నుండి 7 లక్షల విలువ గల సోలార్ యునివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు 60 శాతం సబ్సిడీతో మంజూరు చేయబడతాయని ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా ముఖ్యంగా ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. షెడ్యూల్డు కులాల రైతులు సోలార్ యునివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వికారాబాద్ జిల్లాకు ఈ పథకం కింద 168 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, 82 త్రిచక్ర వాహనాల యూనిట్లు మరియు 17 సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు కేటాయించబడినట్లు తెలిపారు. ఈ యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయడంలో బ్యాంకర్లు చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే, షెడ్యూల్ ప్రకారం ఆఖరు ఈ నెల 24 లోగా అర్హులైన ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని, బ్యాంకులు వాటిని వేగంగా పరిశీలించి రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించడంపై బ్యాంకర్లు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బ్యాంకర్ల సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె. బాబు మొజెస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వి. యాదగిరి, ఎస్బిఐ, యుబిఐ, టిజిబి, బిఓబి, సిబిఐ, కెనరా, పీఎన్ బి బ్యాంకులకు సంబంధించి జిల్లా కంట్రోలర్లు మరియు కొ ఆర్డినేటర్లు ఉన్నారు.

### పది పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

10వ తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంభందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి 10వ తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు జూమ్ మీటింగ్ ద్వారా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలు సజావుగా జరిగేలా, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షల్లో విధులు నిర్వహించే సిబ్బంది వద్ద పరీక్షలు నిర్వహించే ప్రాంగణంలో మొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి బయట వ్యక్తులను రాకుండా కట్టడి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించేముందు ఏఎన్ఎం, పోలీస్ బందోబస్తు, వాటర్ బాయ్ లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుండి జూమ్ మీటింగ్ లో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఇఓ రేణుకా దేవి లు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ తనిఖీ

వెల్దండ మార్చి 20 (వు దయం ప్రతినిధి) గ్రామపంచాయతీ పరిధి చుక్కనపల్లి లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సాగు చేస్తున్న మునగ తోటను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ శుక్రవారం పరిశీలించారు. తోట నిర్వహణ, మొక్కల పెరుగుదల, నీటి వినియోగం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి, రైతులకు మరింత సాంకేతిక మార్గదర్శకత అందించాలని అధికారులకు సూచించారు.

అనంతరం బొల్లంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన క్యాటిల్ షెడ్ను సందర్శించి, పశుసంవర్ధక కార్యకలాపాలకు ఇది ఉపయోగకరంగా ఉండేలా నిర్వహణపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, పనుల నాణ్యతను కాపాడుతూ, నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గుండాల గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయమునును పరిశీలించారు ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పనుల్లో పారదర్శకత, నాణ్యత, సమయపాలన పాటించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ, ఎంపీడీవో, ఎంపీవో, ఈసీ, టిఏలు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నర్మెట్టలో సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

పనులను పరిశీలించిన అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, కలెక్టర్ హైమావతి, అధికారులు



సిద్దిపేట, మార్చి 20 (వుదయం ప్రతినిధి) ఈనెల 22వ తేదీన నంగునూరు మండలం నర్మెట్టలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శుక్రవారం అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, ఐజి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కే. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రారంభించనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రాంగణాన్ని, సభా స్థలిని, హెలిప్యాడ్ మరియు వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఉన్నతాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా "ప్రజా పాలనలో రైతు మహోత్సవం" కోసం ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా వారు తనిఖీ చేశారు. భద్రతా పరంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిజిపి మహేష్ భగవత్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ హైమావతి రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పర్యటనలో భాగంగా సీఎం చేపట్టబోయే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం, పైలాన్ ఆవిష్కరణ. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాల ఆవిష్కరణ. రైతులతో భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగం. భారీ సంఖ్యలో ప్రజలు, రైతులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు మరియు అత్యవసర సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.సీఎం కాన్వాయ్ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ మరియు పాసుల జారీపై సీపీ సాధన రష్మి పెరుమాళ్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, డి ఆర్ డి ఓ జయదేవ్ ఆర్య, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ హాకథాన్‌కు పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి వుదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మార్చి 28 మరియు 29 తేదీల్లో నిర్వహించనున్న "స్పోర్ట్స్ హాకథాన్" (క్రీడలలో ఆవిష్కరణలు మరియు పరిష్కారాలు) కార్యక్రమానికి ముందుగా శుక్రవారం (మార్చి 20) పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా క్రీడాశాఖ అధికారి (DYSO) అఖిలేష్ రెడ్డి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించి, కగడను వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఈ హాకథాన్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా సెక్రటరీ ఉషయ్య (కిరణ్ జాన్), జిల్లా క్రీడాశాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అభినయ్ పాల్గొన్నారు. అలాగే టీ ఐ టీ ఏ ప్రతినిధులు అభిలాష్, హరి కృష్ణ, వివేక్, భాస్కర్, ఏకాంశ్ తదితరులు హాజరయ్యారు. ఈ స్పోర్ట్స్ హాకథాన్ ద్వారా క్రీడా రంగంలో కొత్త ఆలోచనలు, సాంకేతిక పరిష్కారాలు వెలుగులోకి రావాలని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.




# పరీక్ష ప్రారంభానికి ముందు ప్రతి హాలును క్షుణ్ణంగా పరిశీలించాలి



జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, మార్చి 20: వుదయం జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య స్పష్టం చేశారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు.జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, డిపార్ట్మెంటల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె దిశానిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని, కేంద్రంలో ఉన్న సిబ్బంది సహా ఎవరి వద్దా మొబైల్ ఫోన్లు ఉండకూడదని స్పష్టం చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు ప్రతి హాలును క్షుణ్ణంగా పరిశీలించి చూడాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి సంఘటనలు జరిగినా సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్, ఎంఈఓలదే బాధ్యత అని స్పష్టం చేశారు. సబ్జెక్ట్ టీచర్లను క్లరికల్ సిబ్బందిగా ఉపయోగించిన్నట్లయితే వారిని వెంటనే రిలీవ్ చేసి ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను క్లోజ్డ్ వాహనాలలో సురక్షితంగా తరలించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపాట్మెంటల్ అధికారులు పాల్గొన్నారు.



## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి మార్చ్ 20(వుదయం ప్రతినిధి ) ఏదుల, రేవల్లి మండలాల్లో నూతనంగా నిర్మించిన తహసిల్దార్ కార్యాలయ భవనాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఏదుల, రేవల్లి మండలాల్లో పర్యటించారు. ఆయా మండలాల్లో నూతనంగా నిర్మించి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ భవనాల నిర్మాణ నాణ్యత, సౌకర్యాలను సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏదుల, రేవల్లి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలను నూతనంగా నిర్మించిన భవనాలకు షిఫ్ట్ చేసి, అక్కడ నుంచే ప్రజలకు సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన భవనాల్లో ఫర్నిచర్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్లకు ఆదేశించారు. నూతన కార్యాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని త్వరలోనే నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏదుల తహసిల్దార్ మల్లికార్జున్, రేవల్లి తహసిల్దార్ సరస్వతి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఈ నెల 26న ఉచిత కంటి ఆపరేషన్ చికిత్స శిబిరం

నాగర్ కర్నూల్ మార్చి 20(వుదయం ప్రతినిధి) జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో ఈనెల 26న గురువారం నాడు ఉదయం 9నుండి 12గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరము నిర్వహిస్తున్నట్లు నాగర్ కర్నూలు ఆప్తాలమిక్ అధికారి కొ్ట బాలాజీ తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం లోని గదినెంబర్ 102లో కంటిశిబిరం ఉదయం 9 నుండి 12గంటల వరకు వచ్చిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు,సాధారణ పరీక్షలు నిర్వహించి, అందులో అవసరమైన వారికి,క్యాటరాక్టు పొర గలవారికి ఉచితంగా కంటిఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండ లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించ నున్నట్లు తెలిపారు.రోగులకు ప్రత్యేక అంబులెన్స్ ద్వార ఏనుగొండకు పంపనున్నట్లుతెలిపారు.రోగులు ముందుగా బి.పి,షుగర్ పరీక్షలు చేసుక్కొని రిపోర్టు వెంటతెచ్చుకోవాలనితెలిపారు. ఈ ప్రాంత రోగులు ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఓటర్ కార్డు,ఏదేని గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ,ఫోన్ నెంబర్ ని తమవెంట తెచ్చు కోవాలని తెలిపారు.వివరాలకు 9440876556, 7386940480 లో సంప్రదించాలన్నారు.



## నూతన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసిన ఎస్పీ వినీత్

నారాయణపేట మార్చి 20( వుదయం ప్రతినిధి) నారాయణపేట జిల్లాకు ఇటీవల నూతనంగా నియమితులైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా పరిపాలన, శాంతి భద్ర తల పరిరక్షణ, ప్రజా సమస్య ల పరిష్కారం వంటి అంశాల పై పరస్పరం చర్చించుకు న్నారు. జిల్లాలో చట్టవ్యవ స్థను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా పరిపాల న,పోలీస్ శాఖలు సమిష్టిగా కృషి చేస్తామని ఆకాంక్షించారు.

# పరీక్షా కేంద్రంలోకి ఫోన్‌లు అనుమతించొద్దు

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల మార్చి 20 (వుదయం ప్రతినిధి) పరీక్షా కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు అనుమతించరాదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నియమ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు చీఫ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో కచ్చితంగా నిర్వహించాలని, పరీక్ష ప్రారంభానికి ముందు సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు తెలియజేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎవరైనా మొబైల్ ఫోన్‌తో కనిపిస్తే, సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్‌పై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెన్షన్ విధించబడుతుందని హెచ్చరించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తప్పనిసరిగా క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థ లేకపోవడంతో పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు తీసుకురావాల్సిన అవసరం లేదని తెలిపారు. అలాగే మహిళ ఇన్విజిలేటర్లు హ్యాండ్ బ్యాగ్స్‌ను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకురాకూడదని స్పష్టం చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు టాయిలెట్స్, బెంచీలను పూర్తిగా తనిఖీ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, కస్టోడియన్లు, సిబ్బంది తమ విధులను అత్యంత అప్రమత్తంగా నిర్వహిస్తూ కట్టుదిట్టంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో పనిచేసే సిబ్బంది ఒకసారి కేంద్రంలోకి ప్రవేశించిన తరువాత తిరిగి బయటకు వెళ్ళకూడదని తెలిపారు. ప్రశ్న పత్రాల బాధ్యతలో ఉన్న ఇన్విజిలేటర్ పరీక్ష పూర్తయ్యే వరకు సీసీటీవీ పర్యవేక్షణలోనే ఉండాలని తెలిపారు. మిడ్ డే మీల్స్ సిబ్బందికి కూడా మొబైల్ ఫోన్లు అనుమతించరాదని, పోలీస్ సిబ్బంది కూడా ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని ఆదేశించారు. ఇప్పటివరకు పరీక్షలు విజయవంతంగా నిర్వహించబడినట్లు తెలిపారు. రాబోయే పరీక్షల్లో వంద శాతం హాజరు, ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ముఖ్యంగా గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎఎస్పి శంకర్, డిఇఓ విజయలక్ష్మి , అన్ని మండలాల విద్యాధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అయిజలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- పీహెచ్సి, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ, కస్తూర్బా పాఠశాలను తనిఖీచేసిన
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



అలంపూర్ మార్చి 20 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పరిశీలించారు. గర్భిణీ స్త్రీలు, ఇతర రోగులతో మాట్లాడి వైద్య సేవల నాణ్యతను తెలుసుకున్నారు. ఆసుపత్రి గదులు, బెడ్ సీట్లు, సౌకర్యాలను లోతుగా పరిశీలించిన కలెక్టర్, డాక్టర్లు, సిబ్బందితో చర్చించారు. "రోగులకు సరైన వైద్యం, అవసర సౌకర్యాలు అందేలా చూడాలి. ఏమీ లోపం రాకుండా ప్లాన్ చేయండి. లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు" అని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్, ఆసుపత్రి స్వచ్ఛత, మందులు, పరీక్షల సౌలభ్యం మీద దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇలాంటి తనిఖీలు ముమ్మరమవుతున్నాయి. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం అత్యవసరంగా తనిఖీ చేశారు. విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించి, మౌలిక సౌకర్యాలు, భోజన నాణ్యతపై శ్రద్ధగా పరిశీలించారు. పాఠశాల తరగతి గదులు, హాస్టల్‌లను సందర్శించిన కలెక్టర్ బోధన విధానాలు, విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ ప్రమాణాలపై అధ్యాపకులతో వివరంగా చర్చించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. హాస్టల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టిన కలెక్టర్ ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని అధికారులు, అధ్యాపకులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి మౌలిక సౌకర్యాలు కల్పించాలి. ఏ లోపాలూ ఉండకూడదని పేర్కొన్నారు.

పట్టణ కేంద్రంలో హెచ్.పీ. గ్యాస్ ఏజెన్సీని, ఎల్.పి.జి. గోదామును అకస్మాత్తుగా పరిశీలించారు. ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడుతూ, వంట గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు ఆటంకం లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు."అనవసరంగా సిలిండర్లను పక్కదారి పట్టించకూడదు. ఉల్లంఘనలకు కఠిన చర్యలు తప్పవు" అని కలెక్టర్ హెచ్చరించారు. తర్వాత ఐజ పట్టణంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రాలను తనిఖీ చేశారు. ఏజెన్సీలతో చర్చించి, "రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మకూడదు. నాణ్యమైన ఎరువులు మాత్రమే పంపిణీ చేయాలి. లేకపోతే కఠోర చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. చివరిగా అయిజ పట్టణంలోని జామియా మజీద్ (నడి మస్జీద్)లో రంజాన్ మాసపు చివరి శుక్రవారము నమాజ్ ప్రార్థనలో భాగంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా పాల్గొనడము, నమాజ్ చేసుకోవడము జరిగినది. ఈ సందర్భంగ కలెక్టర్ ని మజీద్ కమిటీ సభ్యులు జామియా మస్జీద్ సదర్ సాబ్, ఎండీ ఇస్మాయిల్, మస్జీద్ మత పెద్దలు ఎండీ మహబూబ్ పాషా, వహీద్ బాషా, రహమతుల్లా, 20 వ వార్డు సభ్యులు అందరు కలెక్టర్ ని సత్కరించడము జరిగినది.



# ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట మార్చి 20( వుదయం ప్రతినిధి) రంజాన్ పండుగ సందర్భంగా నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లాలోని ము స్లింలకు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బువ్వమ్మ గుట్ట ఈద్గా వద్ద పోలీసు బందోబ స్తు ఏర్పాట్లను శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని జిల్లా పరిధిలోని అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్‌లు అమలు చేస్తు న్నామని, ప్రధాన రహదా రులు, చౌరస్తాల్లో ప్రత్యేక పోలీసు పికెట్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అలాగే, పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా నిరంతర పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలంద రూ సోదరభావంతో, పరస్పర గౌరవంతో తమ పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుత వాతావర ణంలో జరుపుకోవాలని కోరారు.సామాజిక మాధ్య మాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలలో ఇతరుల మనోభా వాలను దెబ్బతీయగల, కించపరిచే పోస్టులు చేయ కుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. సోషల్ మీడి యాపై పోలీసు శాఖ నిరంత రం నిఘా ఉంచుతుందని, ఎవరైనా అనుచిత పోస్టులు పెడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీస్ శాఖకు ప్రజలు పూర్తి సహ కారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ తో పాటు డీఎస్పీ నల్లపు లింగ య్య, ఎస్సై వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, ఎంఐఎం కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు తది తరులు పాల్గొన్నారు.

# మల్టీగ్రెయిన్ పిండి అందరికీ మంచిది కాదా?

ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య స్పృహ పెరగడంతో చాలా మంది సాధారణ గోధుమ పిండికి బదులుగా మల్టీగ్రెయిన్ పిండిని వాడుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని భావించే మల్టీగ్రెయిన్ పిండి అందరికీ సరిపడకపోవచ్చు. ప్రకటనల్లో చూసినట్లుగా ఇది అందరికీ అమృతం లాంటిది కాదు. కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్న వారు దీనిని తీసుకునే ముందు జాగ్రత్త వహించాలని నిపుణులు



సూచిస్తున్నారు. లేదంటే, కొన్ని సందర్భాల్లో ఇది ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేయవచ్చు అంటున్నారు. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య స్పృహ పెరగడంతో చాలా మంది సాధారణ గోధుమ పిండికి బదులుగా మల్టీగ్రెయిన్ పిండిని వాడుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని భావించే మల్టీగ్రెయిన్ పిండి (ఓబీశ్రీబితిణతీజీ తిని ంబిబిజీ) అందరికీ సరిపడకపోవచ్చు. ప్రకటనల్లో చూసినట్లుగా ఇది అందరికీ అమృతం లాంటిది కాదు. కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తీసుకునే ముందు జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే, కొన్ని సందర్భాల్లో ఇది ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేయవచ్చు అంటున్నారు. మల్టీగ్రెయిన్ పిండిలో గోధుమలతో పాటు జొన్నలు, సజ్జలు, రాగులు, సోయాబీన్ మరియు శనగలు వంటి వివిధ రకాల ధాన్యాలు కలుస్తాయి. ఇది పీచు పదార్థం మరియు ప్రోటీన్లకు మంచి వనరు అయినప్పటికీ, అందరి శరీరతత్వానికి ఇది సెట్ అవ్వదు. శరీర అవసరాలకు అనుగుణంగా ధాన్యాలను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారు: మల్టీగ్రెయిన్ పిండిలో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారు లేదా ఐబీఎస్ వంటి సమస్యలు ఉన్నవారు దీనిని తింటే ఆహారం త్వరగా అరగదు. దీనివల్ల కడుపు నొప్పి, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతాయి. కిడ్నీ రోగులు: కిడ్నీ సమస్యలతో బాధపడేవారు తక్కువ పొటాషియం, ఫాస్పరస్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. మల్టీగ్రెయిన్ పిండిలో వివిధ రకాల చిరుధాన్యాలు కలవడం వల్ల వీటి శాతం పెరుగుతుంది, ఇది కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది.థైరాయిడ్ సమస్యలు: చాలా మల్టీగ్రెయిన్ మిశ్రమాలలో సోయాబీన్ పిండిని కలుపుతారు. సోయాలో ఉండే కొన్ని పదార్థాలు థైరాయిడ్ మందుల పనితీరును అడ్డుకుంటాయి. కాబట్టి థైరాయిడ్ ఉన్నవారు సోయా లేని పిండిని ఎంచుకోవాలి. అలర్జీ బాధితులు: మార్కెట్లో దొరికే పిండిలో ఏయే ధాన్యాలు ఏ నిష్పత్తిలో ఉన్నాయో స్పష్టంగా తెలియదు. గ్లూటెన్ పడని వారు,కొన్ని రకాల ధాన్యాల పట్ల అలర్జీ ఉన్నవారు దీనిని వాడటం వల్ల చర్మ సమస్యలు లేదా శ్వాస ఇబ్బందులు రావచ్చు. నిపుణుల సలహా: బయట దొరికే రెడీమేడ్ ప్యాకెట్ల కంటే, ఇంటి వద్దే కావలసిన ధాన్యాలను తగిన నిష్పత్తిలో కలిపి పిండి పట్టించుకోవడం ఉత్తమం. ప్రారంభంలో తక్కువ పరిమాణంలో తిని, శరీరానికి అది పడుతుందో లేదో గమనించాలి.

# అందుకే తమలపాకు మంచిదట!



ఇంట్లో జరిగే పూజలు, శుభకార్యాలకు, ముత్తైదువులకు వాయనమివ్వడానికి.. పూలు పండ్లతో పాటు ఎక్కువగా ఉపయోగించేది తమలపాకులే. ఇలా శుభప్రదంగా వాడే తమలపాకులు కొన్ని రకాల అనారోగ్యాల్నీ దూరం చేస్తాయంటున్నారు నిపుణులు. ఇందుకు వీటిలోని ఔషధ గుణాలే కారణమట! మరి, అవేంటో తెలుసుకుందాం రండి.. కొంతమంది తమలపాకులను రోజూ నములుతుంటారు. దీనివల్ల శరీరంలో కొన్ని రకాల ఆరోగ్య సమస్యలుంటే తొలగిపోతాయట. పెద్ద కప్పు నీటిలో కొన్ని తమలపాకులు వేసి నీళ్లు సగమయ్యేంత వరకు మరిగించాలి. ఈ నీటిని తాగడం వల్ల కూడా పలు ప్రయోజనాలు పొందచ్చట. ఇవి నోటి దుర్వాసనను దూరం చేస్తాయట. అలాగే చిగుళ్ల నుంచి వచ్చే బ్లీడింగ్‌ని ఆపి.. దంతాలను దృఢపరిచే గుణం తమలపాకులకు ఉందంటున్నారు నిపుణులు. చర్మంపై దురద, అలర్జీ.. మొదలైన సమస్యలను కూడా తమలపాకులు దూరం చేస్తాయట. వీటిలో ఉండే యాంటీసెప్టిక్ గుణాలే ఇందుకు కారణమట. గాయాలు మానడానికి తమలపాకుల్ని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో కొన్ని తమలపాకుల నుంచి తీసిన రసాన్ని గాయంపై రాసి.. దానిపై మరో తమలపాకును ఉంచి కట్టు కట్టాలి. ఫలితంగా గాయం మానే అవకాశం ఉందంటున్నారు నిపుణులు.

# కొబ్బరి నీళ్లు తాగితే ప్రమాదమా?

ప్రకృతి ప్రసాదించిన అత్యంత స్వచ్ఛమైన డ్రింక్ ఏది అంటే ఎవరైనా కొబ్బరి నీళ్లు అని చెబుతారు. విటమిన్లు, ఎలక్ట్రోలైట్లు, మినరల్స్‌కు నిలయమైన ఈ పానీయం దాహాన్ని తీర్చడమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మనం నమ్ముతాం. అయితే అదే కొబ్బరి నీరు ఒక నిండు ప్రాణాన్ని కేవలం 26 గంటల్లో బలితీసుకుంటుందని ఎవరైనా ఊహిస్తారా? కొన్ని నెలల క్రితం డెన్మార్క్‌లో 69 ఏళ్ల వృద్ధుడికి ఎదురైన విషాదకర ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డెన్మార్క్‌లో ఒక వృద్ధుడు తాజాగా కనిపిస్తున్న కొబ్బరికాయను కొట్టించుకుని నీళ్లు తాగాడు. తాగిన మూడు గంటలకే అతనికి విపరీతంగా చెమటలు పట్టడం, వాంతులు, వికారం మొదలయ్యాయి. ఆసుపత్రికి తరలించేసరికి అతను గందరగోళానికి గురై, కండరాల కదలికలపై నియంత్రణ కోల్పోయాడు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కేవలం 26 గంటల్లోనే అతని శరీరంలోని కీలక అవయవాలన్నీ విఫలమై మరణించాడు. మృత్యుపాశం: పరిశోధనలో తేలిన అంశం ఏంటంటే.. వైద్యులు నిర్వహించిన కొబ్బరి నీరు సేవించిన తర్వాత ప్రాణాంతకమైన 3-నైట్రోప్రొపియోనిక్ విషం వల్ల చనిపోయినట్లు అధ్యయనంలో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. ఆ కొబ్బరి నీళ్లలో 3-నైట్రోప్రొపియోనిక్ యాసిడ్ అనే శక్తివంతమైన శిలీంధ్ర విషం ఉన్నట్లు గుర్తించారు. బయటకు కాయ తాజాగా కనిపిస్తున్నా లోపల ఈ విషపూరిత శిలీంధ్రాలు వృద్ధి చెందుతాయి. ఇది ఎలా చేరుతుంది: కొబ్బరికాయలు కోసిన తర్వాత వాటిని సరైన పద్ధతిలో నిల్వ చేయకపోతే, ముఖ్యంగా వెచ్చని, తేమతో కూడిన వాతావరణంలో ఉంచినప్పుడు, పెంకుపై ఉండే సూక్ష్మ పగుళ్ల ద్వారా ఆర్థ్రోబీనియం వంటి శిలీంధ్రాలు లోపలికి ప్రవేశిస్తాయి. ఇవి నీటిలో చేరి 3-ఔఖం అనే విషాన్ని ఉత్పత్తి చేస్తాయి. బయటకు కాయ ఎంతో తాజాగా కనిపిస్తున్నా, లోపల మాత్రం ఈ నిగూఢ విషం తయారవుతుంది. కలుషిత కొబ్బరి నీళ్లు తాగిన కొద్ది గంటల్లోనే వాంతులు, విరేచనాలు, తీవ్రమైన కడుపునొప్పి రావచ్చు. 3-ఔఖం నేరుగా మెదడును, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. దీనివల్ల మూర్ఛలు, కండరాల అసాధారణ సంకోచాలు సంభవిస్తాయి. ఊపిరితిత్తుల్లో ద్రవం చేరడం, ఛాతి బిగుతుగా మారి శ్వాస తీసుకోవడం కష్టమవ్వడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. విషం తీవ్రత పెరిగితే కాలేయం, కిడ్నీలు దెబ్బతిని మరణం సంభవించవచ్చు. నీరు తాగేటప్పుడు కొంచెం పుల్లగా ఉన్నా, రుచి మారినా లేదా అసాధారణ వాసన వస్తున్నా వెంటనే ఆ నీటిని పారేయండి. ప్యాక్ చేసిన కొబ్బరి నీళ్లను పాశ్చరైజేషన్ చేస్తారు కాబట్టి, అవి నేరుగా చిప్ప నుండి తాగే వాటికంటే కొన్నిసార్లు సురక్షితం. కొబ్బరికాయలను చల్లని ప్రదేశంలో ఉంచండి. అయితే ఫ్రిజ్‌లో ఉంచినంత మాత్రాన ప్రమాదం పూర్తిగా పోదు, తాగే ముందు తనిఖీ ముఖ్యం. గర్భిణీలు, చిన్న పిల్లలు మరియు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు పచ్చి, శుద్ధి చేయని కొబ్బరి నీటిని తాగేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలి.



# చక్కని ఆరోగ్యం

# బీట్‌రూట్.. ఈ సమస్యలు ఉన్నవారు తాగితే రిస్క్

బీట్‌రూట్.. పోషకాల గని. ఇందులో ఉండే ఫోలేట్, పొటాషియం, విటమిన్-సి వంటి పోషకాలు శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. రక్తాన్ని పెంచడానికి, చర్మాన్ని మెరుగుపరచడానికి చాలా మంది బీట్‌రూట్ జ్యూస్‌ను క్రమం తప్పకుండా తీసుకుంటారు. అయితే ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ పోషకమైన జ్యూస్ అందరికీ సరిపడదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇది ప్రయోజనానికి బదులుగా హాని కలిగించే అవకాశం ఉంది. కిడ్నీలో రాళ్ల సమస్య : ఎవరికైతే కిడ్నీలో రాళ్లు ఉన్నాయో లేదా గతంలో ఆ సమస్యతో బాధపడ్డారో, వారు బీట్‌రూట్ జ్యూస్ తాగకపోవడమే మంచిది. బీట్‌రూట్‌లో ఆక్సలేట్ అనే మూలకం అధికంగా ఉంటుంది. ఇది కిడ్నీలో రాళ్ల సమస్యను మరింత తీవ్రతరం చేయడమే కాకుండా, కొత్తగా రాళ్లు ఏర్పడటానికి కారణమవుతుంది. తక్కువ రక్తపోటు: బీట్‌రూట్ సహజంగానే రక్తపోటును తగ్గించే గుణాన్ని కలిగి ఉంటుంది. ఇది హై బీపీ ఉన్న రోగులకు వరప్రసాదం లాంటిది. కానీ, ఇప్పటికే బీపీతో బాధపడేవారు దీనిని తీసుకుంటే రక్తపోటు మరింత పడిపోయి, నీరసం లేదా కళ్లు తిరగడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. బలహీనమైన జీర్ణశక్తి: తరచుగా కడుపు నొప్పి, గ్యాస్ లేదా ఉబ్బరం వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారు బీట్‌రూట్ రసానికి దూరంగా ఉండాలి. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణక్రియ మందగించి, కడుపులో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. అలర్జీ సమస్యలు: అలర్జీలు ఉన్నవారికి బీట్‌రూట్ రసం ఒక్కోసారి వికటించవచ్చు. దీనివల్ల చర్మంపై దురద, ఎర్రటి దద్దుర్లు లేదా చికాకు కలగవచ్చు. కొంతమందిలో వికారం లేదా వాంతులు వంటి దుష్ప్రభావాలు కూడా కనిపించవచ్చు. ఏదైనా అతిగా తీసుకుంటే అది హాని కలిగిస్తుందనేది మరువకూడదు. బీట్‌రూట్ జ్యూస్ శరీరానికి సరిపడుతుందో లేదో తెలుసుకోవడానికి తక్కువ పరిమాణంలో ప్రారంభించడం లేదా వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.



# ఆరోగ్యానికి ప్రకృతి ఇచ్చిన వరం

మారుతున్న జీవనశైలి, గంటల తరబడి కూర్చుని పనిచేయడం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల ప్రస్తుతం చాలా మంది ఎముకల సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా 30 ఏళ్లు దాటిన తర్వాత ఎముకల సాంద్రత తగ్గడం ప్రారంభమై, అవి బలహీనపడే ప్రక్రియ వేగవంతమవుతుంది. దీనివల్ల కీళ్ల నొప్పులు, ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల ముప్పు పెరుగుతోంది. అయితే మన వంటింట్లో దొరికే మెంతులు ఈ సమస్యలకు అద్భుత పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు. ఎముకలకు మెంతులు: నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ నివేదికల ప్రకారం.. మెంతులు ఎముకల ఆరోగ్యానికి ఒక శక్తివంతమైన ఔషధంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే పోషకాలు ఎముకలను దృఢంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మెంతుల్లో కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, ఇనుము పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముక సాంద్రతను పెంచి, విరిగే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఎముకలు విరిగినప్పుడు లేదా దెబ్బతిన్నప్పుడు.. అవి త్వరగా కోలుకోవడానికి మెంతులు సహాయపడతాయి. ఇందులోని శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ గుణాలు కీళ్లవాతం, కీళ్ల నొప్పి, వాపును తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఎలా తీసుకోవాలి?: ఎముకల బలాన్ని పెంచుకోవడానికి మెంతులను ఈ పద్ధతుల్లో తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒక టీస్పూన్ మెంతులను రాత్రంతా ఒక గ్లాసు నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే పరగడుపున ఆ నీటిని తాగి, గింజలను నమిలి తినడం వల్ల పూర్తి ప్రయోజనం లభిస్తుంది. అంతేకాకుండా మెంతులను దోరగా వేయించి, పొడిగా నూరి పెట్టుకోవాలి. ఈ పొడిని ప్రతిరోజూ ఉదయం గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవచ్చు. 30 ఏళ్లు దాటిన వారు: ఎముకలు బలహీనపడకుండా ఉండాలంటే కేవలం చిట్కాలు మాత్రమే సరిపోవు. ఆహారంలో కాల్షియం మరియు విటమిన్ డి సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఉదయం పూట ఎండలో కాసేపు గడపడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎముకల ఆరోగ్యం కోసం మెంతులతో పాటు కాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం. ఏదైనా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుని సలహాతోనే ఈ మార్పులు చేసుకోవడం ఉత్తమం.



# చర్మాన్ని మెరిపించే 'ఓట్స్'..!

ఓట్స్.. పోషకాహారంగా దీనికి పేరుంది. అయితే దీన్ని సౌందర్య పోషణలోనూ భాగం చేసుకోవడం వల్ల అందం ఇనుమడిస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి.. ఓట్‌మీల్ మంచి ఫేస్‌వాష్‌గానూ పనిచేస్తుంది. గోరువెచ్చటి నీటిలో కొన్ని ఓట్స్ వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీనికి టీస్పూన్ తేనె కలిపి.. ఈ మిశ్రమంతో ముఖంపై మునివేళ్లతో గుండ్రంగా రుద్దాలి. తద్వారా చర్మ రంధ్రాల్లో పేరుకున్న దుమ్ము, ధూళి తొలగిపోయి ముఖం శుభ్రపడుతుందట. అలాగే తేనెలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల చర్మం కాంతివంతమవుతుందంటున్నారు నిపుణులు. మనం రోజూ ఎన్నో పనులతో అలసిపోతుంటాం.. ఇలాంటి సమయంలో గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేస్తే ఎంతో హాయిగా ఉంటుంది. అయితే ఇందులో ఒక కప్పు ఓట్స్, కొన్ని చుక్కల లావెండర్ నూనె వేయాలి. ఈ మిశ్రమంతో స్నానం చేస్తే మరింత ఫలితం ఉంటుంది. ఇందులో ఉపయోగించిన ఓట్స్ చర్మాన్ని శుభ్రం చేయడంతో పాటు తేమ నిలిచి ఉండేలా చేస్తుంది. అలాగే లావెండర్ చర్మాన్ని సువాసనభరితం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. కొంతమందికి చర్మం పొడిబారిపోయి దురద పెడుతూ ఉంటుంది. చర్మంలో తేమ శాతం తగ్గిపోవడం, పీహెచ్ స్థాయుల్లో హెచ్చుతగ్గులు.. మొదలైనవి ఇందుకు కారణం కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి స్నానం చేసే నీటిలో ఓట్స్ కలుపుకోవడం వల్ల చర్మం తేమను సంతరించుకోవడంతో పాటు, పీహెచ్ స్థాయులు బ్యాలన్స్ అవుతాయి. దీనివల్ల చర్మంపై దురద, అలర్జీ.. వంటివి క్రమంగా తగ్గుముఖం పడతాయి అంటున్నారు నిపుణులు.



# నీరసం తగ్గించే సలాడ్!

ఒంటికి కాస్త వేడి తగలగానే... తీరని దాహం, నిస్సత్తువ. వేసవిలో దాదాపు అందరిదీ ఇదే పరిస్థితి. ఇలాంటప్పుడు మీ డైట్‌లో తాజా కూరగాయలతో సలాడ్‌ను చేర్చుకోండి. ఏంటీ దీని ప్రయోజనాలు అంటారా? ఎండల తీవ్రత, వేడి, చెమట వల్ల శరీరంలో నీరు త్వరగా ఆవిరైపోతుంది. ఇలాంటి సమయంలో క్యాబేజీ, క్యారెట్, దోసకాయ, కీరదోస, టొమాటో, క్యాప్సికం వంటి తాజా కూరగాయలతో చేసే ఈ సలాడ్ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది పైగా వీటిలో విటమిన్ ఏ, సిల తోపాటు ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు... వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. దీంతో రోగనిరోధక శక్తి బలపడుతుంది. చర్మమూ పొడిబారదు. అంతేకాదు, ఈ వెజిటబుల్ సలాడ్ నుంచి తక్కువ కెలొరీలు... ఎక్కువ పోషకాలు అందడం వల్ల బరువూ నియంత్రణలో ఉంటుంది. హార్మోన్ల సమతుల్యత మెరుగవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. దీన్ని ఉదయం సాయంత్రం ఎప్పుడైనా తినొచ్చు. ఈ ముక్కలపై కాస్త నిమ్మరసం, మిరియాల పొడి, చిటికెడు ఉప్పు కలిపి తింటే నోటికి రుచే కాదు... శరీరమూ రిఫ్రెష్ అవుతుంది.




# మండే వేసవిలో పవర్‌ఫుల్ పండు

ఎండలు దంచికొడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు.. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం ఉత్తమం.. ముఖ్యంగా సరిపడినంత నీరు తాగడం అలాగే.. మంచి ఆరోగ్యకరమైన పండ్లు తీసుకోవడం ఉత్తమం.. అలాంటి అద్భుతమైన పండ్లలో కర్బూజ ఒకటి.. ఇది తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు..వేసవి కాలం వచ్చేసింది.. ఎండలు దంచికొడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు.. డీహైడ్రేషన్ బారిన పడకుండా.. హైడ్రేషన్ గా ఉండేందుకు .. మంచి పండ్లను తీసుకోవడం మంచిది.. అలాంటి అద్భుతమైన పండ్లలో కర్బూజ ఒకటి.. ఇది వేసవిలో శరీరానికి అద్భుతమైన చలువ చేస్తుంది.. ఈ పండులో అధిక నీటి శాతం ఉంటుంది.. దీనిలో 90శాతానికి పైగా నీరు.. డీహైడ్రేషన్‌ను నివారించేలా సహాయపడుతుంది. శరీరంలోని వేడి తగ్గుతుంది: కర్బూజ అద్భుతమైన పండు.. ఇది వేసవిలో



శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, శరీరాన్ని చల్లబరుస్తుంది, ఎండదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది: కర్బూజను తీసుకుంటే.. రక్తపోటు అదుపులో ఉండటంతోపాటు.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.. దీనిలో ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో.. అలాగే రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో సహాయపడుతుంది. కడుపు సమస్యలకు చెక్: వేసవి కాలంలో తరచూ గ్యాస్, అజీర్తి, మలబద్ధకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు బాధపడుతుంటారు.. అయితే, ఈ సీజన్‌లో సులభంగా జీర్ణమయ్యే కర్బూజను తినడం ద్వారా.. కడుపు సమస్యలకు చెక్ పెట్టవచ్చు.. కంటి ఆరోగ్యం: కర్బూజ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.. అలాగే.. కంటికి సంబంధించిన సమస్యలు కూడా దూరమవుతాయి.. దీనిలోని విటమిన్ ఎ బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతాయి.లైంగిక సమస్యలు: కర్బూజలో విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. అందువల్ల ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని రెగ్యులర్ గా తినడం వల్ల లైంగిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారు కర్బూజను తీసుకుంటే.. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.. అలాగే.. కర్బూజ బరువును తగ్గడంలో.. చర్మ ఆరోగ్యానికి బాగా సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు. అయితే.. ప్రతి రోజూ కర్బూజను తినడం వల్ల ఇలా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొంటున్నారు.

# ఉల్లిపాయలను ఇలా తింటే ప్రయోజనం



మనం వంటలో ఉల్లిపాయలను ఏదో ఒక రూపంలో ఉపయోగిస్తాము. అవి వంటకు రుచిని జోడించడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మంచిగా పని చేస్తాయి.. సాధారణంగా, వంటలలో వాటిని ఉపయోగించేటప్పుడు, మనం ఉల్లిపాయలను ఉడికించి లేదా వేయించి, ఆ తర్వాత వంటలో వాడతాము. కానీ, ఉల్లిపాయలను పచ్చిగా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు కు తెలుసా? ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు.. ఎందుకంటే.. ఉల్లిపాయల్లో ఎన్నో ఔషధ గుణాలు, పోషకాలు దాగున్నాయి.. పచ్చి ఉల్లిపాయలోని యాంటీఆక్సిడెంట్లు, సల్ఫర్ సమ్మేళనాలు, విటమిన్లు రోగనిరోధక శక్తిని పెంచి ఎన్నో సమస్యలను నివారిస్తాయి.. అందుకే.. పచ్చి ఉల్లిని మన ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. వాస్తవానికి మనం మన రోజువారీ వంటల్లో ఉల్లిపాయలను ఏదో ఒక రూపంలో ఉపయోగిస్తాము. అవి మన వంటలకు రుచిని జోడించడమే కాకుండా, మన ఆరోగ్యానికి కూడా చాలా మంచివి. సాధారణంగా, వంటకాల్లో వాటిని ఉపయోగించేటప్పుడు, మనం వాటిని ఉడికించి లేదా వేయించి, ఆ తర్వాత వంటలో వాడతాము. కానీ, ఉల్లిపాయలను పచ్చిగా తినడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. మధుమేహం లేదా ప్రీ-డయాబెటిస్‌ను తగ్గించడానికి ఉల్లిపాయలను ప్రతిరోజూ తినవచ్చు. ఉల్లిపాయలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి చాలా మంచివి.పచ్చి ఉల్లిపాయలలో ఉండే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది కాకుండా, ఇందులో ఫ్లేవనాయిడ్ అనే యాంటీఆక్సిడెంట్ కూడా ఉంటుంది.. ఇది కూడా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి..పచ్చి ఉల్లిపాయలలో ఇతర పోషకాలతో పాటు పీచుపదార్థం కూడా పుష్కలంగా ఉంటుంది. పేగుల ఆరోగ్యానికి అత్యవసరమైన పీచుపదార్థం.. ప్రీబయోటిక్స్‌కు ఉల్లిపాయలు ఒక అద్భుతమైన మూలంగా పరిగణిస్తారు.ఉల్లిపాయల్లోని ఔషధ గుణాలు.. జలుబు-దగ్గును తగ్గిస్తాయి.. అలాగే.. చర్మ, కేశ సంరక్షణకు సైతం మేలు చేస్తాయి. ఉల్లిపాయలు పొట్ట ఆరోగ్యానికి చాలా మంచివి.. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో బాగా సహాయపడతాయి. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల శరీరంలో జీర్ణక్రియ మెరుగుపడి.. మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది.

## పెరిగిన చమురు ధరలు




ఇరాన్ సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడి చేసిన అనంతరం ప్రతీకారంగా ఇరాన్ మధ్యప్రాచ్యంలోని ఇంధన సదుపాయాలపై దాడి చేయడంతో చమురు ధరలు పెరిగిపోయాయి. బ్యారెల్‌కు 119 డాలర్లు దాటాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ 6.02 డాలర్లు లేదా 5.6 శాతం పెరిగి బ్యారెల్‌కు 113.40 డాలర్ల వద్ద ఉంది. సెషన్ ప్రారంభంలో, బ్రెంట్ 11డాలర్ల కంటే ఎక్కువ పెరిగి 119.13డాలర్ల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఇది మార్చి 9న తాకిన మూడున్నర సంవత్సరాల గరిష్టస్థాయికి దగ్గరగా ఉంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ 7సెంట్లు లేదా 0.1శాతం పెరిగి బ్యారెల్‌కు 96.39డాలర్ల వద్ద ఉంది.




# 8 గంటల పాటు అనిల్ అంబానీని విచారించిన సీబీఐ



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీపై నమోదైన రూ.2,929 కోట్ల మోసం కేసుకు సంబంధించి సీబీఐ ఆయన్ను సుమారు 8 గంటల పాటు ప్రశ్నించింది. అనిల్ అంబానీ ఉదయం 10:15 గంటలకు సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం ఆయన్ను విచారణ బృందం వద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం 6:15 గంటల సమయంలో ఆయన సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. ఇప్పటికే పలు కేసుల్లో సీబీఐ విచారణను ఎదుర్కొంటున్న అనిల్‌ను శుక్రవారం మరోసారి విచారణ నిమిత్తం పిలిచినట్లు అధికారులు తెలిపారు. 'రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్, అనిల్ అంబానీ, గుర్తు తెలియని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతరులు నిందితులుగా ఉన్న రూ.2,929.05 కోట్ల బ్యాంకు మోసం కేసులో.. 2025 ఆగస్టు 21న కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలో విచారణ నిమిత్తం హాజరు కావాలని అనిల్‌కు సమన్లు జారీ చేశాం. ఆయన్ను సుమారు 8 గంటల పాటు విచారించాం. శుక్రవారం మరోసారి విచారణకు హాజరు రావాలని ఆదేశించామ'ని సీబీఐ అధికారులు తెలిపారు.

### టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌కు


# బ్రిటిష్ ప్రభుత్వ నైట్‌హుడ్ పురస్కారం



భారత్–యూకే వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడంలో విశేష కృషి చేస్తున్న టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు బ్రిటిష్ ప్రభుత్వం గౌరవ నైట్‌హుడ్‌ను ప్రదానం చేసింది. బుధవారం రాత్రి ఢిల్లీలోని బ్రిటిష్ హైకమిషనర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు 'నైట్ కమాండర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్సెలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (కేబీఈ)' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'యూకేలో టాటా గ్రూప్ దీర్ఘకాలంగా పెట్టుబడులు పెడుతోంది. దీని కార్యకలాపాలు వాహన, ఉక్కు, సాంకేతికత, వినియోగదారు రంగాల్లో విస్తరించి ఉన్నాయి. ఇది యూకేలో ఉద్యోగాలకు, అధునాతన తయారీ రంగానికి, స్వచ్ఛమైన సాంకేతికతల వైపు పరివర్తనకు మద్దతు ఇవ్వడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. టాటా గ్రూప్ ఛైర్మన్‌గా, ఆయన అనేక సంవత్సరాలుగా యూకే–భారత వ్యాపార సంబంధాలకు, బ్రిటన్‌లో పెట్టుబడులకు విశేష కృషి చేశార'ని హైకమిషన్ తెలిపింది. బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్–3 తరఫున బ్రిటిష్ హైకమిషనర్ కామెరాన్ ఈ గౌరవ పురస్కారాన్ని చంద్రశేఖరన్‌కు ప్రదానం చేశారు. ఈ గౌరవం కేవలం తన ఒక్కడికే కాదని, టాటా గ్రూప్‌లోని సహోద్యోగులందరికీ చెందుతుందని చంద్రశేఖరన్ అన్నారు.

# పశ్చిమాసియా టెన్షన్ ప్రభావం ?

# సెన్సెక్స్ భారీ పతనం




పశ్చిమాసియాలో మళ్లీ తీవ్రతరమవుతోన్న ఉద్రిక్తతలు భారతీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్ దాడుల కారణంగా గ్లోబల్ మార్కెట్లు కుదేలవుతుండటంతో, దేశీయ సూచీలు కూడా భారీ పతనాన్ని నమోదు చేశాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఉదయం 9:29 గంటల సమయంలో సెన్సెక్స్ దాదాపు 1,500 పాయింట్లు కోల్పోయి 75,200 స్థాయికి దిగజారింది. అదే సమయంలో నిఫ్టీ కూడా 450 పాయింట్లకు పైగా పడిపోయి 23,300 మార్క్ కిందకు చేరింది. పశ్చిమాసియాలో యుద్ధ భయం పెరగడం, ముఖ్యంగా ఇరాన్ కీలక చమురు, గ్యాస్ వనరులను లక్ష్యంగా చేసుకోవడం వల్ల సరఫరా అంతరాయం కలుగుతుందనే ఆందోళనలతో బ్రెంట్ క్రూడ్ ధరలు ఒక్కసారిగా 3 శాతం ఎగసి బ్యారెల్‌కు 111 డాలర్లను తాకాయి. ఇక విదేశీ మారకద్రవ్య మార్కెట్లో డాలర్ బలపడటంతో రూపాయి మరింత బలహీనపడింది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92.89 వద్ద ఆల్‌మ్ కనిష్ఠానికి చేరుకుంది. రంగాల వారీగా చూస్తే చమురు ధరల పెరుగుదల కారణంగా ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, ఎన్టీపీసీ వంటి కంపెనీల షేర్లు స్వల్ప లాభాలు నమోదు చేస్తున్నాయి. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ, లార్సెన్ అండ్ టూబ్రో, టీఎంపీవీ, శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ వంటి షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. మొత్తానికి, యుద్ధ భయం కొనసాగుతున్నంత కాలం మార్కెట్లలో అస్థిరత కొనసాగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

# హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో విభేదాలు..!




దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రంగ బ్యాంక్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మేనేజ్‌మెంట్‌లో విభేదాలు తలెత్తాయి. ఆ బ్యాంక్ ఛైర్మన్ అతాన్ చక్రవర్తి ఆకస్మిక రాజీనామాకు మేనేజ్‌మెంట్‌తో ఉన్న విభేదాలేకారణమని తెలుస్తోంది. తన రాజీనామా లేఖలో ఆయన విలువలు, నైతికతవిషయంలో గతరెండేళ్లుగా బ్యాంకులో జరుగుతున్న కొన్ని పరిణామాలు ఆందోళన కలిగిస్తోన్నాయని బాంబ్ పేల్చారు. పలు సంఘటలను, ధోరణులను అంగీకరించలేకపోతున్నానని చక్రవర్తి పేర్కొ న్నారు. ఇది బ్యాంకింగ్, స్టాక్ మార్కెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో బ్యాంకులో గవర్నెన్స్ సమస్యలు ఉన్నాయనే ఆందోళనతో ఇన్వెస్టర్లు భారీగా షేర్లను విక్రయించారు. ఇంట్రాడేలో ఆ బ్యాంక్ షేర్ 9 శాతం క్షీణించింది.

# భారత జిడిపి అంచనాలకు కోత




పశ్చిమాసియాలో నెలకొన్న సంఘర్షణల వల్ల వచ్చే ఏడాది కాలంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ 95 స్థాయికి పడిపోవచ్చని గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మాన్ సాక్స్ తెలిపింది. మరోవైపు భారత వృద్ధి రేటు అంచనాలకు కోత పెట్టింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంక్షయుక్తంగా కొనసాగిస్తోన్న యుద్ధోన్మాదం వల్ల నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలతో వచ్చే ఆర్థిక సంవత్సరం 2026–27లో భారత జిడిపి అంచనాలను 7 శాతం నుంచి 6.4 శాతానికి కోత పెడుతూ హెచ్చరించింది. గతంలో కంటే ఇది 50 బేసిస్ పాయింట్లు తక్కువ. మరోవైపు ద్రవ్యోల్బణ అంచనాను 30 బేసిస్ పాయింట్లు పెంచింది. కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) 2025తో పోలిస్తే ఈ ఏడాది 0.8 శాతం పాయింట్లు పెరిగి జిడిపిలో 1.2 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేసింది. వచ్చే ఏడాది కాలంలో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 95 స్థాయికి పడిపోవచ్చని ఆ సంస్థ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ శాంతను సేన్‌గుప్తా హెచ్చరించారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిస్థితుల వల్ల చమురు ధరలు బ్యారెల్‌కు 100 మార్కును తాకుతున్నాయన్నారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని ఆయన ఓ ఇంటర్వ్యూలో విశ్లేషించారు. గత 25 ఏళ్లలో ఎదురైన చమురు సంక్షోభాల కంటే ఇది భిన్నమైనదని శాంతను సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. గతంలో చమురు ధరలు పెరిగినప్పుడు మధ్యప్రాచ్య దేశాల ఆదాయం పెరిగి.. తద్వారా భారత్‌కు ఎగుమతులు, రెమిటెన్స్‌ల రూపంలో మేలు జరిగేదన్నారు. కానీ.. ప్రస్తుత యుద్ధం నేరుగా ఆ ప్రాంతంలోనే జరుగుతుండటంతో అటు ఇంధన ధరల భారం పెరగడమే కాకుండా ఇటు మధ్యప్రాచ్య దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా దెబ్బతింటాయన్నారు. దీనివల్ల భారత్‌కు అందే ఎగుమతుల ఆర్డర్లు, నిధుల ప్రవాహం కూడా తగ్గిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు రెండు వైపులా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు.

### ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ సంక్షోభం ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారి తీయనుందని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్, యాక్సిస్ కాపిటల్ గ్లోబల్ రీసెర్చ్ హెడ్ నీలకంఠ మిశ్రా హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న ఉద్రిక్తతలు వచ్చే నాలుగు వారాల పాటు ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఓ డియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ ఇంధన సరఫరాలో దాదాపు 7 శాతం అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. ఇది కేవలం చమురు ధరల పెరుగుదల మాత్రమే కాకుండా నేరుగా ఇంధన కొరతకు దారితీస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో 4 శాతం నుండి 5 శాతం అంతరాయం కలిగితేనే ప్రపంచ జిడిపిలోనూ 4 – 5 శాతం కోత పడే అవకాశం ఉందన్నారు.




## అందుకే మద్యపానం మానేశా



మరింత ఫిట్‌గా ఉండేందుకు మద్యపానాన్ని మానేసినట్లు పంజాబ్ కింగ్స్ లెగ్‌స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ చెప్పాడు. ఐపీఎల్‌లో శాయశక్తులా రాణించేందుకు కృషి చేస్తానన్నాడు. ''గత ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌లో తుంటికి గాయమైంది. తర్వాత వేలి మధ్య భాగంలో గాయమైంది. ఆ తర్వాత సరిగ్గా బౌలింగ్ చేయలేకపోయా. అప్పటి నుంచి శరీరాన్ని ఫిట్‌గా ఉంచడంపైనే దృష్టి సారించా. అందుకోసం ఆరు నెలల నుంచి మద్యం తాగట్లేదు. ఇప్పుడు నా వయసు 35 ఏళ్లు. ఫిట్‌గా మారి వంద శాతం జట్టు విజయం కోసం కృష్టి చేయాలనే సంకల్పంతో ఉన్నా'' అని చాహల్ తెలిపాడు. గత సీజన్లో 14 మ్యాచ్‌లు ఆడిన చాహల్ 16 వికెట్లు పడగొట్టాడు. వేలానికి ముందు పంజాబ్ కింగ్స్ రూ.18 కోట్లతో చాహల్‌ను అట్టిపెట్టుకుంది. మార్చి 31న గుజరాత్ టాన్స్‌తో పంజాబ్ తన తొలి మ్యాచ్ ఆడనుంది.

# విరాట్ కోహ్లి ప్రాక్టీస్ ప్రారంభం




ఐపీఎల్–2026 సీజన్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సన్నద్ధమవుతున్నాడు. బుధవారం ఆర్సీబీ జట్టుతో చేరిన కోహ్లి.. తన తొలి నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో తీవ్రంగా శ్రమించాడు. గురువారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కోహ్లి తన ట్రేడ్‌మార్క్ షాట్లతో అలరించాడు. ముఖ్యంగా ఫుట్‌వర్క్ ఉపయోగిస్తూ ముందుకు వచ్చి మరి భారీ షాట్లతో విరుచుపడ్డాడు. దాదాపు ఏడాది నుంచి కేవలం వన్డేలకు పరిమితమైన కోహ్లి.. ఇప్పుడు టి20 ఫార్మాట్‌కు తగ్గట్టుగా తన బ్యాటింగ్‌ను మలుచుకోవడం విశేషం. అయితే కోహ్లి ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన కోహ్లి.. 151 సగటుతో 302 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. ఆ తర్వాత న్యూజిలాండ్‌పై కూడా తన ఫామ్‌ను కొనసాగించాడు. 3 మ్యాచ్‌ల్లో 80 సగటుతో 240 పరుగులు చేశాడు. ఇప్పుడు అదే జోరును ఐపీఎల్‌లో కూడా కొనసాగించాలని కింగ్ ఉవ్విళ్లూరుతున్నాడు. గత సీజన్‌లో 15 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి 657 పరుగులు చేసి ఆర్సీబీ తరపున టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. దీంతో ఆర్సీబీ తొలి టిల్ గెలవడంలో కోహ్లి కీలకపాత్ర పోషించాడు. ఆర్సీబీ తమ తొలి మ్యాచ్‌లో 28న చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది.

# కమిన్స్ హేజిల్‌వుడ్ బాటలోనే మిచెల్ స్టార్క్



ఐపీఎల్ 2026 సీజన్‌లో పదునైన బౌలింగ్‌తో లీగ్‌ను ఆరంభిద్దామని భావించిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు కలిసిరావడం లేదు. ఆ జట్టు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ తొలి వారం మ్యాచులకు దూరం కానున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ఆసీస్ పేసర్లు పాట్ కమిన్స్, హేజిల్‌వుడ్ బాటలోనే స్టార్క్ వెళ్లినట్లు అవుతోంది. ఇప్పటికే వారిద్దరూ గాయాలతో కొన్ని మ్యాచులకు దూరం కానుండగా.. స్టార్క్ మాత్రం భిన్నమైన కారణంతో అందుబాటులో ఉండటం లేదు. గత ఏడాదిగా మిచెల్ స్టార్క్‌పై తీవ్ర పనిభారం పడిందని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో అన్ని మ్యాచులు ఆడాడు. బిగ్‌బాష్ లీగ్‌లోనూ మెరిశాడు. టెస్టుల్లో అత్యధిక బంతులు విసిరిన బౌలర్ల జాబితాలో ముందున్నాడు. టీ20ల్లో నాలుగు ఓవర్లే అయినా.. ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. కొత్త బంతితో అద్భుతాలు చేసే స్టార్క్‌పై వర్క్‌లోడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆసీస్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే, రాబోయే రోజుల్లో 'రిటర్న్ టు ప్లే' ప్రొటోకాల్స్‌ను అనుసరించి క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతి ఇవ్వనుంది. దీంతో తొలివారంలో మ్యాచులకు అతడు దూరమయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయని క్రికెట్ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ టీ20లకు గతేడాది వీడ్కోలు పలికిన స్టార్క్.. టెస్టులు, వన్డేల్లో మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

## మరో ఐదు ఐపీఎల్ జట్లకు కొత్త కెప్టెన్లు!

ఐపీఎల్ 2026టోర్నమెంట్ ప్రారంభాని కంటే ముందే సన్ రైజర్స్ హైదరాబాద్ కు కొత్త కెప్టెన్ వచ్చేసాడు. ఈ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ లకు యంగ్ ప్లేయర్ ఇషాన్ కిషన్ కెప్టెన్ గా వ్యవహరించబోతున్నట్లు అధికారికంగా ప్రకటన చేసింది సన్ రైజర్స్ హైదరాబాద్



యాజమాన్యం. అదే సమయంలో అభిషేక్ శర్మను వైస్ కెప్టెన్ చేశారు కావ్య మారన్. పాట్ కమిన్స్ వెన్నునొప్పి గాయం నుంచి కోలుకున్న తర్వాత జట్టులో చేరతాడు. అప్పటి వరకు ఇషాన్ కిషన్ కెప్టెన్ గా కొనసాగుతాడు. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు తాత్కాలికంగా ఇషాన్ కిషన్ కెప్టెన్ గా నియామకం అయ్యాడు. దీంతో పాటు చెన్నై సూపర్ కింగ్స్ కు కూడా సంజు శాంసన్ త్వరలోనే కెప్టెన్ అవుతాడని ప్రచారం జోరుగా సాగుతోంది. అలాగే కేకేఆర్ కు కూడా రింకు సింగ్ కెప్టెన్ అవుతాడని సోషల్ డియాలో ప్రచారమైతే చేస్తున్నారు. త్వరలోనే దీనిపై కేకేఆర్ యాజమాన్యం నుంచి ప్రకటన వస్తుందని అంచనా వేస్తున్నారు. అటు ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ఇదే బాటలో నడవ బోతున్నట్లు చెబుతున్నారు. అక్షర్ పటేల్ స్థానంలో కేఎల్ రాహుల్ కు అవకాశం రాబోతున్నట్లు సమాచారం.

## మరోసారి తండ్రైన దినేశ్ కార్తీక్

భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ మరోసారి తండ్రయ్యాడు. అతడి భార్య దీపికా పల్లికల్ గురువారం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని దినేశ్ కార్తీక్ సోషల్ డియా వేదికగా తెలియజేస్తూ తన సంతోషాన్ని పంచుకున్నాడు. తమ కూతురికి 'రాహా'అని పేరు పెట్టినట్టు కార్తీక్ వెల్లడించాడు. దీపికా కూడా స్పోర్ట్స్ పర్సనే. స్క్వాష్‌లో స్టార్ క్రీడాకారిణి. 2015లో కార్తీక్, దీపిక వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇప్పటికే ఇద్దరు కొడుకులు కబీర్, జియాన్. క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కార్తీక్ ప్రస్తుతం ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.




# బుమ్రా బౌలింగ్‌కి మలుపు తిప్పిన బ్యాటర్లు




టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ సమయానికి ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్లలో ఒకరు. బుమ్రా బౌలింగ్‌లో పరుగులు చేయడం సాధారణంగా చాలా కష్టమే, అయితే అతని బౌలింగ్‌లో సిక్సర్లు కొట్టడం కూడా సులభం కాదు. అయితే, ఐపీఎల్ చరిత్రలో కొన్ని బ్యాట్స్‌మెన్లు బుమ్రా బౌలింగ్‌లో సిక్సర్లు కొట్టడం సునాయాసంగా చేశారు. ఐపీఎల్‌లో బుమ్రా బౌలింగ్‌లో ఐదు లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు కొట్టిన ఆటగాళ్లు కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా దిగ్గజ బ్యాట్స్‌మెన్ ఏబీ డివిలియర్స్ అగ్రస్థానంలో ఉన్నారు. బుమ్రా బౌలింగ్‌లో అత్యధికంగా ఎనిమిది సిక్సర్లు కొట్టిన ఘనత ఆయనదే. డివిలియర్స్ మొత్తం 85 బంతులు ఎదుర్కొని 147.05 స్ట్రైక్ రేట్‌తో 125 పరుగులు చేశాడు.రెండో స్థానంలో విరాట్ కోహ్లి ఉన్నారు. 101 బంతుల్లో ఆరు సిక్సర్లతో 150 పరుగులు చేసిన కోహ్లి, బుమ్రాపై తన నిలకడతో మంచి రికార్డును కొనసాగించారు. ఐపీఎల్‌లో బుమ్రాపై అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా కూడా కోహ్లి గుర్తింపు పొందారు. మూడో స్థానంలో జేపీ డుమిని ఉన్నారు. 33 బంతుల్లో ఆరు సిక్సర్లతో 70 పరుగులు చేసి, బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. చివరి స్థానంలో ఉన్న వారు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్. నిజానికి కమిన్స్ ఒక బౌలర్ అయినప్పటికీ, 34 బంతుల్లో ఐదు సిక్సర్లతో 54 పరుగులు చేశాడు.

# 2028 ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్స్‌కు భారత్ ఆతిథ్యం



2028 ప్రపంచ ఇండోర్‌అథ్లెటిక్స్ ఛాంపియన్స్ షిప్ ఆతిథ్య హక్కులు భారత్‌కు దక్కాయి. ఈమేరకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎఎఫ్‌ఐ) గురువారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. పోలండ్‌లోని టోరన్‌లో జరిగిన సమావేశంలో ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ ఏకగ్రీవంగా భారత్‌కు ఆతిథ్య హక్కులు అప్పగించింది. 2026 ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్స్ షిప్ పోటీలకు పోలండ్‌లో జరగనుండగా.. ఆ తర్వాత జరిగే ఎడిషన్ పోటీల ఆతిథ్య హక్కులకు ఈ సమావేశం జరిగింది. 2004లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఈవెంట్‌కు భారత్ ఆతిథ్యమిచ్చిన అనుభవం ఉండగా? ప్రపంచ ఆఫ్ మారథాన్‌ను దిగ్విజయంగా నిర్వహించింది. భారత్‌కు ఆతిథ్య హక్కులు దక్కేందుకు ఇరువురు డెలిగేట్లు ఆమోదం తెలపడం గమనార్హం. మార్చి 24, 25న జాతీయ ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ వేదికగా జరగనున్నాయి. అలాగే 2028 ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్ పోటీల వేదికలైన కళింగ స్టేడియంను గత నెలలో సందర్శించి పోటీల నిర్వహణకు భారత్ సరైన వేదిక అని వెల్లడించినట్లు సమాచారం.

# వుదయం సినిమా

## 14న కరుప్పు
### వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్



సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'కరుప్పు' కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. సూర్య పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించిన 'కరుప్పు' ఫస్ట్ లుక్ టీజర్ సంచలనం క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ సూర్య ఇంటెన్స్ లుక్ అదిరిపోయింది. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ. తారాగణం: సూర్య, త్రిష, ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి, శ్శివాడ, సుప్రీత్‌రెడ్డి, రచన & దర్శకత్వం: ఆర్జే బాలాజీ, సినిమాటోగ్రఫీ – జికె విష్ణు, సంగీతం – సాయి అభ్యంకర్, యాక్షన్ అన్బరివ్ – విక్రమ్ మోర్, ఎడిటర్ – ఆర్.కలైవానన్, ప్రొడక్షన్ డిజైన్ – అరుణ్ వెంజారాముడు, నిర్మాతలు: ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు, పీఆర్వో – వంశీ–శేఖర్.

## మెగాస్టార్ ప్రాజెక్ట్
### పేద ప్రజలకు ఉచిత విద్య సిద్ధమవుతున్న చిరంజీవి



వెండితెర రారాజుగా కోట్లాది అభిమానులు, ప్రేక్షకులని అలరించే మెగాస్టార్ చిరంజీవి, సినిమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటూ, తెరపై మాత్రమే కాదు నిజ జీవితంలో కూడా రియల్ హీరోగా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆయన స్థాపించిన చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్, బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి సంస్థలు దశాబ్దాలుగా ప్రజా సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తూ, అనేక సంక్షోభ సమయాల్లో ప్రజలకు ప్రాణదాతలుగా నిలిచాయి. ఏదైనా ప్రకృతి విపత్తు, అనుకోని అత్యవసర పరిస్థితి అయినా, సహాయం అందించడానికి ముందుకు వచ్చే వారిలో మెగాస్టార్ ఎప్పుడూ ముందుంటారు. ఉగాది ప్రత్యేక కార్యక్రమంలో చిరంజీవి ఒక ముఖ్యమైన కొత్త కార్యక్రమం గురించి చెప్పారు. "రక్తం ప్రాముఖ్యతను, రక్త కొరత కారణంగా ఎన్ని ప్రాణాలు పోతున్నాయో నేను అర్థం చేసుకున్నప్పుడు, నా అభిమానులందరినీ రక్తదానంలో పాల్గొనేలా స్ఫూర్తిని ఇవ్వాల్సిన అవసరం ఉందని నాకు అనిపించింది. ఆ ఆలోచన నాకు 25 ఏళ్ల క్రితమే కలిగింది"

"నేను కేవలం అక్కడితోనే ఆగిపోదలచుకోలేదు. భవిష్యత్తులో పేద ప్రజలకు విద్యను ఎలా అందించాలనే దానిపై ఇప్పుడు ఆలోచిస్తున్నాను. నన్ను స్ఫూర్తిగా తీసుకుని నటుడు సూర్య 'అగరం ఫౌండేషన్'ను ప్రారంభించారు. ఇప్పుడు, నేను ఆయన నుంచి స్ఫూర్తి పొంది ఉచిత విద్యా బోధనను ప్రారంభించాలనుకుంటున్నాను. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఎక్కడైతే అవసరం ఉంటుందో, అక్కడ ఉచిత విద్యను అందించే దిశగా కృషి చేస్తాను" ఈ కొత్త విద్యా కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తానని ఆయన చెప్పారు. సమాజానికి ఉపయోగపడే మరో గొప్ప ప్రయత్నానికి శ్రీకారం చుట్టబోతున్నారు మెగాస్టార్ చిరంజీవి.



## గుంటూరులో స్టూడియోస్ 81
### నగర నడిబొడ్డ సినిమా థియేటర్ల ప్రారంభం

4 కే లేజర్ ప్రొటెక్షన్, యాక్సిడెంట్ యాక్స సి సిల్వర్ స్క్రీన్ లతో అధునాతమైన హంగులతో గుంటూరు నడిబొడ్డున ఉగాది పండుగ సందర్భంగా స్టూడియో 81 నూతన థియేటర్లో ప్రారంభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రేక్షకుల ఆహ్లాదమే ముఖ్యమైన అంశంగా స్టూడియో 81 థియేటర్లను సిద్ధం చేసిందన్నారు. మొత్తం ఐదు స్క్రీన్ లలో 849 సీట్ల కెపాసిటీతో అధునాతన హంగులతో నగర ప్రజలకు థియేటర్ అందుబాటులోకి వచ్చాయని కుటుంబ సమేతంగా సినిమాలను చూసి ఆనందభర్తంగా ఉండాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా అమెరికా నుండి తెచ్చిన తాజా నబ్రస్క మొక్కజొన్న అనేక రకమైన రుచికరమైన మసాలా దినుసులతో సినిమా చూసే వారికి పాప్కాన్ అనుభవానిస్తుందన్నారు. థియేటర్ లోపల విశాలమైన లాబీలు, సౌకర్యవంతమైన వెయిటింగ్ ఏరియాలో సులభమైన టికెటింగ్ వ్యవస్థ, అతిథుల కోసం ఉచిత వైఫై లాంటి సౌకర్యాలతో అద్భుతంగా రూపొందించబడిందన్నారు. సాంకేతికత సౌకర్యం, ఆహ్లాదకరమైన ఆహార పానీయాల అనుభవం పై దృష్టి సారించడంలో స్టూడియో 81 సినిమా రంగంలో ఒక సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతూ ప్రతి సినిమా అనుభవాన్ని ఒక సంపూర్ణ వినోదపరిత అనుభవంగా మారుస్తుందని సందేహం లేదన్నారు.

## లవ్‌వాలా గ్రాండ్ గా లాంచ్



రవీంద్ర తేజ్ హీరోగా ఎస్వీఎన్ ఎంటర్‌టైన్‌మెంట్ & శుభకరి ఇన్‌ఫ్రా&మీడియా బ్యానర్స్ నిర్మిస్తున్న చిత్రం'లవ్‌వాలా'. బ్లాక్ బస్టర్ డైరెక్టర్స్ కొరటాల శివ, బుచ్చిబాబు సానా వద్ద అసోషియేట్ గా పని చేసిన రంజిత్ కుమార్ దేశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ బ్యాక్ డ్రాప్ లవ్ స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రంలో అరియా మోడీ హీరోయిన్ గా నటిస్తోంది.

శుక్రవారం పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఘనంగా లాంచ్ చేశారు. డైరెక్టర్ కొరటాల శివ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కొరటాల శివ, బుచ్చిబాబు సానా మేకర్స్ కు స్క్రిప్ట్ అందజేశారు. పలువురు సినీ ప్రముఖులు, మూవీ యూనిట్ సభ్యులంతా పాల్గొన్న ఈ వేడుక ఘనంగా జరిగింది. ఈ చిత్రంలో రాజ్ అర్జున్, మణి చందన, కమల్, నవీన్ నేని, నాగ మహేష్, రష్మీ గౌతమ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జమ్మా శ్రీను డీవోపీ, తూము రాము ఎడిటర్, ఆర్ట్ డైరెక్టర్ బేబీ సురేశ్ భీమగాని. మూవీ ఓపెనింగ్ ప్రెస్ మీట్ లో నిర్మాత మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసి మమల్ని బ్లెస్ చేసిన బ్లాక్ బస్టర్ డైరెక్టర్స్ కొరటాల శివ గారికి, బుచ్చిబాబు సానా గారికి ధన్యవాదాలు. సినిమా అంటే పాషన్ తో నిర్మాణం రంగంలోకి అడుగుపెడుతున్నాం. రంజిత్ చెప్పిన కథ మాకు చాలా నచ్చింది. ఇది చాలా మంచి లవ్ స్టోరీ. రవి హీరోగా నటిస్తున్నారు. అరియ మోడీని హీరోయిన్ గా పరిచయం చేస్తున్నాం. ఫస్ట్ షెడ్యూల్ తర్వాత మరిన్ని వివరాలు తెలియజేస్తాం.

హీరో రవీంద్ర తేజ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మమ్మల్ని బ్లెస్ చేసిన కొరటాల శివకి, బుచ్చిబాబు సానాకి ధన్యవాదాలు. ఈ సినిమా పేరు లవ్ వాలా. త్వరలోనే ఫస్ట్ గ్లింప్స్ తో అందరినీ అలరిస్తాం. డైరెక్టర్ రంజిత్ కుమార్ దేశెట్టి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మమ్మల్ని బ్లెస్ చేసిన మా గురూజీ కొరటాల శివ గారికి, బుచ్చిబాబు సానా గారికి ధన్యవాదాలు. నేను శివ గారు, బుచ్చిగారి దగ్గర అసోషియేట్ గా పని చేశాను. ఈ కథ రాసిన తర్వాత సురేష్‌కి చెప్పాను. ఆయన చాలా నచ్చింది. ఇదొక రూరల్ బ్యాక్ డ్రాప్ లో జరిగే మంచి లవ్ స్టోరీ.

**నటీనటులు :**

రవీంద్ర తేజ్, అరియ మోడీ, రాజ్ అర్జున్, మణి చందన, కమల్, నవీన్ నేని, నాగ మహేష్, రష్మీ గౌతమ్, దర్శకత్వం: రంజిత్ కుమార్ దేశెట్టి, బ్యానర్: ఎస్వీఎన్ ఎంటర్‌టైన్‌మెంట్ & సుభాకరి ఇన్‌ఫ్రా, మీడియా, సంగీతం: విజయ్ బుల్గానిన్, డీవోపీ: జమ్మా శ్రీను, ఎడిటర్: తూము రాము, ఆర్ట్: బేబీ సురేశ్ భీమగాని, కాస్ట్యూమ్ డిజైనర్: దివ్య కాంతమనేని, మాధురి బద్దిగారి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శివ నాగ కృష్ణ ఉప్పలపాటి, పీఆర్వో: వంశీ శేఖర్.

## ఈగో రాజాగా ఆది సాయి కుమార్
### టైటిల్ పోస్టర్ విడుదల



సక్సెస్ ఫుల్ హీరో ఆది సాయి కుమార్ హీరోగా ఎస్‌జీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద జి.సురేష్ నిర్మిస్తున్న చిత్రం 'ఈగో రాజా', ఈ మూవీని గురు శరవణన్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఆదితో పాటుగా నటుడు సతీష్ ముఖ్య పాత్రని పోషిస్తున్నారు. తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంగా రూపు దిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌కు స ంబ ంధించిన అప్డేట్‌ను ఉగాది సందర్భంగా రివీల్ చేశారు. యాక్షన్, ఎమోషన్, మాస్ అప్పీల్‌తో రాబోతోన్న ఈ మూవీ అద్భుతంగా ఉండబోతోందని టీం నమ్మకంగా చెబుతోంది. ఉగాది పండుగ సందర్భంగా మేకర్స్ ఆది సాయి కుమార్ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. చుట్టూ రౌడీలు, ఒంటిపై గాయాలు, రక్తం మరకలు చూస్తుంటే హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉండేట్టుగానే కనిపిస్తున్నాయి. ఇక ఆది లుక్ కూడా చాలా డిఫరెంట్‌గా, అగ్రెస్సివ్‌గా ఉంది. చేతిలో సిగరెట్ పెట్టుకున్న తీరు, ఆది కాస్ట్యూమ్స్ ఇలా అన్నీ కూడా ప్రామిసింగ్‌గా ఉన్నాయి. కె.ఎస్. రవికుమార్ వద్ద పనిచేసిన దర్శకుడు గురు శరవణన్ 'కూగల్ కుట్టప్ప'తో మంచి విజయాన్ని అందుకున్నారు. తన మూడో చిత్రమైన 'ఈగో రాజా'తో శరవణన్ హ్యాట్రిక్ కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటివరకు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. 'శంబాల' లాంటి బ్లాక్‌బస్టర్ విజయంతో దూసుకుపోతున్న ఆది సాయి కుమార్ ఈ చిత్రంతో తమిళ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. 'కంజూరింగ్ కన్నప్పన్', 'సట్టం ఎన్ కైయిల్' ఫేమ్ సతీష్ ఈ హై–ఆక్టేన్ యాక్షన్ చిత్రంలో ఓ పాత్రను పోషిస్తున్నారు. మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ, గిబ్రాన్ సంగీతం, దుర్గైరాజ్ ఆర్ట్ మేనేజ్‌మెంట్‌తో, అద్భుతమైన సాంకేతిక బృందం సహకారంతో ఈ చిత్రం షూటింగ్ పూర్తి స్థాయిలో జరుగుతోంది. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ ప్రకటిస్తామని మేకర్లు తెలిపారు.



## అట్టహాసంగా కలర్స్ హెల్త్‌కేర్ ప్రారంభం
### అత్యుత్తమ టెక్నాలజీతో 'కలర్స్ 2.0' వెల్నెస్ సేవలు

**గాజువాక:** ఆరోగ్యంతోనే అందం ముడిపడి ఉందని, అందుకోసం యువత ఫిట్‌నెస్‌కి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హీరోయిన్ ఈషా రెబ్బ అన్నారు. ప్రముఖ వెల్నెస్, హెల్త్‌కేర్ సంస్థ 'కలర్స్ ఏర్పాటుచేసిన నూతన బ్రాంచ్ 'కలర్స్ 2.0'ను గాజువాకలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతంలో తాను రెండు సినిమాల్లో నటిస్తున్నట్టు చెప్పారు. పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం అందం సిద్ధిస్తుందన్నారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యం, అందంపై శ్రద్ధ అత్యంత అవసరమని పేర్కొన్నారు. బరువు తగ్గడం, జుట్టు, చర్మ సమస్యలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆధునిక చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. కలర్స్ సంస్థ సేవలు ఇప్పటికే అనేక మందిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయని తెలిపారు.

## 'రాకాస' నుంచి 'స్నేక్ డ్యాన్స్'
### వీడియో సాంగ్ రిలీజ్



నిహారిక కొణిదెల నిర్మాతగా తెరకెక్కించిన 'కమిటీ కుర్రోళ్లు'తో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ఇక ప్రస్తుతం నిహారిక జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు.

మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ని చిత్రయూనిట్ ప్రారంభించింది. ఇప్పటి వరకు 'రపప్పా', 'పదే పదే' పాటల్ని మేకర్లు రిలీజ్ చేశారు. ఇక తాజాగా ఈ మూవీ నుంచి 'స్నేక్ డ్యాన్స్' అనే పాటను విడుదల చేశారు. ఈ వీడియో సాంగ్‌ని చూస్తుంటే ఇదొక ప్రమోషనల్ గీతంగా కనిపిస్తోంది. గ్యాంగ్ అంతా కలిసి ఎంజాయ్ చేసేలా ఈ పాటను కంపోజ్ చేశారు. 'స్నేక్ డ్యాన్స్' పాటలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, సంగీత్ శోభన్, నయన్ సారిక తమ స్టైల్లో దుమ్ములేపేశారు. ఇక చివర్లో మెగా ప్రొడ్యూసర్ నిహారిక వేసిన స్టెప్పులు హైలెట్‌గా నిలిచాయి. ఈ పాటకు అనుదీప్ క్యాచీ ట్యూన్‌ను ఇచ్చారు. రఘురాం సాహిత్యం ఇట్టే ఆకట్టుకునేలా ఉంది. బెన్నీ దయాల్, మనీషా పాండ్రంకి, రితేష్ జి రావు, లక్ష్మీ మేఘన, వినాయక్ గాత్రం ఈ పాటకు ప్రధాన ఆకర్షణ. రాజు ఎదురోలు ఈ మూవీకి సినిమాటోగ్రఫర్‌గా, అన్వల్ అలీ ఎడిటర్‌గా పని చేశారు. ఏప్రిల్ 3న ఈ మూవీని భారీ ఎత్తున విడుదల చేయబోతోన్నారు. నటీనటులు : సంగీత్ శోభన్, నయన్ సారిక, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను తదితరులు.



## క్రేజీ కల్యాణం
### ఉదయ్ పాత్రలో హీరో అఖిల్ రాజ్ ఉడ్డెమారి
### ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. శుక్రవారం ఉగాది పండుగ సందర్భంగా "క్రేజీ కల్యాణం" మూవీ నుంచి యంగ్ హీరో అఖిల్ రాజ్ ఉడ్డెమారి నటించిన ఉదయ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో అఖిల్ రాజ్ ట్రెడిషనల్ వేర్ లో హ్యాపీగా డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నారు. "రాజు వెడ్స్ రాంబాయి" సక్సెస్ తర్వాత "క్రేజీ కల్యాణం" తనకు మరో సూపర్ హిట్ అందిస్తుందని అఖిల్ రాజ్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్‌మెంట్ తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో "క్రేజీ కల్యాణం" సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి "క్రేజీ కల్యాణం" సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. నటీనటులు – నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, టెక్నికల్ టీమ్ : కాస్ట్యూమ్ డిజైనర్ – జె.గాయత్రి దేవి, ఆర్ట్ డైరెక్టర్ – సాయి కదిర, ప్రొడక్షన్ డిజైనర్ – శ్రీపాల్ మాచర్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ – అఖిల్ సాయి శ్రీమూర్తి, కొరియోగ్రాఫర్ – ఈశ్వర్ పెంటి, యాక్షన్ – డ్రాగన్ ప్రకాష్, లిరిక్స్ – గోరటి వెంకన్న, చైతన్య ప్రసాద్, కాసర్ల శ్యామ్, ఎడిటర్ – శ్రావణ్ కటికనేని, డీవోపీ – శ్యామ్ దూపాటి, మ్యూజిక్ – సురేష్ బొబ్బిలి, స్క్రీన్ ప్లే – శ్రీనివాస రవీంద్ర (ఎంఎస్ఆర్), పీఆర్ఓ – జీఎస్ కే మీడియా (సురేష్ – శ్రీనివాస్), ప్రొడ్యూసర్ – బూసం జగన్ మోహన్ రెడ్డి, స్టోరీ, స్క్రీన్ ప్లే , డైలాగ్స్, డైరెక్షన్ – బద్రప్ప గాజుల.

## సన్ నెక్ట్స్‌లో సీతా పయనం
### నేటి నుంచి స్ట్రీమింగ్




తండ్రీకూతుళ్లైన అర్జున్ సర్జా, ఐశ్వర్య అర్జున్‌ల అద్భుతమైన కలయికతో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలలో రూపొందిన చిత్రం 'సీతా పయనం'. అర్జున్ సర్జా, ఐశ్వర్య అర్జున్, ధ్రువ సర్జా, నిరంజన్, ప్రకాష్ రాజ్, సత్యరాజ్‌లతో కూడిన ప్రఖ్యాత తారాగణంతో, 'సీతా పయనం' కుటుంబం, ప్రేమ మరియు జీవితంలోని ఊహించని ప్రయాణాల సారాంశాన్ని అందంగా ఆవిష్కరించే గొప్ప వినోదాత్మక చిత్రం. అర్జున్ సర్జా, ఐశ్వర్య అర్జున్ ఇద్దరి మధ్య ఉన్న భావోద్వేగమయిన సీన్స్ ఈ చిత్రాన్ని మరింత ప్రత్యేకంగా నిలుపుతుంది. ఈ చిత్రానికి ప్రామాణికతను, ఆత్మీయతను జోడించి, మన హృదయాలను కదిలింప చేస్తుంది . అనూప్ రూబెన్స్ అందించిన సంగీతం సినిమాకు ప్రాణం పోసింది అని చెప్పవచ్చు, ఈ చిత్రం ప్రేక్షకులను నవ్విస్తూ, ఆలోచింపజేస్తూ, వాళ్ళ ప్రియమైన వ్యక్తుల తో తిరిగి అనుబంధాన్ని ఏర్పరచుకునేలా రూపొందించబడింది.

ఈ కథకు కేంద్రబిందువు సీత. ఆమె తల్లిని కోల్పోయిన తర్వాత, ఆమె తండ్రి రాజేంద్ర ప్రసాద్ (సత్యరాజ్) అపారమైన ప్రేమతో పెంచిన ఆమె ప్రపంచమే సీత. వారి బంధం చాలా సన్నిహితమైనది మరియు హృదయాన్ని కదిలించేది. అయితే, సీత పెళ్లి ఆలోచనను తప్పించుకుంటూ ఉండగా, వైజాగ్ నుండి హైదరాబాద్‌కు ఆమె చేసే ప్రయాణంలో జీవితం ఊహించని మలుపు తీసుకుంటుంది. యాదృచ్ఛికంగా జరిగే పరిచయాలు, ఆశ్చర్యకరమైన సంఘటనలు, గిరి (అర్జున్ సర్జా) మరియు బసవన్న (ధ్రువ సర్జా)ల ప్రవేశంతో ఈ భావోద్వేగభరితమైన ప్రయాణం ఎలా సాగుతుందో అదే ప్రధానాంశం.

ఐశ్వర్య అర్జున్ ఈ మూవీ గురించి తన మాటల్లో ఇలా స్పందించారు. "'సీతా పయనం'లో భాగమైనందుకు నేను చాలా కృతజ్ఞతగా మరియు భావోద్వేగానికి గురవుతున్నాను. ఈ చిత్రంలో మా నాన్నగారితో కలిసి పనిచేయడం దీనిని మరింత ప్రత్యేకంగా చేసింది. ఇది ఎన్నో విషయాలు నేర్చుకోవడం, ప్రేమ మరియు ఎంతో నమ్మకంతో నిండిన ప్రయాణం. ఆయన నాకు కేవలం ఒక దర్శకురాలిగానే కాకుండా, నన్ను నిజంగా నమ్మిన వ్యక్తిగా మార్గనిర్దేశం చేశారు. ఈ చిత్రం ఎప్పటికీ నా హృదయానికి చాలా దగ్గరగా ఉంటుంది. ఈ ఉగాదికి సన్ ఎన్‌ఎక్స్‌టీలో ప్రేక్షకులు సీత ప్రయాణాన్ని చూడబోతున్నందుకు నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను." అర్జున్ సర్జా ..."ఈ ఉగాది నా జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన క్షణాలలో ఒకటి. 'సీతా పయనం' అనేది బంధాలు, జీవితం తీసుకునే ఊహించని మార్గాల గురించిన కథ. దీనిని సన్ ఎన్‌ఎక్స్‌టీ లో కుటుంబాలతో పంచుకోవడానికి ఉగాది కంటే మంచి సందర్భం నాకు దొరకదు." ప్రకాష్ రాజ్ ఇలా పంచుకున్నారు: "'సీతా పయనం'లోని సరళత, భావోద్వేగపరమైన నిజాయితీ నన్ను ఆకట్టుకున్నాయి. ఇది ప్రతి కుటుంబాన్ని, ప్రతి బంధాన్ని హత్తుకునే కథ. కథ చెప్పడంలో క్రమశిక్షణ, హృదయాన్ని స్పృశించే అర్జున్‌తో పనిచేయడం ఈ అనుభవాన్ని నిజంగా చిరస్మరణీయం చేసింది." సత్యరాజ్ ఇంకా ఇలా అన్నారు: "ఈ చిత్రంలోని తండ్రీ–కూతుళ్ల బంధం చాలా ప్రత్యేకమైనది, మనకు బాగా దగ్గరగా అనిపించేది. అది నాకు ఆ నిశ్శబ్దమైన బలాన్ని, ప్రేమను గుర్తుచేసింది."

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.